www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 29-9-2024 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 165 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, బహుళపక్షం; తిథి: ద్వాదశి సా 4.48 తదుపరి త్రయోదశి; నక్షత్రం: మఖ పూర్తి; వర్జ్యం: సా. 4.58 -6.45; దుర్ముహూర్తం: సా. 4.26-5.14; అమృతఘడియలు: తె. 3.38-5.25; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 6.08; సూర్యాస్తమయం: 6.01 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రంగంలోకి సిట్

నాటి ఈవోలు, చైర్మన్లకూ నోటీసులు?



తిరుమల ఆలయం ముందు సిట్ బృందం

కల్తీ నెయ్యిపై దర్యాప్తు ప్రారంభం

అన్ని కోణాల్లో సమగ్రంగా విచారణ

మూడు బృందాలుగా 'సిట్' అధికారులు

తిరుమల, తిరుపతిలో రెండు టీమ్‌లు

ఏఆర్ డెయిరీపై మరో బృందం విచారణ

తిరుపతి/అమరావతి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ ప్రసాదం తయారీకి వినియోగించే నెయ్యిలో కల్తీపై దర్యాప్తు మొదలైంది. కల్తీ నెయ్యి లోగుట్టు లాగేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) రంగంలోకి దిగింది. 2019కి ముందు ఏం జరిగింది? ఆ తర్వాత ఏం మారింది? ఇప్పుడు పరిస్థితి ఏమిటి? నెయ్యి కొనుగోలు సూత్రధారులు, పాత్రధారులు, విధి విధానాలపై సమగ్రంగా కూపీ లాగాలని సిట్ నిర్ణయించుకుంది. అంతే కాదు... ఈ వివరాలన్నీ తెలుసుకునేందుకు అప్పట్లో టీటీడీ ఈవోలు, బోర్డు చైర్మన్లుగా వ్యవహరించిన వారికీ నోటీసులు ఇచ్చి, పిలిపించి ప్రశ్నించాలని నిర్ణయించుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. గుంటూరు ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి నేతృత్వంలో విశాఖ రేంజి డీఐజీ

మిగతా 11వ పేజీలో...



తిరుమల ఆలయంలో ధ్వజస్తంభానికి మొక్కుతున్న కలాం (ఫైల్)

ఇదీ కలాం విజ్ఞత!

రెండుసార్లు తిరుమలకు

రాష్ట్రపతి హోదాలోనే ఒకసారి

డిక్లరేషన్ ఇచ్చాకే స్వామి దర్శనం

ముందుగానే టీటీడీ నిబంధనలు తెలుసుకున్న కలాం

డిక్లరేషన్‌పై ఢిల్లీలోనే సంతకం చేసి తిరుమలకు పంపిన వైనం

జగన్‌కు ఎందుకు భేషజం?

డిక్లరేషన్‌పై నానాయాగీ

డిక్లరేషన్ ఇచ్చినంత మాత్రాన మతం మారినట్లు కాదు

దేవదాయ చట్టం ప్రకారం ఇవ్వాల్సిందే

నెయ్యి.. నిప్పు!

లడ్డూ వివాదానికి ఆజ్యం పోసిన జగన్

హిందుత్వ, దేశంపై అనుచిత వ్యాఖ్యలు

మరింత రెచ్చగొట్టిన వైఎస్ జగన్

ఇతర రాష్ట్రాలకు పాకిన నిరసనలు

బెంగళూరుకు జగన్

ఆలయాల్లో పూజలకు స్పందన అంతంతే



బాబాయి హత్య జరిగిన రోజు

మానవత్వం ఏమైంది!

తిరుమలకు వెళ్లదలుచుకోకే సాకులు

టీటీడీ బోర్డులో దళితులను నియమించలేదేం: హోం మంత్రి అనిత

లడ్డూపై రేపు సుప్రీంలో విచారణ

అన్ని పిటిషన్లూ ఒకేసారి విననున్న బెంచ్

లడ్డూ అపవిత్రం కావడంపై విచారణకు కొన్ని

ఆలయ నిర్వహణలో జవాబుదారీ కోసం మరికొన్ని

మొత్తం ఐదు పిటిషన్లు సుప్రీంలో దాఖలు

విచారించనున్న ద్విసభ్య ధర్మాసనం 11



శనివారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో లులూ గ్రూప్ చైర్మన్, ఎండీ యూసుఫ్ అలీ

లులూ.. బ్యాక్ టు ఏపీ!

నాడు జగన్ దెబ్బకు పారిపోయిన దిగ్గజ సంస్థ

నేడు మళ్లీ రాష్ట్రంలో పెట్టుబడులకు సిద్ధం

విశాఖలో మెగా మాల్, మల్టీప్లెక్స్, హైపర్ మార్కెట్

బెజవాడ, తిరుపతిలో మల్టీప్లెక్స్‌లకు ప్రణాళికలు

చంద్రబాబుతో లులూ చైర్మన్ యూసుఫ్ అలీ భేటీ

ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో భారీ పెట్టుబడులపై చర్చ

పూర్తి సహకారం ఉంటుందని చంద్రబాబు భరోసా

అమరావతి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దిగ్గజ పారిశ్రామిక సంస్థ లులూ గ్రూప్ ఇంటర్నేషనల్ మళ్లీ రాష్ట్రంలో భారీస్థాయిలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. విశాఖపట్నంలో అతి భారీ షాపింగ్ మాల్ నిర్మాణానికి గత తెలుగుదేశం ప్రభుత్వంలో ఈ సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. అప్పట్లో రూ. 2,200 కోట్ల పెట్టుబడితో విశాఖలో నిర్మించతలపెట్టిన అంతర్జాతీయ కన్వెన్షన్

మిగతా 12వ పేజీలో...

వరద సహాయ చర్యలు భేష్

మీ లాంటి పనితీరు ఎక్కడా చూడలేదు 2

చంద్రబాబుతో భేటీలో బీజేపీ నేత సిద్ధార్థ్‌నాథ్

జాగ్రత్త.. రేవంత్!



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కొన్ని వ్యూహాత్మక తప్పిదాల వల్ల భారత రాష్ట్ర సమితి ముఖ్య నాయకులు కేటీఆర్, హరీశ్‌రావు ఇటీవలి కాలంలో దూకుడు పెంచి రేవంత్ రెడ్డి సర్కార్‌పై విరుచుకుపడుతున్నారు. భవిష్యత్తుపై ఆ పార్టీ నాయకుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల వరకు జోరుమీదున్న భారతీయ జనతా పార్టీ ప్రస్తుతం ఎందుకో నెమ్మదించింది. రాష్ట్రం నుంచి కిషన్ రెడ్డి, బండి సంజయ్ కేంద్ర మంత్రులుగా ఉన్నప్పటికీ ఆ పార్టీ కార్యక్రమాలు మందగించాయి. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఎదగాలని భావించిన బీజేపీ ఇప్పుడు వెనుకబడింది. అదే సమయంలో భారత రాష్ట్ర సమితి స్పీడ్ పెంచింది.

రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన నాటి జోష్ ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో కనిపించడం లేదు. మంత్రులు కూడా ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం తీసుకున్న నిర్ణయం కారణంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పార్టీలో, ప్రభుత్వంలో పట్టు చిక్కడం లేదు.

ఇందిరాగాంధీ హయాంలో కీలక అంశాలపై నిర్ణయాలు తీసుకోనే ముందు అధిష్ఠానం తరఫున దూతలు ఆయా రాష్ట్రాలకు వెళ్లి అభిప్రాయ సేకరణ జరిపే వారు. ముఖ్యమంత్రులను మార్చాలనుకున్నప్పుడు కూడా అధిష్ఠానం నుంచి దూతలు వచ్చే వారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు కాంగ్రెస్ అధిష్ఠానం తరఫున దూతగా జీకే మూపనార్ వస్తున్నారంటే ముఖ్యమంత్రుల గుండెల్లో రైళ్లు పరిగెత్తేవి.

ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కాంగ్రెస్ అధిష్ఠానం ఆయనకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చింది. ఫలితంగా అప్పట్లో అసంతృప్త స్వరాలు వినిపించేవి కావు. పార్టీ పైనా, ప్రభుత్వంపైనా రాజశేఖర రెడ్డికి పూర్తి పట్టు ఉండేది.

ఇప్పుడు అవినీతి ప్రాతిపదికన ఎన్నికల్లో ప్రజల తీర్పు ఉండటం లేదు. అలా అయితే జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయివుండే వారే కారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కేసీఆర్ అవినీతికి పాల్పడిన తీరును రుజువు చేసినా కాంగ్రెస్ పార్టీకి అదనపు ప్రయోజనం ఉండకపోవచ్చు.

కొత్త పలుకు -ఆర్కే విశ్లేషణ 4లో

హిజ్బుల్లా చీఫ్ నస్రల్లా హతం

బీరుట్ బంకర్‌లో సమావేశం.. గుర్తించి దాడి జరిపిన ఇజ్రాయెల్

నస్రల్లా కూతురు జైనబ్ మృతిచెందినట్లు ఐడీఎఫ్ ప్రకటన

బీరుట్‌పై కొనసాగుతున్న దాడులు.. 720కి చేరిన మరణాలు

ఇరాన్‌లో హైఅలెర్ట్.. రహస్య ప్రదేశానికి సుప్రీం లీడర్ ఖమేనీ

ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ జనరల్ అబ్బాస్ నిల్ఫోరుషన్ కూడా..



టెల్‌అవీవ్/బీరుట్, సెప్టెంబరు 28: ఇరాన్ మద్దతుతో.. లెబనాన్ భూభాగం పైనుంచి ఇజ్రాయెల్‌పై భీకర క్షిపణి దాడులు చేస్తున్న హిజ్బుల్లా ఉగ్ర సంస్థకు పెద్ద దెబ్బ తగిలింది. శుక్రవారం రాత్రి దక్షిణ బీరుట్‌లోని దహియాపై ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) వైమానిక దళం చేసిన క్షిపణి దాడుల్లో.. హిజ్బుల్లా చీఫ్ హసన్ నస్రల్లా మృతిచెందారు. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ జనరల్ అబ్బాస్ నిల్ఫోరుషన్ కూడా ఈ దాడిలో దుర్మరణంపాలయ్యారు. వీరిద్దరితో పాటు.. హిజ్బుల్లాకు చెందిన ఒక కమాండర్ అలీ కర్కీ, ఇద్దరు డిప్యూటీ కమాండర్లు, నస్రల్లా కుమార్తె జైనబ్ నస్రల్లా కూడా మృతి చెందినట్లు ఐడీఎఫ్ శనివారం ఉదయం ప్రకటించింది. మధ్యాహ్నానికి

మిగతా 2వ పేజీలో...

పకడ్బందీగా పథకాల అమలు



సీఎం చంద్రబాబు లక్ష్యాలను సాధించేలా అడుగులు

ప్రజలకు మేలు చేసేలా మా ప్రభుత్వం పనిచేస్తుంది

రాష్ట్రానికి తగినన్ని నిధులు ఇచ్చేందుకు కేంద్రం సిద్ధం

వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీ రాజ్ వ్యవస్థ నిర్వీర్యం: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ 12

కేంద్రమంత్రి నిర్మలపై కేసు

ఎలక్టోరల్ బాండ్ల పేరిట 8 వేల కోట్ల దోపిడీ ఆరోపణలు 2

జనాధికార సంఘర్ష పరిషత్ ఉపాధ్యక్షుడు అయ్యర్ ఫిర్యాదు

ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ప్రజాప్రతినిధుల కోర్టు ఆదేశం

నిర్మలతో పాటు ఈడీ, బీజేపీ నేతలపైనా కర్ణాటకలో ఎఫ్ఐఆర్

వెంకటరెడ్డిలాంటి తీగలే కాదు..

ప్యాలెస్‌లోని డొంకలూ కదలాలి



వేల కోట్లు దోచుకున్న ఘనాపాఠి ఎవరో ప్రజలందరికీ తెలుసు

పెద్ద తిమింగలాన్ని పట్టుకునేలా దర్యాప్తు సాగాలి 12

సహజ వనరుల దోపిడీపై సీబీఐ విచారణ కోరండి: షర్మిల

డిప్యూటీ సీఎంగా ఉదయనిధి

నేడు ప్రమాణం చేయనున్న స్టాలిన్ తనయుడు

ఇప్పటికే మంత్రిగా కీలకం.. ఇప్పుడిక డీఎంకేపైనా పూర్తిగా పట్టు

కేబినెట్ విస్తరణలో భాగంగా నిర్ణయం 2



ఢిల్లీలో బాబు బ్రాండ్

వంద రోజుల్లో ఇన్ని నిధులు ఓ అద్భుతం

ఇప్పటికే రూ.60 వేల కోట్లకు సమ్మతి తెలిపిన కేంద్రం

పెట్రో కారిడార్‌కు మరో అరవై వేల కోట్లు వస్తాయి 2

అమరావతి సహా 30 చోట్ల ఈఎస్ఐ ఆస్పత్రుల నిర్మాణం

అర్హులుంటే రాష్ట్రానికి 5-10 లక్షల పక్కా ఇళ్లు మంజూరు

ఉపాధి హామీని వ్యవసాయంతో అనుసంధానం చేయనున్నాం

'ఆంధ్రజ్యోతి'తో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



మంత్రి కాన్వాయ్‌ని అడ్డుకుంటున్న టీడీపీ శ్రేణులు 3

కూటమిలో 'కమిషనర్' చిచ్చు!

ధర్మవరం మున్సిపాలిటీలో ముదిరిన వివాదం

కమిషనర్ మల్లికార్జునకు వ్యతిరేకంగా టీడీపీ ఆందోళన

అధికారి నియామకాన్ని సమర్థించుకున్న మంత్రి సత్యకుమార్

మంత్రి తీరుపై మండిపడ్డ టీడీపీ శ్రేణులు.. కాన్వాయ్ అడ్డగింత

వైసీపీ హయాంలో వేధించిన అధికారి తమకు వద్దని నినాదాలు



ఐఫా పురస్కారాల్లో మెరిసిన తారాలోకం

చిరంజీవి, బాలకృష్ణకు ప్రత్యేక పురస్కారాలు

» ఉమెన్ ఆఫ్ ది ఇయర్ సమంత.. ఉత్తమ చిత్రంగా 'దసరా'

అబుదాబి: ప్రతిష్ఠాత్మక ఐఫా (ఇంటర్నేషనల్ ఇండియన్ ఫిల్మ్ అకాడమీ అవార్డ్స్) 2024 పురస్కారాల వేడుక శనివారం అబుదాబిలో ఘనంగా జరిగింది. బాలీవుడ్‌తో పాటు దక్షిణాది చిత్ర పరిశ్రమ నుంచి పలువురు అగ్రతారలు హాజరయ్యారు. 2024కు గాను అవుట్ స్టాండింగ్ అచీవ్‌మెంట్ ఇన్ ఇండియన్ సినిమా పురస్కారాన్ని చిరంజీవి అందుకున్నారు. నందమూరి బాలకృష్ణ ఐఫా గోల్డెన్ లెగసీ పురస్కారాన్ని స్వీకరించారు. ఐఫా ఉమెన్ ఆఫ్ ది ఇయర్ పురస్కారం సమంతకు దక్కింది. దసరా చిత్రానికి గాను ఉత్తమ నటుడిగా నాని, ఉత్తమ విలన్‌గా షైన్ టామ్ చాంకో అవార్డులు అందుకున్నారు. ఉత్తమ నటి పురస్కారాన్ని స్వీకరించేందుకు వేదికపైకి వచ్చిన ఐశ్వర్యారాయ్‌బచ్చన్ బాలకృష్ణ పాదాలకు నమస్కరించి పురస్కారాన్ని అందుకోవడం విశేషం.

పీఎస్ 2కు అత్యధిక పురస్కారాలు

తమిళ పరిశ్రమ నుంచి 'పొన్నియిన్ సెల్వన్ 2' చిత్రం అత్యధిక పురస్కారాలను కైవసం చేసుకుంది. ఉత్తమ నటిగా ఐశ్వర్యారాయ్ బచ్చన్, ఉత్తమ నటుడిగా విక్రమ్, ఉత్తమ దర్శకుడిగా మణిరత్నం, ఉత్తమ సంగీత దర్శకుడిగా ఏ ఆర్ రెహమాన్, ఉత్తమ సహాయ నటుడిగా జయరామ్ పురస్కారాలు అందుకున్నారు. ఉత్తమ తమిళ చిత్రంగా 'జైలర్' నిలిచింది. ఎస్. జే సూర్య (మార్క్ ఆంటోని)కు ఉత్తమ విలన్ పురస్కారం దక్కింది. కన్నడ సీమ నుంచి 'కాటేరా' చిత్రానికి గాను జగపతిబాబు ఉత్తమ విలన్, తరుణ్ సుధీర్ ఉత్తమ దర్శకుడు పురస్కారాన్ని దక్కించుకున్నారు.

విజేతలు వీరే

- ఉత్తమ దర్శకుడు - అనిల్ రావిపూడి (భగవంత్ కేసరి)
- ఉత్తమ సినిమాటోగ్రఫీ - 'మిస్‌శెట్టి మిస్టర్ పొలిశెట్టి'
- ఉత్తమ సహాయ నటుడు - బ్రహ్మానందం (రంగమార్తాండ)
- ఉత్తమ నటి - మృణాల్ ఠాకూర్, (హాయ్ నాన్న),
- ఉత్తమ సహాయ నటి - వరలక్ష్మి శరత్‌కుమార్ (వీరసింహారెడ్డి)
- ఉత్తమ సంగీత దర్శకుడు - హేషమ్ అబ్దుల్ వహాబ్ (హాయ్ నాన్న)
- ఉత్తమ గీత రచయిత - అనంత్ శ్రీరామ్ (బేబీ)
- ఉత్తమ నేపథ్య గాయకుడు - రాహుల్ సిప్లిగంజ్
- ఉత్తమ నేపథ్య గాయని - మంగ్లీ (బలగం)

తమిళనాడు డిప్యూటీ సీఎంగా ఉదయనిధి నేడు ప్రమాణం

చెన్నై, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): తమిళనాడు సీఎం స్టాలిన్ తనయుడు, మంత్రి ఉదయనిధి స్టాలిన్ డిప్యూటీ సీఎంగా ఎన్నికయ్యారు. తన మంత్రివర్గాన్ని విస్తరించడంలో భాగంగా స్టాలిన్ ఈ నిర్ణయం తీసుకున్నారు. డిప్యూటీ సీఎంగా ఉదయనిధి ఆదివారం పదవీ ప్రమాణం చేస్తారు. ఉదయనిధితోపాటు సేంథిల్ బాలాజీ మంత్రిగా ప్రమాణం చేయనున్నారు. ఓ అవినీతి కేసులో అరెస్టు అయిన సేంథిల్ బాలాజీని మంత్రిగా గవర్నర్ తొలగించిన విషయం తెలిసిందే.

హిజ్బుల్లా చీఫ్ నస్రల్లా హతం



(మొదటి పేజీ తరువాయి)



నస్రల్లా

అబ్బాస్

హిజ్బుల్లా వర్గాలు కూడా హసన్ నస్రల్లా మృతిని ధ్రువీకరిస్తూ ఓ ప్రకటనను విడుదల చేశాయి. "జెరూసలేం వైపు వెళ్లే క్రమంలో జరుగుతున్న పోరాటంలో నస్రల్లా అమరుడయ్యారు" అని పేర్కొన్నాయి. ఇజ్రాయెల్‌పై ప్రతీకారం తీర్చుకుంటామని ఆ ప్రకటనలో స్పష్టం చేశాయి. నస్రల్లా ఉనికిని గుర్తించిన ఐడీఎఫ్ పక్కా వ్యూహంతో 'ఆపరేషన్ న్యూ ఆర్డర్' పేరుతో భీకర దాడులు జరిపింది. దహియాలోని ఓ ఇంటి కింద ఉన్న బంకర్‌లో నస్రల్లా ఉన్నట్లు గుర్తించి, అంతమొందించింది. "నస్రల్లా ఇకపై ఈ ప్రపంచాన్ని ఉగ్రవాదంతో భయభ్రాంతులకు గురి చేయలేడు" అని ప్రకటించింది. పేజర్ బాంబులు, వాకీటాకీ పేలుళ్ల తర్వాత.. లెబనాన్‌పై వైమానిక దాడులను ముమ్మరం చేసిన ఇజ్రాయెల్.. వ్యూహాత్మకంగా.. ఒక్కొక్కరుగా హిజ్బుల్లా కీలక నేతలను అంతమొందిస్తూ వచ్చింది. బుధవారం హిజ్బుల్లా క్షిపణి విభాగం కమాండర్ మహమ్మద్ అలీ ఇస్మాయిల్ అడ్డు తొలగించింది. గురువారం వైమానిక దళ కమాండర్ మహమ్మద్ హుస్సేన్ సోరౌర్‌ను హతమార్చింది. శనివారం సాయంత్రం కొనసాగించిన దాడుల్లో హిజ్బుల్లా ఇంటెలిజెన్స్ విభాగం సీనియర్ నేత హసన్ ఖలీల్ యాసిన్ మృతి చెందినట్లు ఐడీఎఫ్ ప్రకటించింది.

16 ఏళ్ల ప్రాయంలో ఉద్యమం వైపు..

నస్రల్లా 1960లో బీరుట్ శివారులోని బుర్జ్ హమ్ముద్‌లో ఓ చిరు కూరగాయల వ్యాపారి ఇంట్లో తొమ్మిది మంది తోబుట్టువుల్లో ఒకరిగా నస్రల్లా జన్మించారు. 16 ఏళ్ల వయసులో షియా పొలిటికల్, పారామిలిటరీ గ్రూప్ ఉద్యమం 'అమల్'లో చేరారు. అప్పుడే ఆయన పాలస్తీనా లిబరేషన్ ఆర్గనైజేషన్(పీఎల్‌వో) నేత అబ్బాస్ అల్ ముసావి దృష్టిలోపడ్డారు. 1980లో లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడి చేసి, బీరుట్ నుంచి పీఎల్‌వోను తరిమికొట్టింది. అప్పటి నుంచి ఇజ్రాయెల్ వ్యతిరేక ఉద్యమాల్లో నస్రల్లా కీలకంగా వ్యవహరించారు. 1982లో హిజ్బుల్లా ఏర్పాటులో నస్రల్లాది కీలక పాత్ర. 1992లో అప్పటి హిజ్బుల్లా అధినేత అబ్బాస్ అల్ ముసావిని ఇజ్రాయెల్ దళాలు హతమార్చాయి. దీంతో సంస్థ పగ్గాలను నస్రల్లా అందుకున్నారు. అప్పటికి అతడి వయసు 32 సంవత్సరాలు. 2006లో లెబనాన్‌లో జరిగిన యుద్ధంలో ఇజ్రాయెల్‌ను ఓడించడంలో ఆయన కీలక ప్రాత పోషించారు. అప్పటి నుంచే ఇజ్రాయెల్‌కు బద్ధ శత్రువుగా మారారు. హిజ్బుల్లా ప్రభావాన్ని దేశ సరిహద్దులు దాటించి.. 2011లో సిరియా అంతర్యుద్ధంలోనూ పాల్గొనేలా చేశారు. కాగా.. 1997లో ఇజ్రాయెల్ సైనికులతో జరిగిన పోరాటంలో నస్రల్లా తన పెద్ద కుమారుడు హదీని కోల్పోయారు. తాజాగా బీరుట్‌పై ఇజ్రాయెల్ దాడుల్లో కుమార్తె జైనబ్ ప్రాణాలను పోగొట్టుకున్నారు.

రహస్య ప్రదేశానికి ఖమేనీ

నస్రల్లా మరణం.. ఇజ్రాయెల్ సైన్యం దూకుడు నేపథ్యంలో ఇరాన్ అప్రమత్తమైంది. నస్రల్లాతోపాటు.. తమ సైన్యానికి చెందిన జనరల్ కూడా మరణించడంతో ఇజ్రాయెల్‌పై అగ్గిమీద గుగ్గిలమవుతోంది. ఈ క్రమంలో ముందు జాగ్రత్తగా ఇరాన్ సుప్రీంలీడర్ అయతుల్లా అలీ ఖమేనీని సురక్షిత ప్రాంతానికి తరలించినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలను ప్రసారం చేసింది. అయితే.. అంతకు ముందు ఖమేనీ హిజ్బుల్లా, పశ్చిమాసియాలోని ఇతర మిత్ర పక్షాలతో అత్యవసరంగా భేటీ అయినట్లు తెలుస్తోంది. నస్రల్లా మరణం నేపథ్యంలో ఖమేనీ ఒక ప్రకటన విడుదల చేశారు. "లెబనాన్ ప్రజలకు, హిజ్బుల్లాకు అండగా ఉండాలి. దాడులను ఎదుర్కోవడంలో వారికి సహాయం చేయాలి" అంతర్జాతీయ సమాజానికి పిలుపునిచ్చారు. నస్రల్లా మృతితో లెబనాన్‌కు తమ బలగాలను పంపి, ప్రత్యక్ష యుద్ధంలో పాల్గొనేందుకు ఇరాన్ సిద్ధమవుతోందని విశ్లేషకులు పేర్కొన్నారు. కాగా.. నస్రల్లా మృతిని హమాస్, ఇరాక్ కూడా ఖండించాయి. ఇరాక్ ఏకంగా మూడు రోజుల సంతాప దినాలను ప్రకటించింది.

దాడులు ఉధృతం

శనివారం మధ్యాహ్నం నుంచి బీరుట్, దహియాపై ఐడీఎఫ్ దాడులను ఉధృతం చేసింది. అంతకు ముందు ఈ ప్రాంతాలను వదిలి వెళ్లాలంటూ పౌరులకు ఐడీఎఫ్ హెచ్చరికలు చేసింది. "నస్రల్లా మరణంతో మా యుద్ధం ఆగదు" అంటూ సందేశాలు పంపింది. కాగా.. గడిచిన వారం రోజుల్లో లెబనాన్ పౌరులు సుమారు 2 లక్షల మంది నిరాశ్రయులయ్యారు. ఇజ్రాయెల్ దాడుల్లో 720 మంది మృతిచెందారు.

వారసుడు హాషిమ్ కర్కోటకుడే?

నస్రల్లా మరణంతో అతని వారసుడిపై చర్చ మొదలైంది. ఆయన తర్వాత హిజ్బుల్లాలో నంబర్-2గా ఉండే అవకాశం ఉన్న నేతలందరినీ ఐడీఎఫ్ ఈ వారం రోజుల్లో మట్టుబెట్టింది. దీంతో హిజ్బుల్లా విదేశాంగ వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న నస్రల్లా తమ్ముడి వరస అయ్యే హాషిమ్ సఫీద్దీన్ పేరు ప్రముఖంగా వినిపిస్తుంది. ఇరాన్ కూడా అధికారికంగా ఆమోదం తెలిపితే.. వెంటనే హిజ్బుల్లా తమ కొత్త నాయకుడిగా హాషిమ్ పేరును ప్రకటించే అవకాశాలున్నాయి. అయితే.. నస్రల్లా కంటే హాషిమ్ కర్కోటకుడని, ఆయనకు ర్యాడికల్ భావజాలం ఎక్కువని పశ్చిమాసియా వ్యవహారాల నిపుణులు చెబుతున్నారు.

7 నిమిషాలు.. 80 బాంబులు.. నస్రల్లా ఖతం!

గడిచిన వారం రోజులుగా ఇజ్రాయెల్ ఇంటెలిజెన్స్ సంస్థ మొస్సాద్.. నస్రల్లా జాడ కోసం తీవ్ర ప్రయత్నాలు చేసింది. శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో మొస్సాద్ నుంచి ఐడీఎఫ్‌కు కీలక సమాచారం అందింది. "దహియాలో ఇరాన్ ప్రతినిధితో నస్రల్లా, ఇతర కీలక నేతలు భేటీ కానున్నారు" అనేది అందులోని సారాంశం. అంతే.. ఆగమేఘాల మీద ఇజ్రాయెల్ వార్‌రూమ్, ఐడీఎఫ్ హెడ్‌క్వార్టర్స్‌లో ఉరుకులు-పరుగులు మొదలయ్యాయి. త్రివిధ దళాధిపతులు అక్కడకు చేరుకున్నారు. తమకు వచ్చిన సమాచారాన్ని ఒకటికి రెండు సార్లు నిర్ధారించుకున్నాక.. వైమానిక దళం చీఫ్– మేజర్ జనరల్ టోమర్ బార్ నేతృత్వంలో 'ఆపరేషన్ న్యూ ఆర్డర్' ప్రారంభమైంది. త్రివిధ దళాధిపతులు ఉత్కంఠగా కంప్యూటర్ల ముందు కూర్చుని, తమ వైమానిక దళాలు బీరుట్‌వైపు వెళ్లడాన్ని గమనించారు. అర్ధరాత్రి దాటాక.. సరిగ్గా నస్రల్లా ఉన్న బంకర్ వద్దకు వైమానిక దళం చేరుకోగానే.. మేజర్ జనరల్ టోమర్ బార్ ఆదేశాలు జారీ చేశారు. అప్పటిదాకా టార్గెట్‌ను లాక్ చేసి.. ఆదేశాల కోసం ఎదురుచూసిన ఫైటర్ పైలట్లు.. 7 నిమిషాల వ్యవధిలో ఒక్కోటి టన్ను బరువుండే 80 బంకర్ బ్లాస్టర్(జీబీయూ-28) బాంబులను జారవిడిచారు. అంతే.. ఆ బంకర్ పైభాగంలో ఉన్న భవనం కుప్పకూలిపోయింది. మంటలు చెలరేగాయి. 80 బాంబులతో చేసిన దాడిలో.. ఎవరూ బతికే అవకాశాలుండవని నిర్ధారించుకున్న వెంటనే ఇజ్రాయెల్ విమానాలు వెనుదిరిగాయి. తర్వాత నస్రల్లా మరణంపై ప్రకటన వెలువడింది.

లోకం తీరు



కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌పై కేసు

బెంగళూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎన్నికల బాండ్ల పేరిట అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలపై కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌పై ఎఫ్ఐఆర్ నమోదైంది. ఈ అంశంపై జనాధికార సంఘర్ష పరిషత్ ఉపాధ్యక్షుడు ఆదర్శ్ అయ్యర్ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ శుక్రవారం 42వ ప్రజాప్రతినిధుల కోర్టుకు బదిలీ అయింది. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన న్యాయస్థానం ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని బెంగళూరులోని తిలక్‌నగర్ పోలీసులను ఆదేశించింది. తదుపరి విచారణను అక్టోబరు 10కి వాయిదా వేసింది. దీంతో పోలీసులు శనివారం ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్(ఏ1) , ఈడీ (ఏ2), బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా(ఏ3), మాజీ ఎంపీ నళిన్‌కుమార్ కటీల్(ఏ4), బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర(ఏ5), రాష్ట్ర బీజేపీ నేతల(ఏ6)పై ఐపీసీ 384, 120 బీ, 34 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఎలక్టోరల్ బాండ్ల ముసుగులో వివిధ కార్పొరేట్ కంపెనీల ఎండీలు, సీఈవోలను బెదిరించి ద్వారా రూ.8వేల కోట్లు దోపిడీ చేశారని ఆదర్శ్ అయ్యర్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అప్పటి కేంద్ర ఆర్థికమంత్రి నిర్మాలా సీతారామన్ రాజ్యాంగబద్ధమైన పదవిని ఉపయోగించుకుని ఈడీ అధికారులు, బీజేపీ నేతలు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నళిన్‌కుమార్ ద్వారా నిధులు సేకరించారని ఆరోపించారు. ఈడీ దాడులకు భయపడి పలు కంపెనీలు కోట్లాది రూపాయల విలువైన బాండ్లను కొనుగోలు చేశాయని తెలిపారు. 2019 ఏప్రిల్, 2022 ఆగస్టు, 2023 నవంబరులో వేదాంత, స్టెరిలైట్ కంపెనీలను బెదిరించి సుమారు రూ.230 కోట్ల బాండ్లు కొనుగోలు చేయించారన్నారు. అరబిందో ఫార్మా కంపెనీపై ఈడీ దాడి చేసి రూ.49.5 కోట్లు సేకరించినట్లు పేర్కొన్నారు. దీనిపై 2024 మార్చిలో తిలక్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని, ఏప్రిల్‌లో డీసీపీకి ఫిర్యాదు చేసినా ఏ ప్రయోజనమూ లేదని అయ్యర్ ఆరోపించారు.

వరద సహాయ చర్యలు భేష్

» మీ లాంటి పనితీరు ఎక్కడా చూడలేదు
» వంద రోజుల పాలనపై ప్రజల్లో సంతృప్తి
» చంద్రబాబుతో భేటీలో బీజేపీ నేత సిద్ధార్థ్‌నాథ్



ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన బీజేపీ నేత సిద్ధార్థ్ సింగ్

అమరావతి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వరద సహాయక చర్యల్లో మీ లాంటి పనితీరు ఎక్కడా చూడలేదంటూ ముఖ్యమంత్రి చంద్రబాబును బీజేపీ నాయకుడు సిద్ధార్థ్‌నాథ్ సింగ్ ప్రశంసించారు. గడిచిన వంద రోజుల ఎన్డీయే పాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని, రాబోయే రోజుల్లోనూ ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఎన్డీయే కూటమిలో బీజేపీ జాతీయ సమన్వయకర్తగా పనిచేసిన ఆయన... శనివారం ఉండవల్లిలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో వంద రోజుల కూటమి ప్రభుత్వ పాలన, ఆరు గ్యారెంటీల్లో కీలకమైనవి అమలు, ప్రజల భయాందోళనల తొలగింపు, గత ఐదేళ్లలో దోపిడీకి బాధ్యులలో కొందరిని జైలుకు పంపడం, ఇటీవల విజయవాడను వరదలు ముంచెత్తినప్పుడు చంద్రబాబు రాత్రింబవళ్లు పనిచేసిన విధానం తదితర అంశాలు ఇద్దరి మధ్య చర్చకు వచ్చాయి. రాజధాని అమరావతికి కేంద్రం భారీగా నిధుల కేటాయింపు, పోలవరం పూర్తి చేసేందుకు భరోసా, రాష్ట్రంలో కేంద్ర పథకాలు, అభివృద్ధి పనులకు ఆర్థిక సహకారంపైనా ఇద్దరు నేతల మధ్య చర్చకు వచ్చింది. తిరుమల ప్రసాదంలో కల్తీ అంశం ప్రస్తావనకు రాగా ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) నిజానిజాలు తేల్చే పనిలో ఉందని సీఎం వ్యాఖ్యానించినట్లు తెలిసింది.

గోవు ఘోష విను గోవిందా..

కలియుగ దైవం వెంకటేశ్వరస్వామి ప్రసాదాన్ని కల్తీ చేసిన వైసీపీ ఆలయాల శుద్ధి పేరుతో అపవిత్రం చేసిందని రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి దుయ్యబట్టారు. స్వచ్ఛమైన ఆవు నెయ్యికీ, పందికొవ్వుకు తేడా తెలియకుండా మాట్లాడిన వైసీపీ నేతల తీరును నిరసిస్తూ ఆదివారం అన్ని జిల్లా కేంద్రాల్లో గోమాతకు పూజలు నిర్వహించనున్నట్టు ఓ ప్రకటనలో తెలిపారు. 'గోవు ఘోష విను గోవిందా' పేరుతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో బీజేపీ శ్రేణులు పాల్గొనాలని కుమారస్వామి కోరారు.

బాబు కృషితోనే జేపీసీకి వక్ఫ్ సవరణ బిల్లు

» 15 మందితో ప్రత్యేక కమిటీ ఏర్పాటు : మంత్రి ఫరూక్

అమరావతి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): 'వక్ఫ్ సవరణ బిల్లు - 2024పై ఏర్పాటయిన జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) శనివారం హైదరాబాద్‌లో సమావేశమయింది. ఛైర్ పర్సన్ జగదాంబికాపాల్ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం తన అభిప్రాయాలను తెలిపింది. బిల్లులో ముస్లిం సమాజానికి మంచి జరిగే అంశాలను సమర్థిస్తూనే... సున్నితమైన, నష్టం జరుగుతుందని మైనార్టీ సమాజం భావిస్తున్న అంశాలను జేపీసీ ముందు ఉంచింది' అని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. శనివారం ఆయన ఈమేరకు ఓ ప్రకటన చేశారు. 'బిల్లుపై ముస్లిం సమాజం నుంచి వివిధ రూపాల్లో ఆందోళన వ్యక్తమయింది. ఈ నేపథ్యంలో అభిప్రాయ సేకరణ నిమిత్తం బిల్లు జేపీసీకి వెళ్లేలా సీఎం చంద్రబాబు కృషి చేశారు. ఏపీ నుంచి అభ్యంతరాలు తెలిపేందుకు 15 మందితో ప్రత్యేక కమిటీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో ఐఏఎస్ అధికారులు, మైనార్టీ సంక్షేమ శాఖ, వక్ఫ్ బోర్డు ప్రతినిధులు, న్యాయవాదులు, ముతవల్లీల సంఘం నాయకులు, మైనార్టీల హక్కుల కోసం పోరాడే స్వచ్ఛంద సేవా సంస్థలు, ముస్లిం ప్రజాప్రతినిధులు ఉన్నారు. జేపీసీ ముందు తన అభిప్రాయాలను చెప్పే ముందు కమిటీ సమావేశమై బిల్లుపై విస్తృతంగా చర్చించింది' అని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు.

ఢిల్లీలో బాబు బ్రాండ్..

'ఆంధ్రజ్యోతి'తో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



అమరావతి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): 'చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో ప్రాజెక్టులకు కేంద్రం ఇవ్వడానికి సమ్మతి తెలిపిన విలువ రూ.60 వేల కోట్లు. నమ్మశక్యం కానన్ని నిధులు కేంద్రం నుంచి సాధించగలిగాం. వంద రోజుల్లో ఇన్ని నిధులకు సమ్మతి తెచ్చుకోవడం ఒక అద్భుతం' అని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం ఆయన ఇక్కడ 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో పలు విషయాలు వెల్లడించారు. 'పోలవరం ప్రాజెక్టు తొలి దశ నిర్మాణానికి రూ.12 వేల కోట్ల మంజూరుకు కేంద్రం ఆమోదం తెలిపింది. మొదటి దశ సకాలంలో పూర్తయితే రెండో దశ నిర్మాణానికి మరో రూ.18 వేల కోట్లు ఇవ్వడానికి సుముఖత తెలిపింది. రాష్ట్రానికి జీవనాడి వంటి ఈ ఒక్క ప్రాజెక్టుకే కేంద్రం నుంచి రూ.30 వేల కోట్లు అందనున్నాయి. అమరావతి రాజధాని నిర్మాణానికి రూ.15 వేల కోట్లు అందనున్నాయి. ఒక్కోదానికి రెండున్నర వేల కోట్ల చొప్పున రెండు పారిశ్రామిక నోడ్స్‌కు మొత్తం రూ.5 వేల కోట్లు మంజూరు చేశారు. అమరావతిని దేశంలోని ఇతర ప్రాంతాలకు అనుసంధానం చేయడానికి కొత్త రైల్వే లైన్ల నిర్మాణానికి రెండున్నర వేల కోట్లు ఇవ్వనున్నారు. అమరావతి చుట్టుపక్కల ఉన్న వివిధ జాతీయ రహదారుల విస్తరణకు మరో రెండున్నర వేల కోట్లను కేంద్రం ఖర్చు చేయనుంది. తాజాగా విశాఖ ఉక్కుకు రూ.2 వేల కోట్లు ఇవ్వనుంది. ఉపాధి హామీ పథకం పనుల నిమిత్తం గ్రామ పంచాయతీలకు ఇటీవల రెండున్నర వేల కోట్లు విడుదలయ్యాయి. వీటన్నింటి విలువ రూ.60 వేల కోట్లు. ఇవిగాక మెట్రో కారిడార్ అనుకొన్న పద్ధతిలో ముందుకు వెళ్తే కేంద్రం నుంచి దీనికి మరో అరవై వేల కోట్లు వస్తాయి. రాష్ట్రంలోని ప్రతి పార్లమెంటు నియోజకవర్గంలో ఒకటి లేదా రెండు రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి కూడా కేంద్రం సుముఖత తెలిపింది. మూడు నాలుగు నెలల్లో ఇన్ని నిధులు రావడం ఒక అద్భుతం. ఆచరణ సాధ్యం అనుకొన్న ప్రతి పనినీ కేంద్ర ప్రభుత్వం చేసి పెడుతోంది. చంద్రబాబుకు ఢిల్లీలో పెద్ద బ్రాండ్ ఇమేజి ఉంది. ఆయనను ఉత్తర భారత నేతలు కూడా చాలా గౌరవిస్తారు. ఆయనను దూరదృష్టి కలిగిన నేతగా పరిగణిస్తారు. ఆయన వల్లే రాష్ట్రానికి ఇన్ని నిధులు వస్తున్నాయి' అని వెల్లడించారు.

వ్యవసాయంతో ఉపాధి హామీ అనుసంధానం..

ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనులను వ్యవసాయంతో అనుసంధానం చేయడానికి కేంద్రం ఆసక్తితో ఉందని, త్వరలో దీనిపై ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించనుందని పెమ్మసాని తెలిపారు. పేదలకు ఇళ్ల నిర్మాణానికి ఆవాస్-2024 పేరుతో కేంద్రం ఒక యాప్‌ను తయారు చేసిందని, అర్హుల ఎంపికకు ఈ యాప్ ద్వారా దేశవ్యాప్తంగా సర్వే నిర్వహించనున్నారని చెప్పారు. పాత సర్వేలన్నీ రద్దు చేశామని, కొత్త సర్వేను మొదలు పెట్టామని, దీని కింద అర్హత ఉంటే ఎన్ని లక్షల మందికైనా కేంద్రం నిధులు ఇస్తుందని తెలిపారు. అలాగే, తన శాఖ పరిధిలో బీఎస్ఎన్ఎల్‌రే దేశవ్యాప్తంగా లక్ష 4జీ టవర్ల నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. 'మేం రాక ముందు 2 వేల టవర్లు మాత్రమే నిర్మించారు. ఈ వంద రోజుల్లో 40 వేల టవర్లు నిర్మించాం. మార్చి నాటికి లక్ష టవర్ల నిర్మాణం పూర్తి చేస్తాం. రెండేళ్లలో ఈ సంస్థ టెక్నాలజీ అభివృద్ధి పూర్తవుతుంది. దేశవ్యాప్తంగా ప్రతి ఇంటిని ఫైబర్ నెట్‌తో అనుసంధానం చేసే పని కూడా వేగంగా చేపడుతున్నాం' అని వివరించారు.

రాష్ట్రానికి 30 ఈఎస్ఐ ఆస్పత్రులు..

రాష్ట్రానికి 30 ఈఎస్ఐ ఆస్పత్రులను కేంద్రం మంజూరు చేసిందని పెమ్మసాని తెలిపారు. అమరావతిలో రూ. 250 కోట్లతో 400 పడకల ఆస్పత్రి రాబోతోందని చెప్పారు. భూ కేటాయింపు పూర్తయిన వెంటనే వీటి నిర్మాణం మొదలవుతుందని, నిధులకు ఇబ్బంది లేదని చెప్పారు. అమరావతిలో తపాలా శాఖ రాష్ట్ర కార్యాలయం నిర్మాణానికి రూ.80 కోట్లు మంజూరయ్యాయని, భూ కేటాయింపు జరగ్గానే దీని నిర్మాణం కూడా ప్రారంభమతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలకు సంబంధించి సుమారు వంద నిర్మాణాలు జరగాల్సి ఉందని, త్వరగా జరిగేలా ఆయా శాఖలతో సంప్రదింపులు జరుపుతున్నామని వివరించారు. రాష్ట్ర రాజధానిలో అనేక కేంద్ర ప్రభుత్వ శాఖల ప్రధాన కార్యాలయాల నిర్మాణాలు చేపట్టాల్సి ఉందని, వాటిపైనా చర్చలు జరుపుతున్నామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ నమూనాలు, పట్టణ ప్రాంత రికార్డులు, భూ రికార్డుల డిజిటైజేషన్‌కు ఈ ఆర్థిక సంవత్సరంలోనే రాష్ట్రానికి వెయ్యి కోట్లను కేంద్రం మంజూరు చేసిందని, సంబంధిత శాఖలు పని మొదలు పెట్టాయని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులు ఉంటే రాష్ట్రానికి ఐదు నుంచి పది లక్షల పక్కా ఇళ్లు మంజూరయ్యే అవకాశం ఉందని తెలిపారు.



స్వచ్ఛభారత్‌కు మీరే వెన్నెముక

» పారిశుధ్య కార్మికుల కాళ్లు కడిగిన మంత్రి సత్యకుమార్

ధర్మవరం, సెప్టెంబరు 28: స్వచ్ఛ భారత్ నిర్మాణానికి పారిశుధ్య కార్మికులే వెన్నెముక అని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన రామాంజనేయులు పారిశుధ్య కార్మికులకు సమకూర్చిన దుస్తులను మంత్రి శనివారం పంపిణీ చేశారు. పట్టణంలో పారిశుధ్యం మెరుగుదలకు మున్సిపల్ కార్మికులు చేస్తున్న కృషిని మంత్రి ప్రశంసించారు. కార్మికుల సంక్షేమం, అభివృద్ధి కోసం పని చేస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. అనంతరం 30 సంవత్సరాలుగా మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు సాలమ్మ, పెద్దనాగప్ప కాళ్లను మంత్రి కడిగారు.

పారిశుధ్య కార్మికుల కాళ్లు కడుగుతున్న మంత్రి సత్యకుమార్



గుంటూరులో జరిగిన ర్యాలీలో పాల్గొన్న మహిళా భక్తులు

వెంకన్నకే విద్రోహమా.. శిక్ష తప్పదు

» సనాతన ధర్మంపై మాజీ సీఎం జగన్ దాడి
» తిరుమల లడ్డూ కల్తీ క్షమించరాని నేరం
» గుంటూరులో మహిళల భారీ ర్యాలీ

గుంటూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామికే మాజీ సీఎం జగన్ విద్రోహం తలపెట్టారని మహిళా భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుమలలో అపచారాలు, లడ్డూ కల్తీ విషయంలో జగన్ వ్యాఖ్యలను నిరసిస్తూ శనివారం గుంటూరు నగరంలో నారీ గళం, బ్రాహ్మణ చైతన్య వేదిక, సనాతన ధర్మ పరిరక్షణ జేఏసీ ఆధ్వర్యంలో వందల మహిళలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. 'వెంకన్నకే విద్రోహమా.. భగవంతుని శిక్ష తప్పదు' అనే బ్యానర్‌ను ప్రదర్శించారు. దాదాపుగా ఐదు కిలోమీటర్లు ఈ ర్యాలీ సాగింది. నిర్వాహకులు ముత్తినేని శివలీల, గుంటుపల్లి యామిని, సిరిపురపు శ్రీధర్ శర్మలు మాట్లాడుతూ గత జగన్ ప్రభుత్వంలో పవిత్రమైన తిరుమల క్షేత్రంలో చాలా అపచారాలు జరిగాయని, స్వామివారి కైంకర్యాలు, పూజలు, టికెట్లు, కాంట్రాక్టుల్లో అవినీతి చేశారని ఆరోపించారు. అన్యమతస్తుడైన జగన్ సనాతన ధర్మంపై కుట్రలు చేశారని, శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేయడం క్షమించరాని నేరమని అన్నారు. జగన్ తన భార్యతో కలసి గత ఐదేళ్లలో ఏ దేవాలయాన్ని దర్శించలేదని, తిరుమలకు 11 సార్లు వచ్చానని చెప్పుకుంటున్న ఆయన ఒక్కసారైనా భార్య భారతితో కలిసి వేంకటేశ్వరుడికి పట్టు వస్త్రాలు ఎందుకు సమర్పించలేదని ప్రశ్నించారు. జగన్ తిరుమలలో ఒక్కసారి కూడా డిక్లరేషన్ ఇవ్వలేదని, ప్రభుత్వాన్ని అడ్డం పెట్టుకొని సనాతన ధర్మంపై దాడి చేశారని ఆరోపించారు. హైకోర్టులో కేసుల వాయిదాలను ఎగ్గొట్టేందుకే తిరుమల వెళుతున్నట్లు జగన్ పిటిషన్ వేశారని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు వైసీపీని కేవలం 11 సీట్లకు పరిమితి చేసినా, ఆయనకు సిగ్గు రాలేదని మండిపడ్డారు.

ధర్మాన్ని పాటించడం తెలియదా..!: యామిని శర్మ



విజయవాడ, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): 'గది నాలుగు గోడల మధ్య కాకపోతే 40 గదుల్లో బైబిల్ చదువుకో. కాకపోతే హిందు ధర్మానికి సంబంధించిన నిబంధనలు పాటించు' అని జగన్‌కు బీజేపీ అధికార ప్రతినిధి యామిని శర్మ సూచించారు. విజయవాడలో బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఆమె మీడియాతో మాట్లాడారు. రాష్ట్రాన్ని ఎలా దోచుకోవాలో తెలిసిన జగన్‌కు ధర్మాన్ని ఎలా పాటించాలో తెలియదా అని ప్రశ్నించారు. జగన్ సెక్యులరిజం పేరుతో కులాలు, మతాల మధ్య చిచ్చు పెడుతున్నాడని ఆరోపించారు.

కూటమిలో 'కమిషనర్' చిచ్చు!

ధర్మవరం మున్సిపాలిటీలో ముదిరిన వివాదం

- కమిషనర్ మల్లికార్జునకు వ్యతిరేకంగా టీడీపీ శ్రేణుల ఆందోళన
- అధికారి నియామకాన్ని సమర్థించుకున్న మంత్రి సత్యకుమార్
- మంత్రి తీరుపై మండిపడ్డ టీడీపీ శ్రేణులు.. కాన్వాయ్ అడ్డగింత
- వైసీపీ హయాంలో వేధించిన అధికారి తమకు వద్దని నినాదాలు



శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలోని ఎన్డీఏ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న టీడీపీ శ్రేణులు



వెనుకమార్గం నుంచి వెళ్లిపోతున్న కమిషనర్ మల్లికార్జున

ధర్మవరం, సెప్టెంబరు 28: శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం మున్సిపాలిటీ కమిషనర్‌గా మల్లికార్జునను నియమించడం ఎన్డీఏ కూటమిలో చిచ్చురగిల్చింది. వైసీపీ హయాంలో తమను వేధించిన అధికారిని తిరిగి కమిషనర్‌గా తీసుకురావడం ఏమి టని టీడీపీ శ్రేణులు కొన్నాళ్లుగా అసంతృప్తితో రగిలిపోతూ.. ఆందోళనలు నిర్వహిస్తున్నాయి. కమిషనర్ మల్లికార్జునకు మంత్రి సత్యకుమార్‌యాదవ్ అండగా నిలిచారు. ధర్మవరం కమిషనర్‌గా మల్లికార్జున కొనసాగుతారని, అతనికి మంచి అధికారిగా పేరు ఉన్నందుకే అభివృద్ధి కోసం ఏరి కోరి తీసుకువచ్చానని మంత్రి ప్రకటించారు. ఓటు వేసి గెలిపించిన ప్రజల శ్రేయస్సే తనకు ముఖ్యమని అన్నారు. దీంతో టీడీపీ శ్రేణులు ఆగ్రహంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ధర్మవరంలోని ఎన్డీఏ కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో మంత్రి శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశానికి కమిషనర్ మల్లికార్జున హాజరయ్యారు. విషయం తెలుసుకున్న టీడీపీ కార్యకర్తలు భారీఎత్తున అక్కడికి చేరుకుని రోడ్డుపై బైఠాయించారు. మున్సిపల్ కమిషనర్ గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. వైసీపీకి తొత్తుగా వ్యవహరించిన కమిషనర్ వెంటనే వెళ్లిపోవాలి..., టీడీపీ వారికి వైసీపీ కండువాలు వేయించి తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన కమిషనర్ ఇక్కడి నుంచి వెళ్లిపోవాలి అని నినాదాలు చేశారు. ఈ ధర్నా దాదాపు రెండుగంటల పాటు జరిగింది. వాహనాల రాకపోకలు స్తంభించాయి. డీఎస్పీ శ్రీనివాసులు, సీఐలు నాగేంద్రప్రసాద్, రెడ్డప్ప, ప్రభాకర్, పలువురు ఎస్‌ఐలు అక్కడికి చేరుకుని టీడీపీ శ్రేణులకు నచ్చచెప్పడానికి ప్రయత్నించారు. కానీ వారు వెనక్కి తగ్గలేదు. వైసీపీ హయాంలో మున్సిపల్ కమిషనర్ కారణంగా ఎలాంటి బాధలను అనుభవించామో తమకే తెలుసునని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ నాయకుడు ఎల్ నరేంద్రచౌదరి వెళ్లి మంత్రి సత్యకుమార్‌యాదవ్‌తో సంప్రదింపులు జరిపారు. మంత్రి టీడీపీ శ్రేణుల వద్దకు వచ్చి మాట్లాడారు. కమిషనర్ నియామకం తన చేతిలో లేదని, ఏదైనా ఉంటే పెద్దాయనతో (చంద్రబాబునాయుడు) మాట్లాడుకోవాలని సూచించి, కారు ఎక్కారు. దీంతో టీడీపీ కార్యకర్తలు మరింత ఆగ్రహానికి లోనయ్యారు. కష్టపడి గెలిపిస్తే తమకు ఇచ్చే బహుమానం ఇదేనా అని మంత్రిని నిలదీస్తూ.. ఆయన కాన్వాయ్‌ను అడ్డుకున్నారు. పోలీసులు జోక్యం చేసుకుని మంత్రి కాన్వాయ్‌ని ముందుకు పంపించారు. చివరికి మంత్రి తన కార్యక్రమాలను రద్దు చేసుకుని అనంతపురం వెళ్లిపోయారు. మంత్రి కాన్వాయ్ వెళ్లడానికి మునుపు కమిషనర్ మల్లికార్జునను డీఎస్పీ శ్రీనివాసులు భారీ బందోబస్తు మధ్య ఎన్డీఏ కార్యాలయం వెనుక ద్వారం నుంచి ప్రత్యేక వాహనంలో తరలించారు. కమిషనర్ క్యాంపు కార్యాలయంలో ఉంటారని భావించిన టీడీపీ శ్రేణులు అక్కడికి వెళ్లారు. అక్కడ లేకపోవడంతో వెనుదిరిగారు.

మమ్మల్ని హింస పెట్టారు..

వైసీపీ కండువా కప్పుకుంటేనే పనులు చేసి పెడతానని అప్పట్లో కమిషనర్ మల్లికార్జున తమను హింసకు గురిచేశారని టీడీపీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో ఏకపక్షంగా వ్యవహరించారని, నామినేషన్లను కూడా వేయనీకుండా అడ్డుకున్నారని అన్నారు. మున్సిపల్ రిజర్వు స్థలాలతో పాటు టీడీపీ హయాంలో పేదలకు ఇచ్చిన ఏడు వేల ఇంటి పట్టాలను రద్దు చేసి.. వైసీపీ వారికి పంచిపెట్టిన అవినీతి పరుడు కమిషనర్ అని మండిపడ్డారు. అటువంటి వ్యక్తికి మంత్రి వత్తాసు పలకడం విచారకరమని అన్నారు. 'రాత్రింబవళ్లు కష్టపడి, ఓటర్ల కాళ్లు పట్టుకుని ఓటు వేయించి గెలిపిస్తే నీవు ఇచ్చే బహుమానం ఇదేనా..?' అని మంత్రి తీరుపై మండిపడ్డారు. టీడీపీని ఇబ్బందులు పెడితే నాశనం కాకతప్పదని శాపనార్థాలు పెట్టారు.

ఎమ్మెల్యే కొలికపూడిపై సీఎంకు విలేకరుల ఫిర్యాదు

- చర్చిస్తున్నాం... నిర్ణయం తీసుకుంటామన్న చంద్రబాబు

తిరువూరు, సెప్టెంబరు 28: తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు విలేకరుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని స్థానిక విలేకరులు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు. మంగళగిరి టీడీపీ జాతీయ కార్యాలయంలో శనివారం ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు సీఎంను కలిశారు. విలేకరుల పట్ల కొలికపూడి బహిరంగంగా అనుచిత వ్యాఖ్యలు చెయ్యడంతో పాటు, భయాందోళనకు గురిచేసేలా హెచ్చరించడంపై సీఎంకు వివరించి వినతిపత్రం అందించారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ, ఈ సమస్య తన దృష్టికి వచ్చిందని, జరిగిన ఘటనలపై చర్చిస్తున్నామని, తగు నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.


పోలవరం ప్రత్యేక బ్యాంకు ఖాతా కోసం సీఎస్ఎస్ కోడ్ ఇవ్వండి

- కేంద్ర జలశక్తికి జలవనరుల శాఖ లేఖ

అమరావతి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి ప్రత్యేక బ్యాంకు ఖాతా ప్రారంభించేందుకు కేంద్ర ప్రాయోజిత పథకం (సీఎస్ఎస్) కోడ్‌ను ఇవ్వాలంటూ కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేబర్షి ముఖర్జీని రాష్ట్ర జల వనరుల శాఖ కోరింది. పోలవరం సాగునీటి ప్రాజెక్టు తొలిదశకు రూ.12,567 కోట్లను కేటాయిస్తూ కేంద్ర కేబినెట్ ఆమోదించింది. ఈ మొత్తం రాష్ట్రానికి విడుదల చేయాలంటే పోలవరం ప్రాజెక్టు కోసం ప్రత్యేకంగా బ్యాంకు ఖాతా తెరవాలంటూ రాష్ట్రానికి కేంద్ర జలశక్తి సూచించింది. అయితే ఖాతా తెరవాలంటే సీఎస్ఎస్ కోడ్ కేంద్ర జలశక్తి ఇవ్వాల్సి ఉంది. గతంలో వైసీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు ఈ ప్రాజెక్టు కోసం కేంద్రమిచ్చిన నిధులను దారిమళ్లించింది. ఈ నేపథ్యంలో కేంద్రం ప్రత్యేక ఖాతా తెరవాలని సూచించింది. అయితే, ప్రత్యేక ఖాతాను తెరవాలంటే సీఎస్ఎస్ కోడ్ ఉండాల్సిందేనని రాష్ట్ర ఆర్థికశాఖ, బ్యాంకులు స్పష్టం చేయడంతో.. జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శికి లేఖ రాశారు.

శ్రీవారి ఆలయంలో 1న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుమల, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమలలో అక్టోబరు 1వ తేదీన ఉదయం 6 నుంచి 10 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మంగళవారం వీఐపీ బ్రేక్ దర్శనాలను(ప్రోటోకాల్ మినహా) టీటీడీ రద్దు చేసింది.





ధ్వజస్తంభానికి నమస్కరిస్తున్న జస్టిస్ డీవై చంద్రచూడ్

పద్మావతీ అమ్మవారిని దర్శించుకున్న సుప్రీంకోర్టు సీజే

తిరుచానూరు, సెప్టెంబరు 28: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ శనివారం సాయంత్రం తిరుచానూరులోని శ్రీవారి దేవేరి పద్మావతీ అమ్మవారిని దర్శించుకున్నారు. సతీసమేతంగా ఆలయం వద్దకు వచ్చిన ఆయనకు టీటీడీ ఈవో శ్యామలరావు, జేఈవో వీరబ్రహ్మం, అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. దర్శనానంతరం సీజేని ఆలయ వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. రాత్రికి తిరుపతిలోనే బస చేయనున్న సీజే ఆదివారం ఉదయం తిరుమల వెళ్లి శ్రీవారిని దర్శించుకుంటారు.

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



ఆలయం ఎదుట జస్టిస్ కృష్ణమోహన్

తిరుమల, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ శనివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో దర్శించుకున్నారు. రంగనాయక మండపంలో జస్టిస్ కృష్ణమోహన్‌ను వేదపండితులు ఆశీర్వదించగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు. అలాగే తమిళనాడు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కె.ఆర్. శ్రీరామ్, న్యాయమూర్తి జస్టిస్ సెంథిల్ కుమార్ శనివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు.

రూ.250 స్టాంప్‌ను ఆవిష్కరించిన బార్ కౌన్సిల్



స్టాంపు విడుదల కార్యక్రమంలో బార్ కౌన్సిల్ చైర్మన్, ఇతర ప్రతినిధులు

అమరావతి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఏపీలోని న్యాయవాదులు, వారి గుమస్తాల సంక్షేమనిధి కోసం ఏపీ బార్ కౌన్సిల్ రూ.250 స్టాంప్‌ను ఆవిష్కరించింది. శనివారం ఏపీబార్ కౌన్సిల్ కార్యాలయంలో చైర్మన్ నల్లారి ద్వారకానాథ్ రెడ్డి, వైస్ చైర్మన్ సిరిపురం కృష్ణమోహన్, కార్యదర్శి బి.పద్మలత, సభ్యులు స్టాంప్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. న్యాయస్థానాల్లో దాఖలు చేసే వకాలత్‌లు/మెమో ఆఫ్ అపీరెన్స్‌ల పై రూ.250 స్టాంప్‌ను అంటించాలని జిల్లాలోని జిల్లా బార్ అసోసియేషన్లను, న్యాయవాదులను బార్ కౌన్సిల్ కోరింది. తద్వారా వచ్చేసొమ్మును న్యాయల సీఎం సహాయ నిధి, సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ)కి నేరుగా గానీ ఆర్థిక సాయం చేయవచ్చని స్పష్టం చేశారు.

మొదలుకాని ప్రాజెక్టులు రద్దు

- 25శాతం కంటే తక్కువ పనులైనవి కూడా...
- అన్ని శాఖలకూ ఆర్థిక శాఖ ఆదేశాలు
- నాబార్డు ప్రాజెక్టులకు మినహాయింపు

అమరావతి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ 1వ తేదీ కంటే ముందు ఆమోదం పొంది ఇంకా పనులు మొదలుకాని ప్రాజెక్టులు, 25 శాతం లోపు పూర్తైన ప్రాజెక్టులను రద్దు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అన్ని శాఖలకు ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్ కుమార్ ఆదేశాలు జారీచేశారు. గత ప్రభుత్వంలో ఎఫ్ఆర్‌బీఎం నిబంధనలు ఉల్లంఘించి అనేక ఇంజనీరింగ్ పనులను మంజూరు చేయడం వల్ల దాదాపు రూ.39,000 కోట్ల పెండింగ్ బిల్లులు పేరుకుపోయాయని, వీటిలో కొన్ని కోర్టు పరిధిలో ఉన్నాయని, చెల్లించని కారణంగా కోర్టు ఉల్లంఘన కేసులు నమోదవుతున్నాయని తన ఆదేశాల్లో పేర్కొన్నారు. ఇవి కాకుండా ఆమోదించిన పనులు కూడా బడ్జెట్లో పొందుపరిచిన ఎఫ్ఆర్‌బీఎం పరిమితికి మూడు రెట్లు ఉన్నాయని, వీటి వల్ల రాష్ట్ర చెల్లింపుల విధానం గాడి తప్పుతోందని పేర్కొన్నారు. వెనుకబడిన, గిరిజన ప్రాంతాల్లో పనులు చేపట్టేందుకు ఇవన్నీ ఆటంకంగా మారాయని వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఇప్పటి వరకు ఆమోదించిన, ప్రారంభమైన ప్రాజెక్టుల ప్రాధాన్యతలు నిర్ణయించినట్టు వెల్లడించారు. ఇందులో భాగంగా 2024 ఏప్రిల్ 1వ తేదీకి ముందు ఆమోదం పొంది పనులు మొదలుకానివాటిని, అరకొరగా పనులు జరిగిన వాటిని రద్దు చేయాలని నిర్ణయించారు. ఈఏపీ, సీఎస్ఎస్, నాబార్డు ప్రాజెక్టులు యథావిధిగా కొనసాగుతాయి. వీటికి రద్దు నిర్ణయం వర్తించదని వెల్లడించారు. అలాగే, ఈఏపీ, నాబార్డు, సీఎస్ఎస్ ప్రాజెక్టులు మినహా, ప్రారంభమై ఒప్పంద విలువలో 25 శాతం కంటే తక్కువ పూర్తయిన పనులు ఏమేం ఉన్నాయో, వివరాలను అక్టోబరు 31లోగా ఆర్థిక శాఖకు పంపాలని కోరారు. వీటికి సంబంధించిన చెల్లింపులు...ప్రాజెక్టు రద్దు ఆదేశాలు వచ్చాక జరుగుతాయని చెప్పారు. సెక్రటరీలు, హెచ్ఓడీలు ఇలాంటి ప్రాజెక్టులను గుర్తించి నివేదిక ఇవ్వాలని ఆర్థిక శాఖ ఆదేశాలు జారీ చేసింది.



సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ శ్రీనివాసరెడ్డి

శ్రమ ఆయుధమైతే గెలుపు బానిసవుతుంది

- హైకోర్టు జడ్జి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి

అనంతపురం క్రైం, సెప్టెంబరు 28: 'శ్రమ నీ ఆయుధమైతే గెలుపు నీ బానిస అవుతుంది' అని హైకోర్టు జడ్జి, అనంతపురం పోర్టు పోలియో జడ్జి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి అన్నారు. అనంతపురం నగరంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఈ-కోర్ట్స్ ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ శ్రీనివాసరెడ్డి, జస్టిస్ శ్యాంసుందర్, జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్, విశ్రాంత న్యాయాధికారి హజరత్‌రావు హాజరయ్యారు. జస్టిస్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. న్యాయవాద వృత్తిలోను, న్యాయమూర్తిగానూ రాణించాలంటే పట్టుదలగా కృషి చేయాలని సూచించారు. అదృష్టం కంటే హార్డ్‌వర్క్‌ను నమ్ముకోవాలని, అది ఉన్నత శిఖరాలకు చేర్చుతుందని అన్నారు. అనంతరం బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గురుప్రసాద్, రాజేంద్రప్రసాద్ న్యాయవాదుల సమస్యలను హైకోర్టు న్యాయమూర్తులకు వివరించారు. పోక్సో కోర్టు దూరంగా ఉండటం వలన కక్షిదారులు, న్యాయాధికారులు, న్యాయవాదులు ఇబ్బంది పడుతున్నారని, జిల్లా కోర్టుకు సమీపంలో స్థలాన్ని కేటాయించాలని కోరారు. స్థలం, నిధుల కేటాయింపునకు సహకారం అందిస్తామని న్యాయమూర్తులు హామీ ఇచ్చారు. ఆరు ఫాస్ట్ ట్రాక్ కోర్టుల నిర్మాణానికి రావాల్సిన నిధుల విషయంలోనూ సహకరిస్తామని అన్నారు. అనంతరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైకోర్టు న్యాయమూర్తులను ఘనంగా సన్మానించారు. అంతకుముందు న్యాయాధికారులతో హైకోర్టు న్యాయమూర్తులు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ కోర్ట్స్ విధులలో భాగంగా పలు సూచనలు చేశారు. జస్టిస్ శ్రీనివాసరెడ్డిని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఎస్పీ జగదీష్ మర్యాద పూర్వకంగా కలిశారు.

విజయవాడలో చెన్నై షాపింగ్‌మాల్ ప్రారంభం

- ప్రారంభించడం ఆనందంగా ఉంది : నటి శ్రీలీల

విజయవాడ (లబ్బీపేట), సెప్టెంబరు 28 : విజయవాడలో చెన్నై షాపింగ్‌మాల్‌ను తన చేతులమీదుగా ప్రారంభించడం ఆనందంగా ఉందని హీరోయిన్ శ్రీలీల అన్నారు. బందరురోడ్డులో ఏర్పాటుచేసిన చెన్నై షాపింగ్‌మాల్ నూతన షోరూంను శనివారం ఆమె ప్రారంభించారు. శ్రీలీల మాట్లాడుతూ విజయవాడలో చాలా షోరూంలు ప్రారంభించానని, చెన్నై షాపింగ్‌మాల్ ప్రత్యేకత వేరన్నారు. అధునాతన కలెక్షన్లతో చెన్నై షాపింగ్‌మాల్ మహిళామణులను ఆహ్వానిస్తోందని, ఈ సరికొత్త వస్త్రాల మాల్‌ను అందరూ సందర్శించాలని కోరారు. ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ విజయవాడలో చెన్నై షాపింగ్‌మాల్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి షోరూంల వల్ల ఎంతోమందికి ఉపాధి లభిస్తుందని, 500 మందికి పైగా మాల్‌లో పనిచేస్తున్నారని చెప్పారు. మాల్ అధినేత జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 19 షాపింగ్ మాల్స్ ప్రారంభించామని, వినియోగదారుల అభిరుచికి తగినట్టుగా వస్త్రాలను అందిస్తూ, వారి మన్ననలు పొందుతున్నామన్నారు. అందరికీ అందుబాటు ధరల్లో ఇక్కడ వస్త్రాలు లభిస్తాయని, కంచి, ధర్మవరం, బెనారస్, ఉప్పాడ, వివిధ రకాల పట్టువస్త్రాలు అందుబాటులో ఉన్నాయని ఆయన చెప్పారు.



చెన్నై షాపింగ్‌మాల్ నూతన షోరూంను ప్రారంభిస్తున్న నటి శ్రీలీల, మాల్ అధినేత జనార్దన్‌రెడ్డి తదితరులు

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆర్కే RK



కొత్తపలుకు

జర జాగ్రత్త... రేవంత్!

తెలంగాణలో ప్రధాన ప్రతిపక్షమైన భారత రాష్ట్ర సమితి ఇటీవలి కాలంలో దూకుడు పెంచింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కూడా గడవక ముందే బీఆర్ఎస్ నాయకులు స్పీడు పెంచడానికి కారణం లేకపోలేదు. పది మాసాల క్రితం జరిగిన ఎన్నికల్లో అనూహ్య ఓటమితోపాటు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తుంటి ఎముక విరిగి విశ్రాంతి తీసుకోవాల్సి రావడం, ఆయన కుమార్తె కవిత ఢిల్లీ లిక్కర్ కేసులో జైలుకు వెళ్లాల్సి రావడం వంటి వరుస పరిణామాలతోపాటు లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలుచుకోలేకపోవడంతో బీఆర్ఎస్ భవితవ్యంపై నీలి మేఘాలు కమ్ముకున్నాయి. దీనికి తోడు పార్టీ తరఫున గెలిచిన కొంతమంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరడం కూడా ఆ పార్టీని కుంగదీసింది. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కొన్ని వ్యూహాత్మక తప్పిదాల వల్ల భారత రాష్ట్ర సమితి ముఖ్య నాయకులు కేటీఆర్, హరీశ్‌రావు ఇటీవలి కాలంలో దూకుడు పెంచి రేవంత్‌రెడ్డి సర్కార్‌పై విరుచుకుపడుతున్నారు. భవిష్యత్తుపై ఆ పార్టీ నాయకుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

> మూసీ నదిలో ఆక్రమణలు జరగడానికి గత ప్రభుత్వాలే కారణం. సంబంధిత అధికారులు పట్టించుకోలేదు. రాజకీయ పార్టీలు ఒత్తిళ్లు తెచ్చి ఆక్రమణలకు పాల్పడి నిర్మించుకున్న కాలనీలకు ఆయా శాఖల అధికారులతో నీరు, విద్యుత్ వంటి సౌకర్యాలను సమకూర్చాయి. ఓట్లకోసం ఖాళీ స్థలాలను ఆక్రమింపజేయడం మన రాజకీయ పార్టీలకు అలవాటుగా మారింది. ఇలా ఆక్రమిత ప్రాంతాల్లో నిర్మితమైన ఇళ్లు చేతులు మారాయి. ఇప్పుడు డబ్బు పెట్టి వాటిని కొనుగోలు చేసినవాళ్లు లబోదిబోమనడం సహజం. ఆక్రమణలకు పాల్పడి ఇళ్లు నిర్మించి విక్రయించిన వారి నుంచి జరిమానా వసూలు చేసి బాధితులకు నష్టపరిహారం చెల్లించడం వంటి చర్యలపై దృష్టిపెట్టాలి. ఏళ్ల తరబడి ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం వల్ల ఆక్రమణ అనేది హక్కుగా ప్రజలు భావించే పరిస్థితి ఏర్పడింది.

దీంతో కాంగ్రెస్‌లో చేరడానికి సిద్ధపడిన మరింత మంది ఎమ్మెల్యేలు ప్రస్తుతానికి వెనక్కి తగ్గారు. ప్రజలకు కనపడకుండా, వినపడకుండా ఫాంహౌస్‌కే పరిమితమైన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, రాజకీయ వ్యూహాలకు పదునుపెట్టడం మొదలెట్టారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై న్యాయ పోరాటం చేసి వారిని అనర్హులుగా ప్రకటింపజేసి ఉప ఎన్నికలు వచ్చేలా కేటీఆర్, హరీశ్‌రావు వ్యూహరచన చేయగా, కేసీఆర్ వారిని వారిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులు బీఆర్ఎస్‌కు అనుకూలంగా మారడానికి మరికొంత సమయం పడుతుంది. కనుక ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ పార్టీయే మళ్లీ గెలుస్తుందని కేసీఆర్ అభిప్రాయపడుతున్నట్టు తెలిసింది. ఈ కారణంగా ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటింపచేయడంలో తొందరపడవద్దని, న్యాయ స్థానంలో వెంటనే తీర్పు రాకుండా కొంత సమయం తీసుకోవాలని కేసీఆర్ సూచించినట్టు చెబుతున్నారు. ఉప ఎన్నికలు అంటూ వస్తే వచ్చే ఏడాది జరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలని కేటీఆర్, హరీశ్‌రావుకు ఆయన సూచించినట్టు తెలిసింది. ఉప ఎన్నికలు వచ్చే లోపు ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకతను పెంచే దిశగా దాడిని ఉధృతం చేయాలని కూడా కేసీఆర్ దిశానిర్దేశం చేస్తున్నారు. పార్టీ ఫిరాయింపులకు సంబంధించి తెరవెనుక కూడా కొంత రాజకీయం చోటుచేసుకున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది.

కళ తప్పిన 'కమలం'

నిజానికి భారత రాష్ట్ర సమితి ఇంత త్వరగా కోలుకుంటుందని ఎవరూ ఊహించలేదు. లోక్‌సభ ఎన్నికల వరకు జోరుమీదున్న భారతీయ జనతా పార్టీ ప్రస్తుతం ఎందుకో నెమ్మదించింది. రాష్ట్రం నుంచి కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కేంద్ర మంత్రులుగా ఉన్నప్పటికీ ఆ పార్టీ కార్యక్రమాలు మందగించాయి. పార్టీ అధ్యక్షుడి మార్పు విషయమై కూడా బీజేపీ అధినాయకత్వం నిర్ణయం తీసుకోలేకపోతోంది. దీంతో రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఎదగాలని భావించిన బీజేపీ ఇప్పుడు వెనుకబడింది. అదే సమయంలో భారత రాష్ట్ర సమితి స్పీడ్ పెంచింది. మరో నెలలో హర్యానా, రెండు నెలల్లో మహారాష్ట్ర, ఝార్ఖండ్‌లలో ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల ఫలితాలు బీజేపీకి అనుకూలంగా రాని పక్షంలో ఆ ప్రభావం తెలంగాణ రాష్ట్రంలో పార్టీపై పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే వచ్చే ఏడాది ప్రారంభం నుంచి వేగం పెంచాలని కేసీఆర్ నిర్ణయించుకున్నారు. ఈ కారణంగానే కేటీఆర్, హరీశ్‌రావు నోటికి పదును పెడుతున్నారు. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ చోటుచేసుకుంటున్న పరిణామాలు ప్రతిపక్షానికి ఊతమిస్తున్నాయి.

కాంగ్రెస్‌లో తగ్గిన జోష్

రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన నాటి జోష్ ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో కనిపించడం లేదు. మంత్రులు కూడా ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం తీసుకున్న నిర్ణయం కారణంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పార్టీలో, ప్రభుత్వంలో పట్టుచిక్కడం లేదు. ఇదే సమయంలో మంత్రులపై అజమాయిషీ చేయలేని పరిస్థితిలోనూ ఆయన ఉన్నారు. అధిష్ఠానం జోక్యం ఎక్కువ కావడంతో ముఖ్యమంత్రి స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ హైదరాబాద్‌లోనే మకాం చేస్తున్నారు. ఆమె ఇక్కడ ఎందుకు ఉంటున్నారో తెలియదుగానీ ఆమెపై కొన్ని ఆరోపణలు కూడా వస్తున్నాయి. మరోవైపు ఎన్నికల వ్యూహకర్తగా వ్యవహరించిన సునీల్ కనుగోలు కూడా ప్రభుత్వ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. గత అనుభవాల నుంచి కాంగ్రెస్ అధిష్ఠానం గుణపాఠం నేర్చుకున్నట్టుగా లేదు. చీటికి మాటికీ ముఖ్యమంత్రిని ఢిల్లీకి పిలిపించుకొని తమ చుట్టూ తిప్పుకొంటున్నారు. ఇందిరా గాంధీ హయాంలో పరిస్థితులు ఇలా ఉండేవి కావు. కీలక అంశాలపై నిర్ణయాలు తీసుకొనే ముందు అధిష్ఠానం తరఫున దూతలు ఆయా రాష్ట్రాలకు వెళ్లి అభిప్రాయ సేకరణ జరిపేవారు. ముఖ్యమంత్రులను మార్చాలనుకున్నప్పుడు కూడా అధిష్ఠానం నుంచి దూతలు వచ్చేవారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు కాంగ్రెస్ అధిష్ఠానం తరఫున దూతగా జీకే మూపనార్ వస్తున్నారంటే ముఖ్యమంత్రుల గుండెల్లో రైళ్లు పరిగెత్తేవి. ఇప్పుడు ఇందుకు విరుద్ధంగా పీసీసీ అధ్యక్షుడిని ఎంపిక చేయాలన్నా, మంత్రివర్గ విస్తరణకు అనుమతులు కావాలన్నా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమకుమార్‌రెడ్డిని ఢిల్లీకి పిలిపించుకొని రోజుల తరబడి కూర్చోబెట్టుకుంటున్నారు. దీంతో 1983కి ముందు పరిస్థితులు పునరావృతం అవుతున్నాయన్న భావన ప్రజల్లో ఏర్పడుతోంది. కాంగ్రెస్ అధిష్ఠానం జోక్యం పెరిగిపోవడం వల్లనే 1982లో ఎన్టీఆర్ 'తెలుగువాడి ఆత్మగౌరవం' అన్న నినాదం అందుకొని తెలుగుదేశం పార్టీని ప్రారంభించారు. నిజానికి ఇప్పుడు కాంగ్రెస్ అధిష్ఠానం ప్రముఖులు అని చెప్పుకొంటున్న వారికి ఢిల్లీలో పెద్దగా పని లేదు. కర్ణాటక, తెలంగాణ, హిమాచల్‌ప్రదేశ్ మినహా మరే రాష్ట్రంలోనూ పార్టీ అధికారంలో లేదు. అలాంటప్పుడు ఢిల్లీలో కూర్చొని ముఖ్యమంత్రులను పిలిపించుకొనే బదులు ఆయా రాష్ట్రాలకు వారే వెళ్లవచ్చు కదా అన్న అభిప్రాయం ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కాంగ్రెస్ అధిష్ఠానం ఆయనకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చింది. ఫలితంగా అప్పట్లో అసంతృప్త స్వరాలు వినిపించేవి కావు. పార్టీపైనా, ప్రభుత్వంపైనా రాజశేఖర రెడ్డికి పూర్తి పట్టు ఉండేది. కేంద్రంలో అధికారంలో ఉండి కూడా కాంగ్రెస్ అధిష్ఠానం రాజశేఖర రెడ్డికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చింది. ఇప్పుడు ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ బలహీనంగా ఉంది. అయినా, ఏ రాష్ట్రంలోనైనా రాష్ట్ర నాయకుల రెక్కల కష్టంతో అధికారంలోకి వస్తే ఆ ప్రభుత్వంపై ఢిల్లీ పెద్దలు పెత్తనం చేయాలనుకుంటున్నారు. ఈ కారణంగా భవిష్యత్తులో తెలంగాణలో కాంగ్రెస్ బలహీనపడితే అందుకు పార్టీ అధిష్ఠానం కూడా బాధ్యత తీసుకోవలసి ఉంటుంది.

మంత్రులే ముఖ్యమంత్రుల్లా...

మంత్రులకు తమ శాఖల వ్యవహారాల్లో స్వేచ్ఛ ఉండాలి కానీ అది అపరిమితం కాకూడదు. మంత్రులకు కేటాయించిన శాఖలకు సంబంధించిన అంశాలలో ముఖ్యమంత్రి జోక్యం చేసుకోలేని పరిస్థితి కల్పిస్తే ఎలా? కేసీఆర్ హయాంలో మంత్రులకు స్వేచ్ఛ ఉండేది కాదన్న విమర్శ ఉన్నప్పటికీ... ఇతర మంత్రిత్వ శాఖలపై అజమాయిషీ చేసే అధికారం ముఖ్యమంత్రికి లేకుండా చేయడం ఏమిటి? ఈ కారణంగా ఇప్పుడు తెలంగాణలో పలువురు మంత్రులు తామూ ముఖ్యమంత్రులమే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. ఉదాహరణకు వైద్య ఆరోగ్య శాఖ పనితీరు అధ్వానంగా ఉంది. ప్రభుత్వ ఆస్పత్రుల పనితీరు గతంతో పోల్చితే ఇప్పుడు బాగోలేదన్న అభిప్రాయం ఉంది. అలాగే, విద్యుత్ శాఖ పనితీరుపై కూడా ప్రజల్లో అసంతృప్తి నెలకొంటోంది. అయినా ఆయా శాఖల పనితీరును సమీక్షించి మెరుగుపరిచే స్వేచ్ఛ ముఖ్యమంత్రికి లేని పరిస్థితి. దీనికి తోడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా కొన్ని సందర్భాలలో తొందరపాటు నిర్ణయాలు తీసుకుంటున్నారు. ప్రజలను దృష్టిలో ఉంచుకొని మాత్రమే ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకోవాలి. వ్యక్తులను దృష్టిలో పెట్టుకొని నిర్ణయాలు తీసుకుంటే రాజకీయంగా నష్టమే జరుగుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఏం జరిగిందో చూశాం. ప్రతిపక్ష నేత చంద్రబాబు టార్గెట్‌గానే ఆయన నిర్ణయాలు ఉండేవి. తాను జైలు జీవితం గడపడానికి కారణమని భావించి చంద్రబాబును కూడా జైలుకు పంపాలని జగన్‌రెడ్డి తపించారు. చివరికి తన కోరిక నెరవేర్చుకున్నారు. దానివల్ల ఆయన సాధించింది ఏమీ లేకపోగా ఎన్నికల్లో దారుణ పరాభవాన్ని మూటగట్టుకున్నారు. 11 సీట్లకే పరిమితం అయ్యారు. తెలంగాణలో కూడా కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డిని టార్గెట్ చేసుకున్నారు. అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుపై కోపంతో వేధించారు. ఫలితంగా తెలంగాణలో ఒక వర్గం ఓటర్లను దూరం చేసుకున్నారు. ఓటుకు నోటు కేసులో రేవంత్‌రెడ్డిని జైలుకు పంపి తన అహాన్ని సంతృప్తిపరచుకొని ఉండవచ్చును గానీ ఏకును మేకుగా తయారు చేస్తున్నానని మరచిపోయారు. ఆనాటి వేధింపులతో రాటుదేలిన రేవంత్‌రెడ్డి ఏకంగా ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగారు. అప్పట్లో కేసీఆర్ అతిగా వ్యవహరించి ఉండకపోతే రేవంత్‌రెడ్డి ఈ స్థాయికి ఎదగడానికి మరికొంత సమయం పట్టేదేమో? ఇది గతం! ఇప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్‌రెడ్డి కూడా గత చేదు అనుభవాలను మరచిపోలేకపోతున్నారు. ఫలితంగా కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులను దృష్టిలో పెట్టుకొనే వ్యవహరిస్తున్నారు. తెలంగాణ సమాజంలో కేసీఆర్ కుటుంబ ప్రభావం లేకుండా చేయాలని చూసిన సందర్భాలను చూశాం. తెలంగాణ చిహ్నం, తెలంగాణ గీతం, తెలంగాణ తల్లి విగ్రహం వంటి అంశాలు ఈ కోవలోకే వస్తాయి. తెలంగాణ అనేది ఏ ఒక్కరి జాగీరూ కాదు. తెలంగాణ ఏర్పాటులో కేసీఆర్ పాత్రను ఎవరూ తుడిచివేయలేరు. తాము స్వప్నించిన తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడంలో తనవంతు పాత్ర పోషించిన కేసీఆర్‌ను నెత్తిన పెట్టుకున్న ప్రజలే ఆయన నియంతృత్వ పోకడలను సహించలేక విసిరికొట్టారు. కేసీఆర్ వంటి శక్తిమంతమైన నాయకుడు కూడా ప్రజాగ్రహం ముందు తలవొంచక తప్పలేదు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని నడపడంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వాడిన భాషను ముఖ్యమంత్రిగా కూడా వాడితే ప్రజలు హర్షించరు. నాయకుడిగా వాడిన భాషనే ముఖ్యమంత్రిగా కూడా కేసీఆర్ వాడారు. చివరకు బావుకున్నది ఏమీ లేదు. పుష్కర కాలం పాటు తెలంగాణ ఉద్యమం సాగింది కనుక కేసీఆర్ భాషకు ప్రజలు అలవాటుపడ్డారు. రేవంత్‌రెడ్డి ఆయనకంటే ఎంతో చిన్నవారు. ఈ కారణంగా కేసీఆర్ భాషను ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి వాడకూడదు. ముఖ్యమంత్రి అంటే హుందాతనం ఉండాలి. రాజశేఖర రెడ్డి మర్రిచెట్టులా విస్తరించడంతో తెలంగాణలో కాంగ్రెస్‌కు బలమైన నాయకులు లేకుండా పోయారు. ఫలితంగానే ఎవరికి వారు తామెందుకు ముఖ్యమంత్రి కాకూడదని 2014 నుంచి పోటీపడుతూ వచ్చారు. చివరికి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డి ప్రదర్శించిన దూకుడు ఆయనకు కలిసొచ్చింది. ప్రజలు ఆయనలో కేసీఆర్‌కు ప్రత్యామ్నాయ నాయకుడిని చూసుకున్నారు. అప్పుడున్న పరిస్థితులలో రేవంత్‌రెడ్డికి మాత్రమే ప్రజల్లో ఆదరణ ఉంది. ఎన్నికల సమయంలో పార్టీని ముందుకు నడిపించడంలో కూడా ఆయన తన సమర్థతను రుజువు చేసుకున్నారు. రేవంత్‌రెడ్డిలోని టాలెంట్‌ను గుర్తించిన రాహుల్‌గాంధీ ఆయనకు కొండంత అండగా ఉంటున్నారు. అయితే ప్రతిపక్షంలో ప్రదర్శించిన దూకుడు ప్రభుత్వాధినేతకు తగదని ముఖ్యమంత్రి తెలుసుకోవాలి. కేసీఆర్, కేటీఆర్‌ను దృష్టిలో పెట్టుకొని నిర్ణయాలు తీసుకోకూడదు. తమ ప్రభుత్వ నిర్ణయాలకు ప్రజామోదం ఉందా? లేదా? అని మాత్రమే చూసుకోవాలి. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఇరికించే అవకాశం రేవంత్‌రెడ్డికి ఉంది. అయితే ఇందులో అనేక ప్రతిబంధకాలు ఉన్నాయి. ఎన్నో ఒత్తిళ్లు ఉంటాయి. చర్యలంటూ తీసుకుంటే నీటి పారుదల శాఖలో పనిచేయడానికి ఇంజనీర్లు మిగలరన్నది అక్షర సత్యం. కాళేశ్వరంపై విచారణ జరుపుతున్న పీసీ ఘోష్ కమిషన్ చేస్తున్న వ్యాఖ్యలను కూడా చూస్తున్నాం. అందుకే చివరకు గజం మిథ్య పలాయనం మిథ్య అవుతుంది. ఇప్పుడు అవినీతి ప్రాతిపదికన ఎన్నికల్లో ప్రజల తీర్పు ఉండటం లేదు. అలా అయితే జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయివుండేవారే కారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కేసీఆర్ అవినీతికి పాల్పడిన తీరును రుజువు చేసినా కాంగ్రెస్ పార్టీకి అదనపు ప్రయోజనం ఉండకపోవచ్చు. ఎన్నికల్లో తాము ఓడించిన వారిని ప్రజలు ఇట్టే మరచిపోతారు. అధికారంలో ఉన్నప్పుడు వారు చేసిన చర్యలను కూడా గుర్తుపెట్టుకోరు. ప్రభుత్వంలో ఉన్నవారి నిర్ణయాలు ఎలా ఉంటున్నాయని మాత్రమే చూస్తారు. వ్యక్తులు టార్గెట్‌గా ప్రభుత్వాన్ని నడిపితే ఫలితం ప్రతికూలంగానే ఉంటుంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లక ముందే ఇటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అటు కాంగ్రెస్ అధిష్ఠానం మేలుకోవాలి. రైతులకు రుణ మాఫీ చేస్తానని హామీ ఇచ్చిన కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు దాన్ని చాలా కాలం మరచిపోయారు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ముందూ వెనుకా చూసుకోకుండా, ఆర్థిక వనరులను సమకూర్చుకోకుండా పౌరుషానికి పోయి రుణమాఫీకి పూనుకుంది. ప్రతిపక్షానికి అదే ఆయుధం అయింది. అధికారంలోకి వచ్చేందుకు ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీలు ఎన్నో హామీలు ఇవ్వడం పరిపాటి అయింది. ప్రజలు కూడా అవన్నీ అమలు అవుతాయని ఆశించడం లేదు. మొత్తంగా ప్రభుత్వ పనితీరు సంతృప్తికరంగా ఉందా? లేదా? అని మాత్రమే చూస్తారు.

> ఇతర మంత్రిత్వ శాఖలపై అజమాయిషీ చేసే అధికారం ముఖ్యమంత్రికి లేకుండా చేయడం ఏమిటి? ఈ కారణంగా ఇప్పుడు తెలంగాణలో పలువురు మంత్రులు తామూ ముఖ్యమంత్రులమే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు.



> ప్రజలను దృష్టిలో ఉంచుకొని మాత్రమే ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకోవాలి. వ్యక్తులను దృష్టిలో పెట్టుకొని నిర్ణయాలు తీసుకుంటే రాజకీయంగా నష్టమే జరుగుతుంది. అప్పట్లో కేసీఆర్ అతిగా వ్యవహరించి ఉండకపోతే రేవంత్‌రెడ్డి ఈ స్థాయికి ఎదగడానికి మరికొంత సమయం పట్టేదేమో? ఇది గతం! ఇప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్‌రెడ్డి కూడా గత చేదు అనుభవాలను మరచిపోలేకపోతున్నారు. ఫలితంగా కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులను దృష్టిలో పెట్టుకొనే వ్యవహరిస్తున్నారు. తెలంగాణ సమాజంలో కేసీఆర్ కుటుంబ ప్రభావం లేకుండా చేయాలని చూసిన సందర్భాలను చూశాం. తెలంగాణ చిహ్నం, తెలంగాణ గీతం, తెలంగాణ తల్లి విగ్రహం వంటి అంశాలు ఈ కోవలోకే వస్తాయి. తెలంగాణ అనేది ఏ ఒక్కరి జాగీరూ కాదు. తెలంగాణ ఏర్పాటులో కేసీఆర్ పాత్రను ఎవరూ తుడిచివేయలేరు. తాము స్వప్నించిన తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడంలో తన వంతు పాత్ర పోషించిన కేసీఆర్‌ను నెత్తిన పెట్టుకున్న ప్రజలే ఆయన నియంతృత్వ పోకడలను సహించలేక విసిరికొట్టారు. కేసీఆర్ వంటి శక్తిమంతమైన నాయకుడు కూడా ప్రజాగ్రహం ముందు తల వొంచక తప్పలేదు.

ఆచితూచి వెళితేనే...

ప్రభుత్వాధినేతగా రేవంత్‌రెడ్డి ఆచితూచి నిర్ణయాలు తీసుకోవడం అలవరుచుకోవాలి. చెరువులు, జలాశయాల పరిరక్షణ అవసరమే. అంతమాత్రాన ఈ విషయంలో దూకుడు తగదు. ఆక్రమణల పేరిట వేలాది ఇళ్లు కూల్చడం ప్రజల్లో వ్యతిరేకతకు దారితీస్తుంది. హైడ్రా చర్యల వల్ల ఏ పాపం తెలియనివాళ్లు నిరాశ్రయులు అవుతున్నారు. ఫాం హౌజ్‌లను, అతిథి గృహాలను నిబంధనలను అతిక్రమించి నిర్మిస్తే కూల్చినా ఫర్వాలేదుగానీ... అన్ని అనుమతులతో పేదలు, మధ్యతరగతివారు నిర్మించుకున్న వాటిని, దశాబ్దాల క్రితం నిర్మించుకున్న వాటిని తొలగించాలనుకోవడం మంచిది కాదు. ప్రభుత్వ స్థలాలు, చెరువు శిఖంను ఆక్రమించడం పరిపాటిగా మారింది. రాజకీయ పార్టీలు ఈ చర్యలను ఇప్పటివరకూ ప్రోత్సహించాయి. మూసీ ప్రాజెక్టును అభివృద్ధి చేయాలనుకోవడం తప్పు కాదు. అయితే... దశాబ్దాలుగా మూసీలో ఆక్రమణలు జరిగాయి. వేలాది మంది ఇళ్లను నిర్మించుకున్నారు. నిజానికి ఈ ప్రాజెక్టును ప్రజలు కోరుకోలేదు. ఫాం హౌస్‌ల కూల్చివేతలు జరిగినప్పుడు ప్రజల్లో సానుకూల స్పందన ఏర్పడింది. అయితే, హైడ్రా దూకుడు పెంచి సామాన్య ప్రజలు నిర్మించుకున్న ఇళ్లను కూడా కూల్చివేయడం ప్రారంభించగానే ప్రజల్లో వ్యతిరేకత మొదలైంది. చెరువులు, జలాశయాల ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్లను ముందుగా నిర్ణయించకుండా, ఇతర శాఖల అనుమతులతో నిర్మించుకున్న ఇళ్లను కూల్చడం సమర్థనీయం కాదు. ఇది అంతిమంగా ప్రజల్లో వ్యతిరేకతకు దారితీస్తుంది. తాజాగా బుచ్చెమ్మ అనే మహిళ కూల్చివేతలకు భయపడి ఆత్మహత్య చేసుకుంది. మరోవైపు మూసీనది ప్రక్షాళన పేరుతో జనావాసాలను ఖాళీ చేయించడంపై కూడా ప్రజల్లో ఆగ్రహావేశాలు నెలకొన్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తక్షణం ఈ అంశంపై దృష్టి కేంద్రీకరించాలి. కూల్చివేతలకు తాత్కాలికంగా విరామం ప్రకటించాలి. మొత్తం పరిస్థితిని సమీక్షించాలి. రెండు రోజుల క్రితం సంగారెడ్డి వద్ద ఎవరో చెరువులో నాలుగు అంతస్తుల భవనం నిర్మించుకున్నారు. అలాంటి వాటిని కూల్చినా ఎవరూ పట్టించుకోరు. మూసీ నది విషయమే తీసుకుందాం. అక్కడ ఆక్రమణలు జరగడానికి గత ప్రభుత్వాలే కారణం. సంబంధిత అధికారులు పట్టించుకోలేదు. రాజకీయ పార్టీలు ఒత్తిళ్లు తెచ్చి ఆక్రమణలకు పాల్పడి నిర్మించుకున్న కాలనీలకు ఆయా శాఖల అధికారులతో నీరు, విద్యుత్ వంటి సౌకర్యాలను సమకూర్చాయి. ఓట్లకోసం ఖాళీ స్థలాలను ఆక్రమింపజేయడం మన రాజకీయ పార్టీలకు అలవాటుగా మారింది. ఇలా ఆక్రమిత ప్రాంతాల్లో నిర్మితమైన ఇళ్లు చేతులు మారాయి. ఇప్పుడు డబ్బు పెట్టి వాటిని కొనుగోలు చేసినవాళ్లు లబోదిబోమనడం సహజం. కూల్చివేతలపై ప్రజల్లో వ్యతిరేకత బలపడకముందే ప్రభుత్వం మేలుకోవాలి. తమది నిర్మాణాత్మక ప్రభుత్వమైతే రేవంత్‌రెడ్డిది కూల్చివేతల ప్రభుత్వమని బీఆర్ఎస్ నాయకుడు కేటీఆర్ చేసిన విమర్శ ప్రజల్లోకి వ్యాపించక ముందే ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోవాలి. కూల్చివేతలే ప్రభుత్వ అజెండా అయితే ప్రతిపక్షానికి బలమైన ఆయుధం ఇచ్చినట్టు అవుతుంది. తెలంగాణలో కూల్చివేతలు మాత్రమే జరుగుతున్నాయని ప్రజల్లో అభిప్రాయం ఏర్పడితే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవలసి వస్తుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తలపెట్టిన మూసీ ప్రాజెక్టును తాత్కాలికంగా పక్కనపెట్టడం వాంఛనీయం. లేడికి లేచిందే పరుగు అన్నట్టుగా ఏదీ ఉండకూడదు. ఆక్రమణలకు పాల్పడిన వారిని ముందుగా గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలి. ఆక్రమణలకు పాల్పడి ఇళ్లు నిర్మించి విక్రయించిన వారి నుంచి జరిమానా వసూలు చేసి బాధితులకు నష్టపరిహారం చెల్లించడం వంటి చర్యలపై దృష్టిపెట్టాలి. ఎవరో చేసిన నేరాలకు మరెవరినో శిక్షించడం సమంజసం, సమర్థనీయం కాదు కదా! ఆక్రమణ అయినా, మరేదైనా ప్రజలతో ముడిపడి ఉన్న సందర్భాలలో ప్రభుత్వం సంయమనంతో వ్యవహరించాలి. వ్యక్తులు వేరు–ప్రజా సమస్యలు వేరు. ఏళ్ల తరబడి ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం వల్ల ఆక్రమణ అనేది హక్కుగా ప్రజలు భావించే పరిస్థితి ఏర్పడింది. ఏది ఏమైనా కూల్చివేతలపై ప్రజాభిప్రాయం ఎలా ఉందో తెలుసుకొనే ప్రయత్నం ఇప్పుడు జరగాలి. హైడ్రా చర్యలను తొలుత ఆక్షేపించని ప్రతిపక్షాలు ఇప్పుడు ఎందుకు స్వరం పెంచుతున్నాయో తెలుసుకొనే ప్రయత్నం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేయాలి. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అంటే కూల్చివేతల ప్రభుత్వం అనే పేరు తెచ్చుకోవద్దు. హెచ్చరికలతో కూడిన ఈ సూచనలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పట్టించుకుంటారో లేదో వేచి చూద్దాం!

> గత అనుభవాల నుంచి కాంగ్రెస్ అధిష్ఠానం గుణపాఠం నేర్చుకున్నట్టుగా లేదు. చీటికి మాటికీ ముఖ్యమంత్రిని ఢిల్లీకి పిలిపించుకొని తమ చుట్టూ తిప్పుకొంటున్నారు. ఇందిరాగాంధీ హయాంలో పరిస్థితులు ఇలా ఉండేవి కావు. కీలక అంశాలపై నిర్ణయాలు తీసుకొనే ముందు అధిష్ఠానం తరఫున దూతలు ఆయా రాష్ట్రాలకు వెళ్లి అభిప్రాయ సేకరణ జరిపేవారు. ముఖ్యమంత్రులను మార్చాలనుకున్నప్పుడు కూడా అధిష్ఠానం నుంచి దూతలు వచ్చేవారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు కాంగ్రెస్ అధిష్ఠానం తరఫున దూతగా జీకే మూపనార్ వస్తున్నారంటే ముఖ్యమంత్రుల గుండెల్లో రైళ్లు పరిగెత్తేవి. ఇప్పుడు ఇందుకు విరుద్ధంగా పీసీసీ అధ్యక్షుడిని ఎంపిక చేయాలన్నా, మంత్రివర్గ విస్తరణకు అనుమతులు కావాలన్నా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమకుమార్‌రెడ్డిని ఢిల్లీకి పిలిపించుకొని రోజుల తరబడి కూర్చోబెట్టుకుంటున్నారు. దీంతో 1983కి ముందు పరిస్థితులు పునరావృతం అవుతున్నాయన్న భావన ప్రజల్లో ఏర్పడుతోంది.

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan చేయండి

మహాత్ముడి 'వీలునామా'


గాంధీజీ పిలుపు మేరకు 'డు ఆర్ డై' నినాదంతో 1942 ఆగస్టు 9న క్విట్ ఇండియా ఉద్యమం ఆరంభమైంది. గాంధీ కస్తూర్బాలను పూనాలోని ఆగాఖాన్ ప్యాలెస్‌లో బ్రిటిష్ ప్రభుత్వం నిర్బంధంలో ఉంచింది. గాంధీకి వరుసకు మనవరాలైన 14 ఏళ్ల మనుబెహన్ గాంధీని కూడా ఉద్యమంలో పాల్గొన్నందుకు నాగపూర్ జైల్లో బందీగా ఉంచారు. ఆ తర్వాత తొమ్మిది నెలలకు కస్తూర్బా అనారోగ్యం కారణంగా ఆమెకు సపర్యలు చేయడానికి ప్రభుత్వం మనుబెహన్‌ను కూడా ఆగాఖాన్ ప్యాలెస్‌కు తరలించింది. కస్తూర్బా మరణం తర్వాత, కొంతకాలం సేవాగ్రాంలో ఉన్న మనుబెహన్, ఆ తరువాత కొద్దికాలం చదువు నిమిత్తం వేరే ప్రాంతాలకు వెళ్ళి తిరిగి గాంధీని చేరుకున్నది. అప్పుడు ఆయన బీహార్‌లోని నోవాఖలిలో మతకలహపు మారణహోమాన్ని ఆర్పివేసే కార్యక్రమంలో తలమునకలై ఉన్నారు. ఆయనకు నీడలా వెన్నంటి ఉండి సపర్యలు చేసింది మనుబెహన్. 1948లో గాంధీజీ హత్యచేయబడిన మరుసటిరోజు వరకు ప్రతిరోజూ ఆయన దినచర్యలను, వివిధ అంశాలపై గాంధీ ఆలోచనలను మనుబెహన్ అక్షరబద్ధం చేసింది. ఆ డైరీలు గాంధీజీ 'వీలునామా' వలె తనకు మార్గదర్శకంగా ఉన్నాయని 'బాపు మై మదర్' అనే తన పుస్తకంలో పేర్కొన్నది. అవి గాంధీజీ స్వభావం, కార్యక్రమాలను ప్రతిఫలిస్తాయని ముందుమాట రాసిన ప్రముఖ గాంధేయవాది కె.జి.మష్రువాలా అభిప్రాయపడ్డారు.

* * *

ప్రజల సంపదను ఒక వ్యక్తి స్వప్రయోజనాలకు వాడుకోవడం హింసాత్మకమైనదని బాపు అభిప్రాయం. 1947లో వైస్రాయిగా ఢిల్లీ వచ్చిన మౌంట్ బాటన్ గాంధీతో సమావేశానికై ఆహ్వానం పంపాడు. ఆ మేరకు, ప్రభుత్వాధికారులు గాంధీజీ ఢిల్లీ చేరుకోవడానికి విమానప్రయాణపు ఏర్పాట్లుచేశారు. కానీ గాంధీజీ దానిని తిరస్కరించి రైలు ప్రయాణానికి ఒప్పుకున్నారు. మూడవతరగతి ప్రయాణపు ఏర్పాట్లను ఆయన మనుబెహన్‌కు అప్పగించాడు. కానీ సౌకర్యం కోసం ఆమె రెండు పెట్టెలను ఎన్నుకొన్నది. దానికి మనుపై ఆగ్రహించిన బాపు ఒక పెట్టెను ఖాళీచేయించి వేలాడుతూ ప్రయాణంచేస్తున్న ఇతర ప్రయాణికుల కోసం వాడవలసిందని స్టేషన్ అధికారిని కోరారు. మొదట ఆ అధికారి ఒప్పుకోలేదు. 'మనకు అవసరం లేని దానిని వాడడం హింసాత్మకమైనది. తనకు లభించిన ఒక అదనపు హక్కును ఈ అమ్మాయి దుర్వినియోగం చేయడాన్ని సమర్థించి ఆమెను చెడగొడతారా?' అంటూ అతన్ని మందలించి, సరేననిపించారు గాంధీ.

నోవాఖలి యాత్రలో భాగంగా ఒకరోజు బయలుదేరవలసిన సమయానికి ఐదు నిమిషాలు ఆలస్యం చేసినందుకు మనుబెహన్‌ను గాంధీజీ చీవాట్లుపెట్టారు. 'నువ్వు 500 మందివి... ఐదు నిమిషాలు దొంగలించావు. దీనిని భరించలేను. నేను వెళుతున్నాను. నువ్వు నా వెనక వచ్చేయి. నేను బయలుదేరే సమయం 7 గంటలని ప్రజలకు చెప్పినప్పుడు, రెండు సెకండ్లు ఆలస్యమయినా అది నాకు బాధ కలిగిస్తుంది.'. నోవాఖలి పర్యటనలోనే మరొకరోజు ఒక ఊరు నుండి మరొక ఊరుకు వెళ్లే క్రమంలో గాంధీజీ స్నానం చేసేపుడు ఒళ్ళు రుద్దుకునేందుకు వాడే ఒక గరుకు రాయిని మనుబెహన్ మరచిపోయింది. అందుకు శిక్షగా ఆమెను ఒంటరిగా ఆ ఊరికి తిరిగివెళ్లి ఆ రాయిని తీసుకురావాలని ఆజ్ఞాపించారు. ఆ విషయాన్ని వివరిస్తూ ఆమె రాసిన కథనం ఆసక్తికరంగా ఉంటుంది: 'అవసరమైన ప్రతిదాని పట్ల ఎంత శ్రద్ధగా ఉండాలనే పాఠం ఇవాళ నువ్వు నేర్చుకున్నావు. ఇలాంటి రాళ్లు ఎన్ని కావాలనుకున్నా దొరుకుతాయి కదా అని అశ్రద్ధ కూడదు' అంటూ గాంధీజీ తనను మెచ్చుకున్నట్లు ఆమె రాసింది. 'బాపూ, ఇంత పిసినారిగా ఎందుకు ఉండాలి?' అని హాస్యంగా ఒకసారి మనుబెహన్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఓ చిన్న గుడ్డ ముక్కను లేదా కొన్ని చుక్కల కిరసనాయిల్‌ను కూడా ఎలా పొదుపు చేయాలో, ఆ పొదుపు మనకు ఎలా లాభిస్తుందో అనే విషయాన్ని ఆయన వివరించిన తీరును ఉటంకిస్తూ బాపు ఒక గొప్ప బోధకుడు అని ఆమె వ్యాఖ్యానించింది. మరొకరోజు మల మూత్రాదులు ఉన్న దారిని శుభ్రం చేసి, గాంధీజీ తన సిద్ధాంతాల పట్ల ఎంత ఆచరణాత్మకంగా ఉండేవారో మను మనకు తెలియజేస్తుంది. 'ఆకలి అయినప్పుడు అన్నం తింటే ఎలా తృప్తిగా ఉంటుందో, అలాగే ఈ పారిశుద్ధ్యపు పని నాకు అంతులేని సంతోషాన్ని ఇస్తుంది' అని ఆ సందర్భంగా గాంధీ అన్నారు.

> మనుబెహన్ తన 'బాపు మై మదర్'లో 14 అంశాలుగా రాసిన వ్యాసాలు 'భావ్ నగర్ సమాచార్' అనే గుజరాతీ వారపత్రికలో ధారావాహికగా వెలువడ్డాయి. ఆమె జీవించి ఉన్న రోజుల్లోనే అవి పుస్తక రూపంలో ప్రచురితమైనాయి. గుజరాతీలో రాసిన ఆ పుస్తకాన్ని ఆమె మిత్రురాలు చిత్రాదేశాయ్ ఇంగ్లిష్‌లోకి అనువదించింది. డైరీలు మాత్రం ఆమె మరణం (1969) తర్వాత చాలాకాలానికి లభించడంచేత 2019లో ముద్రితమైనాయి.



నోవాఖలి యాత్రలో బాపు క్యాంపు నిర్వహణ చూసుకునే సతీష్ బాబు తయారుచేసిన 'టెంట్'ను రాజభవనం లాగ ఉందని, అందువల్ల దానిని తాను వాడనని, మరోలాగా వాడుకోమని ఓ ఊరిలో వదిలివేశాడు గాంధీ. అదే సందర్భంలో తాను చెప్పులు వాడకూడదని నిర్ణయం తీసుకున్నారు. 'గుళ్ళు, మసీదులు, చర్చిలు లాంటి పవిత్ర స్థలాలకు వెళ్ళినప్పుడు మనం చెప్పులు బయటే వదిలి లోనికి వెళ్తాం. నేను దరిద్ర నారాయణుని దర్శనానికి వెళుతున్నాను. నేను కలుసుకోబోతున్నవారి కుటుంబ సభ్యులు లూటీ చేయబడ్డారు. అమాయక స్త్రీలు, పిల్లలు ఊచకోతకు గురయ్యారు. వాళ్ళ నగ్న శరీరాలపైన కప్పుకోవడానికి సరైన గుడ్డలు లేవు. అలాంటి నేలపైన వాళ్లను కలవడం నా మటుకు నాకు ఓ పవిత్ర యాత్ర కాబట్టి చెప్పులు వేసుకోవడం ఎలా వీలవుతుంది?'

మరొక సంఘటనలో, తనకు స్వాగతం చెప్పడానికి ఊరంతటిని పూలతో అలంకరించిన ఆ గ్రామస్థుడైన కాంగ్రెస్ కార్యకర్తపై ఆయన కోపం చేశాడు: 'ఈ ఊళ్ళో డబ్బు ఎక్కువైనట్లుంది. లేకపోతే ఇంత కష్టసమయంలో ఈ అలంకరణ గురించి మీరు ఆలోచించేవారు కాదు. అంతేగాక నువ్వు ఒక కాంగ్రెస్ కార్యకర్తవు. జైలుకు వెళ్లావు, ఈ చిన్న ఖద్దరు ధోతీ ధరిస్తావు. అయినా కూడా ఈ విదేశీ దారాలు, రిబ్బన్లు వాడావు. ఇవాళ ప్రజాసేవకులుగా గుర్తింపబడినవారు ఒకవేళ రేపు గౌరవప్రదమైన స్థానాలు అలంకరిస్తే, ఇలాగే ఖరీదైన పూలమాలలు ఇవ్వడం, తీసుకోవడం చేస్తారా?' వెంటనే గ్రామస్తులు ఆ అలంకరణలను తొలగించి, ఆ తర్వాత వాటిలోని దారాలను బట్టను నేసేందుకు వినియోగించారు.

14 ఆగస్టు 1947 అర్ధరాత్రి దేశమంతా స్వాతంత్ర్య సంబరాలు జరుపుకుంటున్న సమయంలో, కలకత్తాలో బస చేసి ఉన్న గాంధీజీ వద్దకు వచ్చిన కొందరు నాయకులను ఉద్దేశించి ఆయన కొన్ని విషయాలు చెప్పారు. 'చూడండి! ఈ రోజు నుండి మీరంతా ముళ్ళ కిరీటాలు ధరించవలసి ఉంటుంది. ఇవాళ ఎంత నిరాడంబరంగా ఉన్నారో, రేపు అధికారం వచ్చిన తర్వాత కూడా అలాగే ఉండాలి. విలాసాలకు, ఆడంబరాలకు లోనుకాకండి. నిరాడంబరత, అణకువ, అహింస, సహనంతో ప్రజలకు మార్గదర్శకులుగా నిలవండి. పల్లెటూర్లను బాగు చేయండి. మీకు అసలైన పరీక్ష ఇప్పుడు మొదలవుతోంది. ఇన్నాళ్ల బ్రిటిష్ పాలనలో మీకు పరీక్ష లేదు, కానీ ఈ రోజు నుండి వరుస పరీక్షలు మొదలవుతాయి'.

అలాగే, 'ఎవరైనా మనకు స్వపరిపాలన, మంచి పరిపాలన మనదేశానికి తేగలరు అంటే... అది కేవలం మన స్త్రీలే అని నేను ఘంటాపదంగా చెప్తున్నాను' అని ఒక సందర్భంలో స్త్రీల గురించి బాపూజీ ఎంతో విలువైన వ్యాఖ్య చేశారట. మనుబెహన్ తన 'బాపు మై మదర్'లో 14 అంశాలుగా ప్రచురించబడిన వ్యాసాలు 'భావ్‌నగర్ సమాచార్' అనే గుజరాతి వారపత్రికలో ధారావాహికగా వెలువడ్డాయి. ఆమె జీవించి ఉన్న రోజుల్లోనే అవి పుస్తక రూపంలో ప్రచురితమైనాయి. గుజరాతీలో రాసిన ఆ పుస్తకాన్ని ఆమె మిత్రురాలు చిత్రాదేశాయ్ ఇంగ్లిష్‌లోకి అనువదించింది. ఆమె రాసిన డైరీలు మాత్రం ఆమె మరణం (1969) తర్వాత చాలాకాలానికి లభించడంచేత 2019లో ముద్రించబడ్డాయి. అక్టోబర్ 2 గాంధీజీ జన్మదినం. అయితే, పంచాంగం ప్రకారం భాద్రపద మాసం శుక్లపక్షం ద్వాదశి రోజున కూడా ఆయన జన్మదినాన్ని జరుపుకునేవారట.

■ చింతకుంట్ల సంపత్‌రెడ్డి

(అక్టోబర్ 2: గాంధీ జయంతి)





అందాల లీల

నగరంలోని బందరు రోడ్డులో ఏర్పాటుచేసిన చెన్నై షాపింగ్‌మాల్‌ను నటి శ్రీలీల శనివారం ప్రారంభించారు. మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ కూడా పాల్గొన్నారు. శ్రీలీలను చూసేందుకు అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.



నిమజ్జనం

- ఘనంగా 72 అడుగుల మహాగణపతి నిమజ్జనోత్సవం
- భారీగా తరలివచ్చిన భక్తులు



భవానీపురం, సెప్టెంబరు 28 : డూండీ గణేశ్ సేవా సమితి ఆధ్వర్యంలో విద్యాధరపురం లేబర్ కాలనీ గ్రౌండ్స్‌లో పూజ లందుకున్న 72 అడుగుల విజయ మహాగణపతి మట్టి విగ్రహ నిమజ్జనోత్సవం శనివారం రాత్రి ఘనంగా జరిగింది. నిర్వాహకులు డూండీ రాకేశ్, గడ్డం రవి పర్యవేక్షణలో తొలుత అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. తీన్‌మార్, వి ఐరుమిట్లు గొలిపే బాణాసంచా పేలుళ్ల, భక్తుల జై గణేశ్ నినాదాల నడుమ నిమజ్జనోత్సవం జరిగింది. నాలుగు ఫైరింజన్లతో పాటు మున్సిపల్ వాటర్ ట్యాంకర్లతో విగ్రహాన్ని ఉన్నచోటనే నీటితో తడిపి నిమజ్జనం చేశారు. సితార సెంటర్ నుంచి చర్చి సెంటర్ వరకు భారీగా భక్తులు తరలిరావడంతో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కాగా, గణేశుడి లడ్డూను స్థానిక విపోదా ఫిన్‌స్పైర్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ యజమానులు నక్కా రామ్‌బాలాజీ, సింగంరెడ్డి ప్రదీప్‌రెడ్డి రూ.16 లక్షలకు వేలంపాటలో పాడుకున్నారు. దీన్ని నిర్వాహకుల సమక్షంలో భక్తులందరికీ పంచిపెట్టాలని వారు కోరారు. నిమజ్జనాన్ని పురస్కరించుకుని శనివారం మధ్యాహ్నం భారీ అన్నదానం నిర్వహించారు.

పరిహారం అందనివారికి పరిష్కారం

ఆ 3,095 మందికి రీ వెరిఫికేషన్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఇంకా పరిహారం అందని 3,095 మంది వరద బాధితులపై అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టారు. అర్హులైన అందరికీ పరిహారం అందాలన్న సీఎం చంద్రబాబు ఆదేశానుసారం.. పరిహారం అందని బాధితుల నుంచి గ్రీవెన్స్ తీసుకుని రీ వెరిఫికేషన్, క్షేత్రస్థాయిలో విచారణ చేస్తున్నారు. చాలామందికి బ్యాంకు అకౌంట్ల సమస్య కారణంగా పరిహారం అందలేదని తెలుస్తోంది. కొందరికి వారి ఆధార్ కార్డులతో బ్యాంకు ఖాతాలు అనుసంధానం కాకపోవటం, మరికొందరికి యాక్టివ్‌గా లేకపోవడం వల్లే ఈ సమస్య ఎదురైందని సమాచారం. ఈ కేసులన్నింటినీ పునఃపరిశీలిస్తున్నట్టు కలెక్టర్ సృజన తెలిపారు. ఆధార్‌కు బ్యాంకు ఖాతాలు అనుసంధానం చేయించడం, యాక్టివ్‌లో లేని ఖాతాలను యాక్టివ్‌లోకి తీసుకురావడం చేస్తున్నారు.

వైసీపీ నేత రేషన్ డిపో సీజ్

- అదనంగా 21 క్వింటాళ్ల బియ్యం గుర్తింపు
- అధికారుల తనిఖీలు.. కేసు నమోదు

6లో

ఉమ్మడి కృష్ణాలో 32 మంది ఈవోపీఆర్డీల బదిలీ

6లో



దుర్గమ్మ ప్రసాదాల తయారీలో అవకతవకలపై దేవదాయ శాఖ చర్యలకు ఉపక్రమిస్తోంది. లడ్డూ తయారీకి సంబంధించిన కాంట్రాక్టర్ సరఫరా చేసే సరుకులు గ్రేడ్-1 కాకపోవడం, ప్రసాదాల తయారీకి నాసిరకం సరుకులు పంపడం.. తదితర కారణాలతో దుర్గగుడి ఏఈవోను బదిలీ చేస్తూ శనివారం దేవదాయ శాఖ ఆదేశాలు ఇచ్చింది. నెయ్యి శాంపిల్స్ హైదరాబాద్‌లోని నాచారం ల్యాబ్‌కు పంపారు. ఆ నివేదిక రాగానే ఇంకెందరిపై చర్యలు తీసుకుంటారోననే చర్చ ఇంద్రకీలాద్రిపై జరుగుతోంది.

ఇక వెళ్లండి..!

దుర్గగుడిలో నాణ్యత లేని జీడిపప్పు, కిస్మిస్ ఎఫెక్ట్

ఏఈవో రమేశ్‌ను బదిలీ చేస్తూ ఉత్తర్వులు

ఎలాంటి లేబుల్స్ లేని జీడిపప్పు, కిస్మిస్ సరఫరా
పట్టించుకోని ప్రొవిజన్స్ విభాగం
ప్రసాదం తయారీకి గ్రేడ్-1 కాకుండా నాసిరకం సరుకు
రమేశ్‌ను బాధ్యుడ్ని చేస్తూ బదిలీ ఆదేశాలు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలోని లడ్డూ తయారీ కేంద్రంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు చేసిన తనిఖీల ప్రభావం ఓ అసిస్టెంట్ కార్యనిర్వహణాధికారిపై పడింది. దుర్గగుడి ప్రధాన ఆలయం, ఎస్టాబ్లిష్‌మెంట్, ప్రొవిజన్స్ విభాగాన్ని పర్యవేక్షిస్తున్న ఏఈవో రమేశ్‌ను బదిలీ చేస్తూ దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ శనివారం ఆదేశాలు ఇచ్చారు. ఆయన్ను తక్షణమే పశ్చిమగోదావరి జిల్లాలోని ద్వారకాతిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో రిపోర్టు చేయాలని స్పష్టం చేశారు. రెండేళ్లపాటు డిప్యూటేషన్‌పై అక్కడే పనిచేయాలన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన బదిలీల్లో రమేశ్‌ను సింహాచలం దేవస్థానానికి బదిలీ చేశారు. అక్కడ కొద్దిరోజులపాటు పనిచేసిన ఆయన తిరిగి దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానానికి డిప్యూటేషన్‌పై వచ్చారు. ఆయన సర్వీసులో ఎక్కువ సమయం దుర్గగుడిలోనే పనిచేశారు. సింహాచలం నుంచి వచ్చాక కూడా ఇక్కడే పనిచేస్తున్నారు.

అమ్మ ప్రసాదంలో అపచారం

తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి ఉపయోగించారన్న దుమారం రేగిన తర్వాత ఫుడ్ సేఫ్టీ అధికారులు దుర్గగుడిలోని లడ్డూ తయారీ కేంద్రంలో సోదాలు నిర్వహించారు. ఆ సమయంలో అక్కడ ఎలాంటి లేబుల్స్ లేకుండా ఉన్న జీడిపప్పు, కిస్మిస్ ప్యాకెట్లను గుర్తించారు. వాటిని పరిశీలించి 1,100 కిలోల జీడిపప్పు, 700 కిలోల కిస్మిస్‌ను తిరిగి సరఫరాదారుడికి పంపేయాలని ఆదేశించారు. ఆ ప్యాకెట్లలో ఉన్న సరుకును పరిశీలించగా, గ్రేడ్-1 కాదని ఫుడ్ సేఫ్టీ అధికారులు గుర్తించారు. ప్రసాదాల తయారీకి నాసిరకం సరుకును పంపినట్టు నిర్ధారించారు. అలాగే, నెయ్యి శాంపిల్‌ను సేకరించి నాచారంలోని స్టేట్ ఫుడ్ లేబొరేటరీకి పంపారు. ఈ నివేదిక ఇంకా రావాల్సి ఉంది.

సరుకుల సరఫరాలో అలక్ష్యం

దుర్గగుడిలోని అన్ని విభాగాల బాధ్యతలను ఏఈవోలకు అప్పగిస్తారు. అందులో భాగంగా ఎస్టాబ్లిష్‌మెంట్, ప్రొవిజన్స్, దుర్గగుడి బాధ్యతలను రమేశ్ పర్యవేక్షిస్తున్నారు. ప్రసాదాల విషయంలో లడ్డూ తయారీని ప్రైవేట్ వ్యక్తికి కాంట్రాక్ట్ ఇచ్చారు. అందుకు అవసరమైన సరుకులను ప్రొవిజన్స్ విభాగం నుంచి అందజేస్తారు. అమ్మవారికి నైవేద్యంగా పెట్టే మిగిలిన ప్రసాదాలను మహామండపంలోని పోటులో తయారు చేస్తారు. దీనికి అవసరమైన సరుకులు కూడా ప్రొవిజన్స్ విభాగం నుంచే సరఫరా అవుతాయి. ఈ సరుకుల సరఫరాకు సంబంధించి ప్రతి ఆరు నెలలకోసారి టెండర్లు పిలుస్తారు. అందులో గ్రేడ్-1 సరుకులను తక్కువ ధరకు సరఫరా చేసే వారిని ఎంపిక చేస్తారు. ప్రస్తుతం టెండరును దక్కించుకున్న మణికంఠ ట్రేడర్స్ కొద్దికాలంగా జీడిపప్పు, కిస్మిస్ ప్యాకెట్లపై ఎలాంటి లేబుల్స్ లేకుండా సరఫరా చేస్తోంది. వాస్తవానికి ఈ సరుకు ప్రొవిజన్స్ విభాగానికి చేరుకోగానే, పరిశీలించి తయారీ తేదీ, ఎంతకాలం నిల్వ ఉంటుంది, ప్యాకెట్ బరువెంత.. అనే వివరాలను స్పష్టంగా ముద్రించిన లేబుళ్లు ఉన్నాయో లేదో పరిశీలించాలి. అలాకాకుండా ఎలాంటి లేబుల్స్ లేకుండా వస్తున్న సరుకులను అధికారులు ప్రొవిజన్స్ విభాగంలో భద్రపరుస్తున్నారు. వాటిని పోటు, లడ్డూ తయారీ కేంద్రాలకు పంపుతున్నారు. ఇటీవల ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీల్లో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దీనిపై అధికారులు సీరియస్‌గా ఉన్నారు. రమేశ్‌ను బాధ్యుడ్ని చేస్తూ ద్వారకాతిరుమలకు డిప్యూటేషన్‌పై బదిలీ చేశారు.

బదిలీ ఉద్యోగులు రిలీవ్

దుర్గగుడిలో పనిచేస్తూ ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో ఇతర ఆలయాలకు బదిలీ అయిన 18 మందిని శనివారం రిలీవ్ చేశారు. దసరా ఉత్సవాల వరకు వీరిని కొనసాగించాలని ఈవో రామారావు చేసిన సూచనను దేవదాయ కమిషనర్ నిరాకరించారు. బదిలీ అయిన ఉద్యోగులను తక్షణమే పంపించేయాలనడంతో రిలీవ్ ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారిలో ఈఈ రమాదేవి పెనుగంచిప్రోలుకు, ఏఈవో వెంకటరెడ్డి అన్నవరానికి, ఏఈ అశోక్, సూపరింటెండెంట్ కేవీడీ ప్రసాద్, డ్రాఫ్ట్‌మెన్ నేతి రామకృష్ణలు ద్వారకా తిరుమలకు బదిలీ అయ్యారు. వీరితో పాటు ముగ్గురు సీనియర్ అసిస్టెంట్లు, తొమ్మిది మంది జూనియర్ అసిస్టెంట్లు పెనుగంచిప్రోలు, ద్వారకా తిరుమల, అన్నవరానికి బదిలీ అయ్యారు.

తిరుమలలో రాజకీయాలు సహించం

» డిక్లరేషన్ ఇచ్చి దర్శనం చేసుకోవడానికి జగన్‌కు ఇబ్బంది ఏంటి?: మంత్రి కొల్లు రవీంద్ర



మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 28: "తిరుమల వేంకటేశ్వరస్వామి సన్నిధిలో రాజకీయాలు సహించం. డిక్లరేషన్ ఇచ్చి వేంకటేశ్వరస్వామిని దర్శనం చేసుకునేందుకు మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డికి వచ్చిన ఇబ్బంది ఏంటి?. ఐదేళ్లపాటు తిరుమలకొండను రాజకీయాలకు అడ్డాగా మార్చుకున్నది చాల్లేదా? తిరుమల పర్యటన పేరుతో డ్రామాలా?.. మళ్లీ ఉద్దేశపూర్వకంగానే పర్య టన ఉపసంహరణా?.. వెంకన్న సన్నిధిలో నాటకాలు ఆడితే ఊరుకునేది లేదు." అని మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు. 12వ డివిజన్‌లో శని వారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొ న్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. అహింస గురించి మాజీ మంత్రి పేర్ని నాని మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఐదేళ్లపాటు గంజాయి బ్యాచ్‌ను వెనకేసుకుని సాగించిన అరాచకాలు మరచిపోయారా అని నిలదీశారు. నియోజకవర్గంలో ఇళ్ల స్థలాల పేరుతో భూదందాలు చేసు కుని మామూళ్లు వసూలు చేశారని మంత్రి ఆరోపించారు.

పేదలందరికీ పక్కా ఇళ్లు



మొవ్వలో మన ఇల్లు-మన గౌరవం కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే కుమార్‌రాజా

కూచిపూడి, సెప్టెంబరు 28: నాకు ఇల్లు లేదని ఏ పేదవాడు అన కుండా అందరికీ పక్కా గృహం ఉండేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారని మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. మొవ్వ క్షేత్రయ్య కల్యాణ మండపంలో శని వారం మన ఇల్లు- మన గౌర వం కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. ప్రతీ పేదవాడికి పక్కా గృహం ఉంటే సమాజంలో గౌరవ స్థానం ఉంటుందన్నారు. గృహనిర్మాణ లబ్ధిదా రులు త్వరితగతిన నిర్మాణాలు చేపట్టాలని, ప్రతి వారం చెల్లింపులు చేస్తా మని మంత్రి తెలిపారు. బిల్లుల చెల్లింపులో అలసత్వం వహించిన అధికారు లపైనా చర్యలు చేపడతామన్నారు. సిమెంట్, ఇనుమును లబ్ధిదారులకు తక్కువ ధరలకు అందిస్తామని తెలిపారు. 100 రోజుల పాలనలో ప్రజల విశ్వాసాన్ని, మన్ననలను అందుకున్నామని తెలిపారు. గతంలో మంజూ రైన రూ.1.80 లక్షల పథకం మార్చి 2025 నాటికి పూర్తవుతుందని, లబ్ధిదా రులు ఫిబ్రవరిలోపే నిర్మాణాలు పూర్తి చేయాలని కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, హౌసింగ్ రాష్ట్ర ఎండీ రాజబాబు, ఆ శాఖ ప్రధాన అధికారి జి.వి.సూర్యనారాయణ, ఎండీవో సుధాప్రవీణ్, తహసీల్దార్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

హింసా రాజకీయాలు చేస్తే.. చూస్తూ ఊరుకోం

కృష్ణాజిల్లా రాజకీయ ఉద్దండులకు పేరెన్నికగన్న జిల్లా అని, వారిని ఆద ర్శంగా తీసుకుని తనలాంటి వారు రాజకీయాలు చేస్తామని సారథి తెలి పారు. అయితే గత వైసీపీ నాయకుల ప్రవర్తన, మాట తీరు చూస్తే ఛీ.. వీళ్లా? మన రాజకీయ నాయకులు అనే భావన ప్రజల్లో ఏర్పడిందన్నారు. హింసా రాజకీయాలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని, వారికి ఏలా బుద్ధి చెప్పాలో తెలుసని ఆయన హెచ్చరించారు.

చేనేతలకు ఆర్థిక భరోసా కల్పిస్తాం

» రాష్ట్రవ్యాప్తంగా ఎగ్జిబిషన్లు, హ్యాండ్లూమ్ బజార్లు నిర్వహిస్తాం: మంత్రి ఎస్.సవిత



చేనేత ఎగ్జిబిషన్‌లో వస్త్రాలను తిలకిస్తున్న మంత్రి ఎస్.సవిత

లబ్బీపేట, సెప్టెంబరు 28: "చేనేత పరిశ్రమ అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రస్తుత మార్పులకు అనుగుణంగా, ట్రెండ్‌కు తగినట్టుగా క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో చేనేత దుస్తుల తయారీలో నూతన డిజైన్లు రూపొందిస్తున్నాం. చేనేతలకు ఆర్థిక భరోసా కల్పించేలా రాష్ట్రవ్యాప్తంగా ఎగ్జిబిషన్లు, హ్యాండ్లూమ్ బజార్లు నిర్వహిస్తాం." అని మంత్రి ఎస్.సవిత తెలిపారు. బందరు రోడ్డులోని పీవీపీ మాల్‌లో ఏర్పాటు చేసిన హ్యాండ్లూమ్ బజార్‌ను శనివారం ఆమె ప్రారంభిం చారు. వస్త్రాల తయారీలో నేచురల్ కలర్స్ వినియోగంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, నేతన్నలు తయారు చేసిన వస్త్రాలకు మార్కెటింగ్ సదుపాయాన్ని ప్రభుత్వం కల్పిస్తోందని మంత్రి తెలిపారు. స్టాల్స్‌ను పరిశీలించి వస్త్రాల డిజైన్లు, అమ్మకాల వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఓ స్టాల్ వద్ద చేనేత చీరను ఆమె కొనుగోలు చేశారు. చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి, క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఏపీ ప్రతినిధులు రంజన, సుజాత పాల్గొన్నారు.

వైసీపీ నేత రేషన్ డిపోలో అక్రమ బియ్యం

» అదనంగా 21 క్వింటాళ్లు గుర్తించిన అధికారులు

» 160 కేజీల పంచదార షార్టేజీ

» డిపో సీజ్..కేసు నమోదు



తనిఖీలు చేస్తున్న అధికారులు

పాయకాపురం, సెప్టెంబరు 28: వైసీపీ నేత, రేషన్‌డిపోల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మండాది వెంకట్రావుకు చెందిన రేషన్ డిపోలో శనివారం పౌరసరఫ రాల అధికారులు తనిఖీలు చేశారు. రేషన్ పంపిణీలో అక్రమాలకు పాల్పడినట్టు గుర్తించి అతని డిపోను సీజ్ చేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో రేషన్‌డిపో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షు డిగా ఉన్న వెంకట్రావుపై అనేక ఆరోపణలు ఉన్నాయి. రేషన్ డిపోల్లో జరిగే అక్రమాలకు అండగా ఉంటూ నగరంలో రేషన్ మాఫియాను నడిపాడని, అధికారులను తన గుపెట్లో పెట్టుకుని పేదలకు అందాల్సిన రేషన్‌ను అక్ర మ మార్గంలో పోర్టులకు తరలించడంలో కీలకపాత్ర పోషించాడని భారీగా అభియోగాలు ఉన్నాయి. అప్పటి వైసీపీ ప్రభుత్వం వెంకట్రావును కాపా డుతూ వచ్చిందని ఆరోపణలున్నాయి. ప్రభుత్వం మారినా వెంకట్రావు పోక డల్లో మార్పు రాలేదు. ఈ నాలుగు నెలలుగానూ అతనిపై ఆరోపణలొస్తూనే ఉన్నాయి. దీంతో శనివారం ఉదయం పౌరసరఫరాల అధికారులు పాయకా పురం రాజీవ్‌నగర్ వడ్డెరకాలనీలో వెంకట్రావుకు చెందిన 118 రేషన్ డిపో లో ఆకస్మిక తనిఖీలు చేశారు. పేదలకు ఇవ్వాల్సిన రేషన్ బియ్యం ఇచ్చి నట్టు రికార్డుల్లో చూపించి అక్రమమార్గంలో తరలించేందుకు సిద్ధం చేసిన 21 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించారు. క్వింటా అరవై కిలోల పంచదా రను కార్డుదారులకు ఇవ్వకుండా అక్రమమార్గంలో తరలించినట్టు తనిఖీల్లో తేలింది. దీంతో వెంకట్రావుకు చెందిన డిపోను సీజ్ చేసిన అధికారులు 6ఏ సెక్షన్ కింద కేసు నమోదు చేశారు.

వైసీపీకి కార్పొరేటర్ నరహరిశెట్టి రోజా రాజీనామా



కార్యకర్తల సమక్షంలో రాజీనామా చేస్తున్నట్టు ప్రకటిస్తున్న రోజా

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 28: వైసీపీకి రాజీనామా చేస్తున్నట్టు 44వ డివిజన్ కార్పొరేటర్ నరహరిశెట్టి రోజా వెల్లడించారు. శనివారం తన కార్యాలయం వద్ద కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆమె ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. డివిజన్ అభివృద్ధి కోసం పలు పర్యాయాలు పేర్ని నానిని ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నిధులు అడిగామని, అయినా ఆయన నిధులు ఇవ్వలేదని తెలిపారు. డివిజన్‌లో ప్రజలు, కార్యక ర్తలు అసంతృప్తితో ఉన్నారన్నారు. పేర్ని నాని డివిజన్ అభివృద్ధికి సహకరిం చకపోవడం వల్ల తాము పార్టీకి రాజీనామా చేస్తున్నామని కార్పొరేటర్ భర్త నరహరిశెట్టి అజయ్ తెలిపారు. 2005లో తన తండ్రి మామిడిబత్తుల వీరా స్వామి టీడీపీలో, 2014లో తన అక్క కాకుళ్ల లీలాకుమారి వైసీపీలో, 2021 లో తన భార్య రోజా వైసీపీలో గెలిచారని, మూడు పర్యాయాలు వార్డు ప్రజలు, కార్యకర్తలతో సంబంధాలున్నాయన్నారు. కార్యకర్తలతో చర్చించి భవిష్య త్తులో ఏ పార్టీలో చేరేది చెబుతామని రోజా చెప్పారు. మరికొందరు వైసీపీ కార్పొరేటర్లు రాజీనామా చేసే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది.



హృదయం.. పదిలం

నేడు వరల్డ్ హార్ట్ డే

వినాయకచవితి ఉత్సవాల్లో డ్యాన్స్ చేస్తూ కుప్పకూలిన యువ కుడు.. దేవర సినిమా చూస్తూ హార్ట్ అటాక్‌తో వ్యక్తి మృతి.. ఇలాంటి వార్తలు విన్నప్పుడో, చదివినప్పుడో, నిత్యం ఆరోగ్యపరీక్షలు చేయించు కుంటూ, వ్యాయామం చేస్తూ ఉన్నవారు కూడా గుండెపోటుకు గురైనప్పుడో 'గుండె జబ్బులను గుర్తించడం' ఎంత సంక్లిష్టమో అవగ తమవుతుంది. హృద్రోగ పరీక్షలు చేయించుకున్న రిపోర్టులను ముగ్గురు కార్డియాలజిస్టులకు చూపిస్తే ఏ ఒక్కరూ ఒకే రకమైన అభిప్రాయాన్ని చెప్పరు. ఉదాహరణకు మూడు రక్తనాళాల్లో బ్లాక్స్ ఉన్నాయని గుర్తిస్తే ఒకరు ఆపరేషన్ చేయాలని, మరొకరు స్టంట్ వేస్తే సరిపోతుందని, మరొకరు మందులు వాడితే సరిపోతుందని చెబు తారు. క్లినికల్ ట్రైల్స్ ఎన్ని జరిగినా ఒక్కోసారి ఒక్కో రకమైన ఫలి తాలు వెలువడుతున్నాయి. ఈ కారణంగానే వైద్యరంగంలో ఒక్కొ క్కరు ఒక్కో నిర్ధారణకు వస్తుంటారు. వీటన్నింటికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా ఎనలిటిక్స్‌తో సమాధానం చెప్పొచ్చు.. ఆదివారం వరల్డ్ హార్ట్ డే సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..

గుండె జబ్బుల గుర్తింపులో ఏఐ, డేటా సైన్స్

» హార్ట్ బ్లాక్స్ విశ్లేషణకు డేటాసైన్స్ తోడ్పాటు

» టెలీ ఐసీయూలోనూ ఏఐ వినియోగం

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

గుండె జబ్బులు రావడానికి, గుర్తింపునకు గల కారణాల విశ్లేషణకు ప్రస్తుతం ఆర్టిఫియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్(ఏఐ, డీఎస్) మీద వైద్యులు ఆధారపడుతున్నారు. ఇంట్రాకరోనరీ ఇమేజింగ్, సీటీ కరొన రసీ యాంజియోగ్రామ్ పరీక్షల ఫలితాలను ఏఐ, డీఎస్ ద్వారా విశ్లేషించి గుండె జబ్బుల నిర్ధారణలో మెరు గైన ఫలితాలు సాధించవచ్చు. ఒక వ్యక్తిలో మూడు రక్తనాళాల్లో బ్లాక్స్ ఉన్నా ఆ వ్యక్తిలో ఎలాంటి సింప్టమ్స్ కనిపించకపోవచ్చు. కానీ అలాంటి వ్యక్తులు ఉన్నట్టుండి గుండెపోటుతో చనిపోయిన సంఘటనలు చాలా ఉన్నాయి. ఎందుకిలా అన్న అంశాన్ని విశ్లేషించేందుకు ఏఐ, డీఎస్‌ను వినియోగించడంతో మరింత లోతైన అంశాలపై వైద్యులకు అవగాహన వచ్చింది. 40 శాతం కొలస్ట్రాల్ బ్లాక్ ఉండి అది రక్తనాళంలో పొడవుగా విస్తరించి ఉంటే అది త్వరగా చిట్లిపోయే ప్రమాదం ఉంది. 80 శాతం బ్లాక్ ఉండి చిన్న ఏరియాలోనే ఉంటే అది త్వరగా చిట్లిపోయే ప్రమాదం లేదు. అయితే కొలస్ట్రాల్ భారీ పరిమాణంలో ఉంటే చిట్లిపోయే ప్రమా దం ఎక్కువగా ఉంటుంది. ఏఐ, డీఎస్ విశ్లేషణ ద్వారా వైద్యులు గుర్తించిన అంశాల్లో ఇది ప్రధానమైది. దీన్నే 'బ్లాక్ బర్డెన్' అంటున్నారు. అలా ఏర్పడిన బ్లాక్‌లో కొలస్ట్రాల్ ఎంత, కాల్షియం ఎంత, అనే అంశం ఆధారంగానూ ప్రమాద తీవ్రతను గుర్తించవచ్చు.

టెలీ ఐసీయూతో 40 శాతం మరణాలకు చెక్

\- ఆస్టర్ రమేశ్ హాస్పిటల్స్ ఎండీ, చీఫ్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పోతినేని రమేశ్ బాబు



టెలీ ఐసీయూ వైద్య విధానం ద్వారా ఐసీయూలో జరిగే మరణాల్లో 40 శాతం నివారించవచ్చు. ఐసీయూలో ఉండే వారిని 24 గంటలూ మానిటర్ చేయడానికి టెలీ ఐసీయూ ఉపయోగపడుతుంది. మన గుండె ఆగిపోయే నాలుగు గంటల ముందు సంకేతాలు పంపుతుంది. హార్ట్ రేట్ ఉన్నట్టుండి 120కి పెరగడం, రెస్పిరేటరీ రేట్ పెరగడం, బీపీ పెరగడం, ఐసీయూలో ఉండే నర్సులు వీటిలో కొన్ని గుర్తించగలరు. కొన్ని గుర్తించలేరు. ఏఐ సహకారంతో ఈ పారామీటర్లను విశ్లేషిస్తూ వీటన్నింటినీ టెలీ ఐసీయూ ద్వారా సెంట్రల్ కమాండ్ కంట్రోల్ రూం నుంచి మానిటర్ చేయవచ్చు.

ఆల్కహాల్ ప్రమాదకరం..

గుండె జబ్బులకు ప్రధాన కారణాల్లో ఆల్కహాల్ ఒకటి. గతంలో లిమిటెడ్‌గా తీసుకున్నా ఏం కాదని వైద్యులు చెప్పేవారు. కానీ ఇప్పుడు పూర్తిగా మానేయమనే చెబుతున్నాం. రక్తనాళాల్లో ఎన్నో బ్లాక్ బాక్సులు ఉన్నాయి. అంటే వైద్యులకూ తెలియని అంశాలు, మైక్రో రక్తనాళాలపై మరిన్ని పరిశోధనలు జరగాల్సి ఉంది. గుండె జబ్బుల నిర్ధారణకు ఎన్నో కొత్త పరీక్షలు అందుబాటులోకి వస్తున్నాయి. వాటిలో ట్రోపోనిన్ ఎంజైమ్ టెస్ట్ వంటివి ఉన్నాయి. కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉన్నప్పుడు మైక్రో రక్తనాళాలకు ఆక్సిజన్ సరఫరా లేక ఆ రక్తనాళాలు డెడ్ అవుతాయి. అప్పుడు వాటి నుంచి ట్రోపోనిన్ ఎంజైమ్ లీకై అది రక్తంలో కలుస్తుంది. రక్తనాళాలు చిట్లిన సమయంలోనూ ట్రోపోనిన్ రక్తంలో కలుస్తుంది. దీన్ని గుర్తించేదే ఈ ట్రోపోనిన్ టెస్ట్. ఇది అందరికీ అవసరం ఉండదు. సాధారణంగా 30 ఏళ్లు దాటిన వారు సీటీ కరోనరీ యాంజియోగ్రామ్ చేయించుకుంటే అందులో ఎలాంటి సమస్య లేదని తేలితే 15 ఏళ్ల వరకు వాళ్లకు గుండె జబ్బులు వచ్చే అవకాశం తక్కువ. ఏ పరీక్ష అయినా వైద్యుల సూచన మేరకు పరీక్షలు చేయించుకోవడం ఉత్తమం.

ఉమ్మడి కృష్ణాలో 32 మంది ఈవోపీఆర్డీల బదిలీ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): పంచాయతీరాజ్ శాఖలో మండల గ్రామ అభివృద్ధి విస్తరణ అధికారుల(ఈవోపీఆర్డీ)ల బదిలీలు జరిగాయి. ఉమ్మడి కృష్ణాజిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న 32 మంది ఈవోపీ ఆర్డీలు శనివారం బదిలీ అయ్యారు. అంతర్గత బదిలీల కారణంగా పలువురు విస్తరణాధి కారులు మండలాలు మారారు.

మండల విస్తరణాధికారి	బదిలీ స్థానం
పి.శైలజాకుమారి	బంటుమిల్లి
వి.రవిశంకరరావు	చల్లపల్లి
జి.కిషోర్	పామర్రు
డి.వెంకటేశ్వరరావు	పమిడిముక్కల
వి.దిలీప్‌కుమార్	ఉంగుటూరు
టి.సరస్వతి	ఎ.కొండూరు
ఐ.విజయలక్ష్మి	చాట్రాయి
బి.ఆనంద్‌బాబు	ఆగిరిపల్లి
బి.సాంబశివరావు	నూజివీడు
ఎ.అరుణకుమారి	అవనిగడ్డ
బి.అశోక్	ముదినేపల్లి
టి.భారతి	గన్నవరం
కె.వెంకటేశ్వరరావు	ఘంటసాల
జి.శ్రీనివాసరావు	గుడివాడ
టి.విజయసారథి	గుడ్లవల్లేరు
ఎ.కిరణ్మయి	కంకిపాడు
కేటీ సుందరి	మోపిదేవి
ఎంఎస్‌కే.పరమాత్మ	మొవ్వ
ఎం.అమీర్‌బాషా	నందివాడ
బి.శ్రీనివాసరావు	పెనమలూరు
పి.వెంకటేశ్వరమ్మ	తోట్లవల్లూరు
ఏఎస్ఆర్ కోటేశ్వరరావు	ఉయ్యూరు
పి.ఏసుబాబు	చందర్లపాడు
కె.శ్రీనివాసరావు	జీ కొండూరు
డి.బాబూరావు	గంపలగూడెం
కె.పద్మావతి	జగ్గయ్యపేట
డి.జయప్రకాష్‌బాబు	మైలవరం
పి.ప్రభాకరరావు	రెడ్డిగూడెం
ఎండీవీ ప్రసాద్	విజయవాడరూరల్
వి.సీతారామరాజు	వీరులపాడు
వీవీఎస్ఆర్కే కొండలరావు	కైకలూరు (ఏలూరు)
కె.లక్ష్మయ్య	బాపులపాడు

విద్యార్థులు మెచ్చేలా మధ్యాహ్న భోజనం

» హాట్ పొంగల్, సాంబార్ బాత్‌ను విద్యార్థులు ఇష్టపడడం లేదు

» వారి ఇష్టాలకు అనుగుణంగా, పోషకాలకు ప్రాధాన్యమిస్తూ కొత్త మెనూను రూపొందిస్తాం: ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన



వర్క్‌షాపులో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

కృష్ణలంక, సెప్టెంబరు 28: "ప్రభుత్వం అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం మెనూను విద్యార్థులు మరింత మెచ్చేలా, ఇష్టపడేలా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. కొత్త మెనూ రూపకల్పనలో పోషకాలతో పాటు వి ద్యార్థుల ఇష్టాఇష్టాలనూ పరిగణనలోకి తీకుంటాం." అని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన తెలిపారు. శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సృజన అధ్వర్యంలో మధ్యాహ్న భోజనం కార్యక్రమంపై వర్క్‌షాపు నిర్వహించారు. ప్రస్తుతం అమలవుతున్న మెనూలో చేయాల్సిన మార్పులపై స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల ఛైర్మన్లు, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, కుక్ కమ్ హెల్పర్ల నుంచి అభిప్రాయాలు తీసుకున్నారు. ప్రస్తుతం అమలవుతున్న మెనూలో హాట్ పొంగల్, సాంబార్ బాత్‌ను ఈ ప్రాంత పిల్ల లు ఇష్టపడటం లేదని గుర్తించినట్లు తెలిపారు. ప్రాంతాల వారీగా ఆహారపు అలవాట్లు, పోషకాలకు, పిల్లల ఇష్టానికి ప్రాధాన్యమిస్తూ, మెనూలో మార్పులు చేసేందుకు ప్రభు త్వం సిద్ధమైందని తెలిపారు. మండల, జిల్లాస్థాయిలో భాగస్వామ్య పక్షాల నుంచి అభిప్రాయాలు తీసుకుని, వీటి ఆధారంగా నివేదికను ప్రభుత్వానికి పంపనున్నట్లు కలె క్టర్ తెలిపారు. డీఈవో యూవీ సుబ్బారావు, ఏడీ (మిడ్ డే మీల్స్) కేవీఎన్ కుమార్, న్యూట్రిషనిస్టు డాక్టర్ సుష్మ పాల్గొన్నారు.

ఈవీఎంల గోడౌన్ తనిఖీ

కృష్ణలంక: గొల్లపూడి మార్కెట్ యార్డులోని ఈవీఎంలను భద్రపరిచిన గోడౌన్‌ను శనివారం రాజకీయపార్టీ ప్రతినిధుల సమక్షంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన తనిఖీ చేశారు. పర్యవేక్షణ రిజిస్టర్లో కలెక్టర్ సంతకం చేశారు. ఎప్పటికప్పుడు ఈవీఎం, వీవీ ప్యాట్ గోడౌన్‌ను క్షుణంగా తనిఖీ చేసి సమగ్ర నివేదికను ఎన్నికల సంఘానికి పంపుతున్నామని తెలిపారు. వి ధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు అప్రమత్తంగా ఉండాలని, సీసీ కెమేరాల పర్యవేక్షణతో గట్టి నిఘా ఉంచాలని సూచించారు. కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ ఎం.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

దుర్గమ్మ దర్శనం సులభంగా అయ్యేలా..

దసరా మహోత్సవాల ఏర్పాట్లు

» దేవదాయ కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ

వన్‌టౌన్, సెప్టెంబరు 28: లక్షలాదిగా వచ్చే భక్తులు మెచ్చేలా, అమ్మవారి దర్శనం సులభంగా అయ్యేలా దసరా మహోత్సవాల ఏర్పాట్లు ఉండాలని దేవదాయ కమి షనర్, ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ అన్నారు. దుర్గామల్లేశర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో జరుగుతున్న దసరా మహోత్సవాల ఏర్పాట్లను ఈవో కేఎస్ రామారావు, దేవదాయ శాఖ చీఫ్ ఇంజనీర్ జీవీఆర్ శేఖర్, ఆర్‌జీవీ ఎస్‌వీఎస్ మూర్తి, స్థానాచార్యుడు శివప్రసాదశర్మ, ఈఈలు కోటేశ్వరరావు, రమాదేవి, వైకుంఠరావు, పలువురు ఇంజనీరింగ్ సిబ్బంది, దేవదాయశాఖ సిబ్బంది, దేవస్థానం సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో శనివారం పరిశీలించారు. క్యూలు, స్నానఘాట్లు, జల్లుస్నానాలు, ప్రసాదాల కౌంటర్లు, టికెట్ల కౌంటర్లు, ఉభయ దాతలకు వాహనాలు, అన్నదానం, ఆలయంలోకి భక్తులు రాకపోకలు సాగించే మార్గాలను పరిశీలించి పలు సూచనలు చేశారు.

నవహారతుల ట్రయల్ రన్..



కృష్ణవేణీ నదికి పూజలు చేస్తున్న దేవదాయ కమిషనర్ సత్యనారాయణ, ఈవో రామారావు

వేద మంత్రాల మధ్య దుర్గమ్మవారికి నవహారతుల ట్రయల్ రన్‌ను దుర్గాఘాట్‌లో నిర్వహించారు. నవహారతుల ట్రయల్ రన్‌ను దేవదాయ కమిషనర్ సత్యనారాయణ, ఈవో రామారావుతో కలిసి వీక్షించారు. తొలుత కృష్ణవేణి నదీమతల్లికి పూజలు నిర్వహించారు. ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేలా కార్యక్రమాలు ఉండాలని ఆయన సూచించారు.

స్వర్ణతాపడానికి విరాళం..

దుర్గగుడి ఆలయ గోపురం స్వర్ణతాపడం నిమిత్తం హైదరాబాద్ జూబ్లీ హిల్స్‌కు చెందిన శివరామరాజు శనివారం ఆలయానికి విచ్చేసి ఈవో కేఎస్ రామరావు ద్వారా రూ. 1,00,116 విరాళాన్ని దేవస్థానానికి అందచేశారు. అమ్మవారి దర్శనం అనంతరం ఆయనకు ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం, ఆశీస్సులు అందజేశారు.

డిప్యూటీ ఈవోగా రత్నరాజు బాధ్యతల స్వీకరణ

దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తూ దుర్గగుడికి బదిలీ అయిన రత్నరాజు శనివారం డిప్యూటీ ఈవోగా బాధ్యతలు స్వీకరించారు. దుర్గమ్మను దర్శించుకున్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

వన్‌టౌన్, సెప్టెంబరు 28: అవుట్ ఏజెన్సీ ప్రాంతంలో ఉంటున్న కే. మహేష్(41) అనుమానాస్పద రీతిలో మృతి చెంది నట్లు భవానీపురం పోలీసు స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. విజయనగరం జిల్లా మక్కువ గ్రామానికి చెందిన మహేష్ జీవనోపాధి కోసం నాలుగేళ్ల క్రితం భార్య, ఇద్దరు కుమారులతో కలిసి అవుట్ ఏజెన్సీలో ఉంటున్నారు. దంపతులు కూలి పను లకు వెళుతుంటారు. పెద్దకుమారుడు ఇంటర్, చిన్న కుమారుడు పదో తరగతి చదువుతున్నారు. ఇటీవల మహేష్ మద్యం తాగి ఇంటికి వచ్చి భార్యతో గొడవ పడుతున్నారు. శుక్రవారం రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చి భార్యా, పిల్లలతో గొడవ పడ్డాడు. అతనిని మందలించారు. మళ్లీ బయటకు వెళ్లి మద్యం తాగి ఇం టికి వచ్చి పడుకున్నాడు, శనివారం ఉదయం పెద్దకుమారుడు తండ్రిని లేపడానికి ప్రయత్నించగా లేవలేదు. లక్ష్మి వచ్చి భర్తను కదలించి చూడగా అపస్మారకంతో ఉండిపోయాడు. స్థానికులు సమాచారం మేరకు వచ్చిన 108 సిబ్బంది అతనిని పరిశీలించి చనిపోయినట్లు నిర్ధారించారు. అతిగా మద్యం తాగడంతో గుండె పోటుతో చనిపోయాడని లక్ష్మి ఫిర్యాదులో పేర్కొంది.

లయోలాలో ఏపీ స్టెమికాన్

పటమట, సెప్టెంబరు 28: ఆంధ్రా లయోలా కళాశా లలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజీలో శనివారం ఏపీ స్టెమికాన్(నేషనల్ లెవెల్ టెక్నికల్ సింపో సియా)ను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ప్రొఫె సర్ పి.ఉమామహేశ్వరి, ఏపీఎస్‌ఈఎంఈ వైస్ చైర్మన్ డాక్టర్ ఎం. కిషోర్‌బాబులు హాజరయ్యారు. ఏపీ స్టెమికాన్‌ను ప్రాముఖ్య తను వివరించారు. పోస్టర్ ప్రజంటేషన్స్, ప్రాజెక్టు ఎక్స్‌పో, టెక్నికల క్విజ్, స్పాట్ ఈవెంట్స్ నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా 513 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.సెక్రటరీ ఫాదర్ జోజిరెడ్డి, ఫాదర్ డి.బాలస్వామి, జాన్ రెక్టార్‌లు పాల్గొన్నారు.

ఐటీఐలో నాలుగో విడత కౌన్సెలింగ్ పూర్తి

భారతీనగర్, సెప్టెంబరు 28: జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేట్ ఐటీఐలలో 2024-25 విద్యాసంవత్సరానికి 4వ విడత కౌన్సెలింగ్ శనివారం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో జరిగింది. 55 మంది విద్యార్థులకు 36 మంది హాజరయ్యారు. 35 మం దికి వివిధ ట్రేడ్‌లలో అడ్మిషన్లు కేటాయించారు. ఇప్పటి వరకు నిర్వహించిన నాలుగు కౌన్సెలింగ్‌ల్లో 716 సీట్లకు 684 సీట్లు (95 శాతం) భర్తీ అయ్యాయని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ ప్రిన్సిపల్, జిల్లా కన్వీనర్ ఎం.కనకారావు తెలిపారు.

పీఏసీఎస్‌ల బలోపేతంతో రైతుల ఆర్థికాభివృద్ధి

» కేడీసీసీ బ్యాంక్ సీఈవో శ్యామ్‌మనోహర్

హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 28: పీఏసీఎస్‌లను బలో పేతం చేస్తూ రైతుల ఆర్థికాభివృద్ధికి అభివృ ద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కేడీసీసీ బ్యాంక్ సీఈవో శ్యామ్‌మనోహర్ తెలిపారు. వేలేరులోని చెన్నకేశవ విశాల సహకార సంఘం ఆవరణలో శనివారం నిర్వహించిన మహాజనసభలో కేడీసీసీ ఇన్ చార్జి హరినాథ్‌బాబుతో కలిసి ఆయన పాల్గొన్నారు. అనుమతులు లేకుండా సాగునీటి చెరువు(చిన్నమల్లమ్మ కుంట)లో రూ.40లక్షల వ్యయంతో గోడౌన్ నిర్మించడంపై రైతులు అభ్యంతరం తెలిపారు. సహకార సంఘానికి ఇన్ కంట్యాక్స్ పేరుతో రూ.67లక్షలు కట్టించారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనాటి ప్రభుత్వ నిర్ణయం ప్రకారమే గోడౌన్ నిర్మించారని ఇన్‌చార్జి హరినాథ్‌బాబు తెలిపారు. సంఘ సభ్యులకు తెలియకుండా నిర్మాణ చెల్లిం పులు చేయబోమని సీఈవో శ్యామ్‌మనోహర్ హామీ ఇచ్చారు. రూ.67 లక్షలను తిరిగి తీసుకొచ్చేందుకు కృషి చేస్తామన్నారు. గోడౌన్‌కు చెల్లింపులు జర క్కుండా అవిర్నేని భవానీశంకర్ హైకోర్టు ద్వారా నిలుపుదల చేయడం అభినందనీయమని రైతు నాయకుడు వేములపల్లి శ్రీనివాసరావు అన్నారు.



కొనకళ్లనారాయణరావు, పిల్లి మాణిక్యాలరావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, కూటమి నేతలు

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో

కూటమి అభ్యర్థి విజయమే ధ్యేయం

» గెలుపుకోసం ప్రణాళికాబద్ధంగా పనిచేయండి

» టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులకు కొనకళ్ల నారాయణ, పిల్లి మాణిక్యాలరావు పిలుపు

అవనిగడ్డ, సెప్టెంబరు 28: రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి విజయమే ధ్యేయంగా, ప్రణాళికాబద్ధంగా పని చేయాలని టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులకు ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారా యణరావు, లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యాలరావు పిలుపునిచ్చారు. శని వారం గాంధీక్షేత్రంలో ఓటర్ల నమోదు, ప్రాధాన్య క్రమంలో ఓట్లు వేసి కూటమి అభ్యర్థిని గెలిపించుకోవటంపై ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు. టీడీపీ తరఫున ఆలపాటి రాజేంద్రప్రసాద్ పోటీ చేసే అవకాశాలు ఉన్నాయని, ఆయనను గెలిపిం చాలని కొనకళ్ల పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓ రౌడీషీటర్‌ను వైసీపీ బరిలో నిలుపుతోందని, దీనిని గ్రాడ్యుయేట్లు గమనించి విద్యావంతుడైన ఆలపాటిని గెలిపించాలని మాణిక్యాలరావు కోరారు. కొనకళ్ల నారాయణరావు ఆర్టీసీ చైర్మన్‌గానూ, పిల్లి మాణిక్యాలరావు లిడ్‌క్యాప్ చైర్మన్‌గా నియమించ టంపై మండలి బుద్ధప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు, జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మత్తి వెంకటేశ్వరరావు, మండలి వెంకట్రామ్, టీడీపీ, జనసేన నేతలు కొల్లూరి వెంకటేశ్వరరావు, మెండు లక్ష్మణరావు, నడకుదుటి జనార్ధనరావు, మండవ బాలవర్థిరావు, టీవీ గిరి, తలశిల స్వర్ణలత, సునీత పాల్గొన్నారు.

విజయవాడ ఆర్డీవోగా కె.చైతన్య బాధ్యతల స్వీకరణ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయావాడ ఆర్డీవోగా కె.చైతన్య శని వారం శనివారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. నూతన ఆర్డీవోకు సబ్‌కలెక్టరేట్ ఏవో హేమకుమారి, విజయవాడ సెంట్రల్ తహసీల్దార్ సూర్యారావు, సబ్‌కలెక్టరేట్ సిబ్బంది సాదర స్వాగతం పలికారు. చింతూరు రెవెన్యూ డివిజినల్ అధికారిగా పనిచేసిన చైతన్యను ఎన్టీఆర్ జిల్లాలో అత్యంత కీలకమైన విజయవాడ డివిజన్‌కు బదిలీ చేశారు.

ఏపీఐఐసీ జడ్ఎంగా కె.బాలాజీ

ఏపీఐఐసీ విజయవాడ జోనల్ మేనేజర్‌గా కె.బాలాజీ బాధ్యతలు స్వీకరించారు. వచ్చీ రాగానే మల్లవల్లి మోడల్ ఇండస్ట్రియల్ పార్క్, మెగా ఫుడ్ పార్క్‌లను ఆయన పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు మల్లవల్లి, గన్నవరం ప్రాంతంలో ఉండటంతో త్వరగా అవగాహ న ఏర్పాటు చేసుకోవటానికి క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్నానని తెలిపారు.

కేజీబీవీల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తులు

కృష్ణలంక, సెప్టెంబరు 28: ఎన్టీఆర్ జిల్లాలోని కస్తూరిబా గాంధీ వి ద్యాలయాల్లో(కేజీబీవీ) ఖాళీ బోధనా సిబ్బంది పోస్టుల భర్తీకి అర్హత గల మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్ట్ సమన్వయకర్త జి.మహేశ్వరరావు శనివారం ఓ ప్రకట నలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరంలో పార్ట్ టైం ఉపాధ్యాయులు రెండు, అకౌంటెంట్ ఒకటి పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఓపెన్ కేటగిరిలో 18-42 ఏళ్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీలకు ఐదేళ్లు, మాజీ సైనికులకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు వయో పరిమితి సడలింపు ఉన్నట్లు పేర్కొన్నారు. అక్టోబరు 10 లోగా ఏపీకేజీబీవీ. ఏపీసీ ఎఫ్ఎస్ఎస్.ఇన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సూరపనేని సంక్షేమ సంఘం వితరణ

ఆటోనగర్, సెప్టెంబరు 28: ఆటోనగర్ ఎగ్జిబిషన్ సొసైటీ హాల్‌లో సూరపనేని వారి సంక్షేమ సంఘం 25వ ఆత్మీయ సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షుడు సూరపనేని వెంకట కృష్ణా రావు మాట్లాడుతూ ఈ ఏడాది సంఘం తరుపున 11 మంది విద్యార్థులకు ఉన్నత చదువుల నిమిత్తం రూ. 2,98,000లు ఆర్థిక సాయంగా చెక్కులు అందజేసినట్లు వెల్లడించారు. అనంతరం సంఘానికి సేవలు అందిస్తున్న సూరపనేని వెంకట కృష్ణారావు, చంద్రశేఖర్, వెంకట సత్యనారాయణ, రవీంద్ర ఠాగూర్, రామకృష్ణారావు, రాఘవేంద్రరావు, రామకృష్ణ ప్రసాద్, సత్యనారాయణ ప్రసాద్‌ల దంపతులను సూరపనేని కురు వృద్ధుల పేరుతో సన్మానించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 535

వంద కుట్టుమిషన్‌లు అందజేత



పాయకాపురం, సెప్టెంబరు 28 : స్థానిక 58వ డివిజన్, ఆంధ్రప్రభ కాలనీలోని కమ్యూనిటీ హాలులో శనివారం ఏపీ స్మార్ట్ ఆంధ్ర ఫౌండేషన్ సౌజన్యంతో విజయవాడ నగరపాలకసంస్థ ఆధ్వర్యంలో వరద బాధిత మహిళల జీవనోపాధి నిమిత్తం వంద కుట్టు మిషన్‌లు అందజేత కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మహిళలకు కుట్టు మిషన్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బస్టేషన్‌లో స్వచ్ఛతా హీ సేవ



ఆర్టీసీ బస్టేషన్‌లో స్వచ్ఛతా హీ సేవ ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది

బస్టేషన్, సెప్టెంబరు 28: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాల నేపథ్యంలో శనివారం పండిట్ నెహ్రూ బస్టేషన్ ఎరైవల్ బ్లాక్ ఓపెన్ యార్డ్‌లో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ ఎన్. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పరిశుభ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉద్యోగులు, స్వీపర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు ప్రతిజ్ఞ చేయించారు. వచ్చే నెల 2 వ తేదీ వరకు జరగనున్న స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో ప్రతిరోజూ గంటపాటు ఉద్యోగులు, అధికారులు, కార్మికులు అందరూ పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు. **పటమట:** 11వ డివిజన్ పటమట రెల్లీస్ కాలనీలో గోడలపైన వాల్ పెయింటింగ్స్ వేస్తూ ఆ గోడను ప్రజల భాగ స్వామ్యం తో అందంగా మార్చారు. ప్రజలకు స్వచ్ఛతా హీ సేవ పై అవగాహన కల్పిస్తూ వీఎంసీ కార్యక్రమాలను చేపట్టింది.

పోటీతత్వం అలవరుచుకోవాలి

● ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



విద్యార్థికి బహుమతి ప్రదానం చేస్తున్న గద్దె

మొగల్రాజపురం, సెప్టెంబరు 28: పోటీతత్వం పెరగాలంటే విద్యార్థులు, యువత క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనాలని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పిలుపు ఇచ్చారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పీబీ సిద్దార్థ ఆడిటోరియంలో దసరా వేడుకల ముగింపు కార్యక్రమం శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ దసరా, సంక్రాంతి పండుగ దినాల్లో విద్యార్థులకు సెలవులు ఎక్కువగా వస్తాయని, ఆ సమయంలో చెడు మార్గంలోకి వెళ్లకుండా సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనాలని చెప్పారు. సీఎం చంద్రబాబు కూడా యువతలో నైపుణ్యాలను వెలికి తీసేందుకు అనేక చర్యలు తీసుకుంటున్నారని వాటి గురించి వివరించారు. విద్యార్థులు, యువత కూడా శ్రద్ధగా చదువుకుని సమయం వృధా చేయకుండా మంచి కెరీర్ ఎంచుకుని రాష్ట్రానికి, తల్లిదండ్రులకు పేరు తేవాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో విజయలక్ష్మి, కల్పనా, జ్యోత్స్న, రావి శారద, పి.మురళీ కృష్ణ, జి. వాణి, పాల్గొన్నారు.

భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తి ఆదర్శం



అజిత్‌సింగ్‌నగర్, సెప్టెంబరు 28 : భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శమని సీపీఐ నగర కార్యదర్శి కేవీ భాస్కరరావు అన్నారు. 58వ డివిజన్‌లో భగత్‌సింగ్ జయంతి కార్యక్రమం శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన ముందుగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు. ● 59వ డివిజన్‌లోని ఎంకే బేగ్ నగరపాలక సంస్థ పాఠశాలలో యునైటెడ్ ఎన్జీవో అసోషియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ గవర్నర్ హజరత్తయ్య గుప్తా పాల్గొని భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు.

పాయకాపురం: వాంబేకాలనీలో జరిగిన కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి లంకా గోవిందరాజులు భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

భవానీపురం: సితార సమీపంలోని జనసేన సీనియర్ నాయకురాలు తిరుపతి అనూష కార్యాలయంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

రజీ మసీదు వద్ద అన్నదానం

భవానీపురం, సెప్టెంబరు 28: మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో భాగంగా 41వ డివిజన్‌లో రజీ మసీదు వద్ద మసీదు కమిటీ ఆధ్వర్యంలో శనివారం భారీ అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఎండీ ఇర్ఫాన్, మొహమ్మద్ అల్తాఫ్ రజా, అబ్బారుజ్జమా, నసీమ్ అక్తర్, అబ్దుల్ ముస్తఫాలు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. కోల్‌కత్తా నుంచి వచ్చిన మత గురువులు ముఫ్తీ సాబిర్ రజా ముహిబ్బుల్ ఖాదరీ సాహెబ్ మిలాద్ ఉన్ నబీ వేడుక సారాంశాన్ని వివరించారు. బడేఖాన్, రెహమాన్, ఇషాక్‌లు పాల్గొన్నారు.

వరద బాధితులకు భోజనం ఏర్పాటు

పాయకాపురం, సెప్టెంబరు 28 : సీపీఎం ఆధ్వర్యంలో వరద బాధితులకు శనివారం భోజనం ఏర్పాట్లు చేశారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని డాబాకొట్లు, పాయకాపురం పరిధిలోని ఎల్‌బీఎస్‌నగర్‌లో ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమాల్లో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు పాల్గొని వరద బాధితులకు భోజనం అందజేశారు. ఈ కార్యక్రమంలో నేతలు కె. దుర్గారావు పాల్గొన్నారు.

నిత్యావసర కిట్ల పంపిణీ

భవానీపురం, సెప్టెంబరు 28 : ధ్వని ఫౌండేషన్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో 43వ డివిజన్ ఊర్మిళానగర్‌లోని 500 మందికి నిత్యావసరాలు, వివిధ వస్త్రాలతో కూడిన కిట్ల పంపిణీ జరిగింది. శనివారం పోలేరమ్మగుడి సమీపంలోని ఒక ఫంక్షన్ హాల్లో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన టీడీపీ సీనియర్ నాయకుడు బొమ్మసాని సుబ్బారావు పేదలకు కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మోరబోయిన రాంబాబు, తాటి శ్రీకాంత్, కాకర్ల కోటి, వెంకట్రావు, బీజేపీ మండలి అధ్యక్షుడు పగడాల కృష్ణ, బీజేపీ, జనసేన డివిజన్ అధ్యక్షులు విశ్వేశ్వరరావు, కోటి, పూజల శ్రీనివాస్, యువరాజ్‌లు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు అయిన బట్టు సుధాకర్, తండ్రి లేటు యల్లాచారి, డోరు నెం.57-12-3, న్యూ పి అండ్ టి కాలనీ, పటమట, విజయవాడ వారు ఇచ్చిన భోగట్టాపై నేను బహిరంగ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా, నా క్లయింటు డాక్యుమెంట్ నెం 1533/2010 ద్వారా ది.22-04-2010లో కంకిపాడు రిజిష్ట్రారు వారి ఆఫీసులో తన కుమార్తె అయిన బట్టు లక్ష్మిప్రియకు రిజిస్ట్రేషన్ చేసిన ఆస్తి తాలూకు డాక్యుమెంట్లను ది. 20.09.2024వ తేదిన బెంజిసర్కిల్ నుండి కంకిపాడు మధ్య బండిపై వెళుచుండగా కంకిపాడు సబ్‌రిజిష్ట్రరు వారి ఆఫీసులో రిజిష్టరు కాబడిన డాక్యుమెంటు నెం. 1533/2010కు లింకు డాక్యుమెంటు అయిన డాక్యుమెంట్ నెం.858/1974 తేది.25-07-1974 ఒరిజినల్ పోయినది. అన్ని చోట్ల వెతికినా ఎక్కడా కనబడక పోవుట వలన ఈ ప్రకటన ఇవ్వడమైనది. కాగా సదరు ఆస్తిపై నా క్లయింటు కుమార్తెకు ఎటువంటి అభ్యంతరములు తీర్మానములు బాకీలు లేవు. ఈ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా, సదరు రిజిష్ట్రరు దస్తావేజు ఎవరికైననూ దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు ఏడు (7) దినములలోగా ఇవ్వగలరు. అట్లు కాని యెడల సదరు ఆస్తి మీద ఎటువంటి అక్షేపణలు ఎవరికీ లేవని నమ్మగలము.

PARASA ARUN KUMAR, Advocate
D.No/ 32-13-14, Opp. Bondiladoddi,
Mogalrajapuram, VIJAYAWADA-10.
Cell : 99632 39932

ప్రకటన

మా క్లయింటు విజయవాడ విజయలక్ష్మి కాలనీ, నియర్ భారతీనగర్, డోరు నెం. 54-1-9ఎ, FF1, నారాయణాద్రి క్లాసిక్, విజయవాడ కాపురస్తులు, యర్రమళ్ళ నారాయణరావు గారి కుమారుడు Y.V.S.S.M. గుప్తా సంజాయిషీ పొంది తెలియజేయునది మా క్లయింటు మేండవ శంకరరావు గారి కుమారుడు : మండవ కోటేశ్వరరావు గారి నివాసము డోరు.నెం. 56-4-18, సాయి సరస్వతీ టవర్స్ SF-2, Y.V రావు వీధి, పటమట, విజయవాడ (అర్బన్), వెంకటేశ్వర పురం, కృష్ణా, ఆంధ్రప్రదేశ్-520010, వద్ద నుండి ఈ దిగువ షెడ్యూలు దాఖలాస్తిని కొనుగోలు చేయుటకు అంగీకరించి కొంత బయానా ఇచ్చగా విక్రయ ఒప్పంద ఖరారు పొందియున్నారనియు, కావున సదరు ఆస్తిపై ఎవరికైననూ ఏవిధమైన అభ్యంతరములు కాని, చెల్లదగు క్రయములు కాని, కోర్టు ఎటాచ్‌మెంట్లు కాని, తనఖాలు కానీ, హామీలు కానీ, మొదలుగా గల అభ్యంతరములు ఏమైనా ఉన్న యెడల ఈ ప్రకటన వెలువడిన తేదీ నుండి పది రోజుల లోపు తిరుగు టపా రసీదుతో నాకు మాత్రము తెలియపరచవలెను. లేనిచో సదరు షెడ్యూలాస్తి నిర్వివాదంశమైనదిగా భావించి మా క్లయింటు సక్రమమైన రిజిస్ట్రేషను చేయించు కొనగలరనియూ, దరిమిలా వచ్చే ఎటువంటి అభ్యంతరములు, క్రయములు, మా క్లయింటును బెండు చేయజాలవనియు ఇందుమూలముగా యావన్మందికీ తెలియజేయటమైనది.

షెడ్యూలు : విజయవాడ, మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా పటమట గ్రామం తాలూకు ఆర్ సర్వే నెంబరు 170రు రెవెన్యూ వార్డు నెం.11, బ్లాకు నెం.4, వార్డు నెం. 32 F, సమీప డోరు నెం. 56-4-18/ఆర్, అసెస్‌మెంట్ నెం. 35946 అర్ దాఖలా యార్లగడ్డ వారి వీధిలోని సాయి సరస్వతి టవర్స్ అపార్ట్‌మెంటు నందు గల ప్లాటు SF-2, 2nd Floor మండవ కోటేశ్వరరావు గారి ఆస్తి.

Koonala Mani Kumar, B.Com, LL.B
Advocate
D.No. 1-3/23-11/1, 1st Floor,
Chandolluvari Street, Cement Road,
Vidhyadharapuram, Vijayawada-12
Cell : 93913 40034

సెలవు దినాలకు వేతనం ఇవ్వాలి

చిట్టినగర్: వరదల కారణంగా సర్వం కోల్పోయి విధులకు హాజరుకాని మున్సిపల్ కార్మికులకు 12 రోజుల సెలవు దినాలకు సంబంధించిన వేతనం అందజేయాలని సీపీఎం నగర కార్యదర్శి దోనేపూడి కాశీనాథ్ కోరారు. కమిషనర్ ధ్యానచంద్రను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. అప్కాస్, పారిశుధ్యం, వాటర్ వర్క్స్, డ్రెయినేజీ, వీధి దీపాల విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులు సర్వం కోల్పోయారని చెప్పారు. వారికి సెలవు రోజులకు సంబంధించిన వేతనంతోపాటు రెండు, మూడు నెలల జీతాన్ని బోనస్‌గా ఇవ్వాలని కోరారు. 45 మంది కార్మికులకు ఇచ్చిన షోకాజ్ నోటీసులను ఉపసంహరించుకోవాలన్నారు.

నోట్‌బుక్స్ పంపిణీ

విద్యాధరపురం: వరద బాధిత ప్రాంత విద్యార్థులకు పులిపాటి వెంకటేశ్వరరావు శ్రీకృష్ణ సేవా సమితి నోట్ పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేసింది. విద్యాధరపురంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 600 మందికి, 3000 నోట్ పుస్తకాలను అందచేసినట్లు నిర్వాహకుడు పులిపాటి వంశీకృష్ణ తెలిపారు. శనివారం దళవాయి సుబ్బరామయ్య కార్పొరేషన్ హైస్కూలులో నోట్ పుస్తకాల పంపిణీని ప్రారంభించారు.


LYCA PRODUCTIONS
SRI LAKSHMI MOVIES
OCT. 10
WORLDWIDE RELEASE
SUBASKARAN PRESENTS
SUPERSTAR RAJINIKANTH
వేట్టయన్
ద హంటర్
WRITTEN & DIRECTED BY T. J. GNANAVEL
AN ANIRUDH MUSICAL
PRODUCED BY SUBASKARAN
TAMIL TELUGU HINDI KANNADA


people MEDIA FACTORY
CHITRALAYAM
GOPICHAND
A SREENU VAITLA FILM
OCT 11TH
IN CINEMAS WORLDWIDE
విశ్వం
TG VISHWA PRASAD
VENU DONEPUDI
TELUGU


CULT CONCEPTS
From The Director of
మంత్ర మంగళ
'OSHO' THULASIRAM'S
దక్షిణ
OCTOBER 4TH RELEASE
PRODUCER :
ASHOK SHINDE


PHOENIX GAGA
JOKER FOLIE À DEUX
THE WORLD IS A STAGE
OCTOBER 2nd
WEDNESDAY RELEASE
FILMED FOR IMAX
WARNER BROS. PICTURES RELEASE THROUGH NVR CINEMA - 9966963111


BGM STUDIO
దసరా నవరాత్రుల శుభాకాంక్షలతో
ADITYA MUSIC
OCTOBER 3RD
WORLDWIDE RELEASE
IN THEATRES
చిట్టి పొట్టి
Story, Screenplay, Producer & Director
BHASKAR YADAV DASARI
Music SRI VENKAT Editor BALAKRISHNA BOYA DOP MALHARBHAT JOSHI
Choreography KAPIL Stunts STAR MALLI PRO LAXMI NIVAS


NANDAMURI TARAKA RAMARAO ARTS
Yuvasudha ARTS
MASSIVE BLOCKBUSTER
MAN OF MASSES NTR
DEVARA
PART 1
KORATALA SIVA
AN ANIRUDH MUSICAL
IN CINEMAS NOW


BLOCKBUSTER HIT
ASIAN SURESH
2D ENTERTAINMENT
KARTHI ARVIND SWAMI
సత్యం సుందరం
WRITTEN & DIRECTED BY C. PREMKUMAR
PRODUCED BY JYOTIKA · SURIYA
Co Produced by Rajsekar Karpoorasundarapandian
IN CINEMAS NOW

ఆదివారం

సెలబ్ టాక్





హిట్టయినా.. ఫ్లాపయినా.. కష్టం ఒక్కటే

బాలీవుడ్‌లో ఇప్పుడు ప్రతిఒక్కరి నోట వినిపిస్తున్న పేరు... శ్రద్ధా కపూర్. అందుకు కారణం... ఆమె నటించిన బ్లాక్‌బస్టర్... 'స్త్రీ-2'. ఈ చిత్రం వసూళ్లు వందల కోట్లు దాటేసింది. ఓటీటీలోనూ దుమ్ము రేపుతోంది. ఇది శ్రద్ధానే కాదు... పరిశ్రమ కూడా ఊహించని ఘన విజయం. ప్రభాస్ 'సాహో'తో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన ఈ బ్యూటీ... ఇప్పుడు దర్శకనిర్మాతల హాట్ ఫేవరెట్.

హిందీ పరిశ్రమలో విలన్‌గా దశాబ్దాలు ఏలిన శక్తికపూర్ తనయగా సినీ రంగ ప్రవేశం చేసినా... ఆమె కెరీర్ పూల పాన్పు కాలేదు. నాన్న పేరుతో బాలీవుడ్‌లో ఎంట్రీ దొరికినా.. ఆ తరువాత నిలదొక్కుకోవడానికి ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొంది. వరుస అపజయాలతో ఆరంభంలో తడబడినా... నటిగా మాత్రం మంచి గుర్తింపు తెచ్చుకుంది. పద్నాలుగేళ్ల కిందట విడుదలైన 'తీన్ పత్తి' ఆమెకు తొలి చిత్రం. ఆ తరువాత 'ఆషికీ2, భాగీ, స్త్రీ, సాహో' తదితర హిట్స్‌తో స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది.

'ఫోర్బ్స్ ఇండియా' మ్యాగజైన్ 'టాప్ 100 సెలబ్రిటీ'ల జాబితాలో, అలాగే '30 అండర్ 30'లో చోటు దక్కించుకుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో అత్యధిక ఫాలోవర్స్ (9.3 కోట్లు) ఉన్న భారత నటుల్లో ఒకరుగా వెలుగుతోంది. ఎన్నో బ్రాండ్స్‌కు ప్రచారకర్తగా వ్యవహరిస్తోంది. ఇవన్నీ రాత్రికి రాత్రి సాధించిన విజయాలు కాదు. అపజయం ఎదురైన ప్రతిసారీ... మరింత పట్టుదలగా ప్రయత్నించింది. తన సామర్థ్యం ఏవిటో తనకు తెలుసుకుని... దానికి తగిన పాత్రలు ఎంపిక చేసుకొంటూ అడుగులు వేసింది.

అమ్మ వైపు... నాన్న వైపు.. నటులు, సినీ పరిశ్రమతో అనుబంధం ఉన్న వ్యక్తులే. కానీ ప్రతిభ లేకపోతే రాణించడం కష్టం. దీన్ని గ్రహించిన శ్రద్ధ.. అవకాశం లభించిన ప్రతిసారీ తనను తాను నిరూపించుకొంటూ వచ్చింది. పాత్రకు అనుగుణంగా తన లుక్స్‌ను మార్చుకోవడానికి ఆమె ఎప్పుడూ ముందుంటుంది. అందుకు గత ఏడాది విడుదలై మంచి కలెక్షన్లు సాధించిన 'తు ఝూఠీ మై మక్కర్' ఒక ఉదాహరణ. అందులో కథ కంటే శ్రద్ధా కపూర్ ధరించిన బికినీల గురించే ఎక్కువ చర్చ జరిగింది. బీచుల్లో రణబీర్ కపూర్‌తో ఆమె పండించిన సన్నివేశాలు 'హాట్' టాపిక్ అప్పుడు. మరే తారకూ కుదరనంతగా శ్రద్ధకు బికినీలు కుదిరాయనేది డిజైనర్ల మాట. 'ఆ చిత్రంలో రణబీర్‌కు, నాకు మధ్య సన్నివేశాలు అధిక భాగం సముద్ర తీరాల్లోనే ఉంటాయని దర్శకుడు ముందే చెప్పారు. బీచ్ డ్రెస్సుల్లో అందంగా కనిపించాలంటే శరీరాకృతిని దానికి తగ్గట్టు మలుచుకోవాలి. అందు కోసం జిమ్‌లో ఎంతో శ్రమించాను. షూటింగ్ జరిగినన్ని రోజులూ ఉదయం ఐదున్నరకల్లా వర్కవుట్స్ ముగించేదాన్ని' అంటూ ఓ సందర్భంలో చెప్పింది శ్రద్ధ.

'స్త్రీ-2'తో 'తార'స్థాయికి...

గత నెలలో విడుదలైన కామెడీ హర్రర్ చిత్రం 'స్త్రీ-2' శ్రద్ధ స్టార్డమ్‌ను అమాంతం పెంచేసింది. బాలీవుడ్‌లో ఆమె స్థానాన్ని 'తార'స్థాయికి తీసుకువెళ్లింది. ఆమె పేరు ప్రతి ఇంటికీ పరిచయమైంది. ఇలాంటి విజయం ప్రతి నటుడి కల. అయితే ఆమెకు ఈ తరహా అనుభవం పూర్తిగా కొత్తేమీ కాదు. కాకపోతే హిందీలో అత్యధిక పారితోషికం తీసుకొంటున్న కథానాయికల్లో ఒకరుగా ఎదిగిన శ్రద్ధకు ఈ చిత్రం కెరీర్‌లో అతి పెద్ద మలుపు. ఇదే విషయం ఆమె వద్ద ప్రస్తావిస్తే... 'మా నాన్న వారసత్వం, సినిమా పట్ల నాకున్న గాఢమైన ప్రేమతో సాగుతున్న ప్రయాణంలో భాగం ఈ విజయం. నా కెరీర్‌లో మరో మెట్టు ఎక్కినట్టుగా దీన్ని భావిస్తున్నాను. ఇకపై కూడా చేసే పని అర్థవంతంగా ఉండేలా చూసుకొంటూ, గొప్ప చిత్రాల్లో భాగం కావాలని కోరుకొంటున్నాను. ప్రస్తుతానికి నా దృష్టి దానిపైనే' అంటూ చెప్పుకొచ్చింది.

నాన్నను చూసి...

సినీ కుటుంబంలో పుట్టిన శ్రద్ధకు షూటింగ్‌లు, సెట్లు, కెమెరాలు కొత్తేమీ కాదు. నటి కావాలన్నది ఆమె చిన్ననాటి కల. 'నాన్న రోజూ షూటింగ్ నుంచి రకరకాల డ్రెస్సుల్లో, వేషాల్లో ఇంటికి వచ్చేవారు. నేను సెట్స్‌కు వెళ్లినప్పుడు నటనలో ఆయన హావభావాలు, ఒక పాత్ర నుంచి మరో పాత్రలోకి పరకాయ ప్రవేశం చేసే తీరు చూసి ఎంతో ఉత్సుకతకు లోనయ్యేదాన్ని. అదంతా నాకొక మాయాజాలంలా అనిపించేది. కొన్నాళ్లకు అర్థమైంది... నా మనసు కూడా అదే కోరుకొంటోందని' అని ఓ ఇంటర్వ్యూలో తన చిన్ననాటి రోజులు గుర్తు చేసుకుంది శ్రద్ధ.

ప్రేమ మరువలేనిది...

'ఆషికీ2'తో నవతరం 'ప్రియ' నాయికగా మన్ననలు అందుకొంటున్న ఆమె... 'స్త్రీ2'తో 37 ఏళ్ల వయసులో కెరీర్ బెస్ట్ విజయాన్ని చవిచూసింది. 2018లో విడుదలైన 'స్త్రీ'కి సీక్వెల్‌గా వచ్చిన ఈ చిత్రం... బాక్సాఫీసుల వద్ద కనక వర్షం కురిపించింది. ప్రపంచవ్యాప్తంగా కలెక్షన్లు దాదాపు ఎనిమిది వందల కోట్ల రూపాయలని ఓ అంచనా. బడా హీరోల రికార్డులను బద్దలు కొట్టింది. ఈ ఏడాదిలో బాలీవుడ్ బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఇందులో శ్రద్ధ మంత్రగత్తెగా నటించింది. 'అద్భుతమైన చిత్రంలో భాగమైనందుకు చాలా సంతోషంగా ఉంది. ప్రేక్షకులు నాపై కురిపించిన ప్రేమ మరువలేనిది. నా నటనతో వాళ్లందరినీ అంతగా అలరించినందుకు గర్వంగా అనిపిస్తోంది' అంటుంది ఈ భామ.

అదే నిజమైన విజయం...

శ్రద్ధ కెరీర్‌లో ఎన్నో ఎత్తుపల్లాలు... ఆటుపోట్లు. వేటికీ కుంగిపోలేదు. తన మార్గాన్ని తనే నిర్మించుకుంది. హిట్ సినిమా అయినా... ఫ్లాప్ అయినా... పడే కష్టం ఒకటేనంటుంది. 'నా దృష్టిలో విజయం అనేది రుచికరమైన భోజనం ఆస్వాదించడం లాంటిది. నా కుటుంబంతో, మనసుకు దగ్గరైన సన్నిహితులతో మధుర క్షణాలను పంచుకోవడం. నిజమైన విజయం అంటే నన్ను ప్రేమించేవారు నా చుట్టు ఉండడం. కంటి నిండా నిద్రపోవడం. చేసే పనిలో అభివృద్ధి సాధించడం. జీవితాన్ని సమతుల్యం చేసుకోవడం. అన్నిటికీ మించి ప్రశాంతంగా జీవించడం. ఇప్పటికీ మా నాన్న శ్రమిస్తున్నారు. ఆయన గురించి తెలుసుకొంటుంటే... కష్టపడకుండా ఏదీ ఆశించకూడదనేది నాకు బోధ పడింది. ఇలాంటివన్నీ నాకు ఎంతో ప్రేరణనిస్తాయి. విజయ గర్వం నా తలకు ఎక్కకుండా దోహదపడతాయి'.. అంటున్న శ్రద్ధా కపూర్ సినిమాలతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలకు కూడా సహకారం అందిస్తోంది. జంతు ప్రేమికురాలు. కొన్నేళ్ల కిందట నాన్‌వెజ్‌ను వదిలేసి శాకాహారిగా మారింది. సినీ ప్రాజెక్టులే కాదు... ఆమెకు ఉన్న భారీ ఫ్యాన్ ఫోలోయింగ్‌తో బడా బ్రాండ్లు కూడా క్యూ కడుతున్నాయి.

> **అద్భుతమైన అనుభూతి**
>
> 'ఏ రంగంలోనైనా సరే రాణించాలంటే మీ బలాలు, బలహీనతలు ఏమిటో తెలుసుకోవడం ఎంతో ముఖ్యం. అలాగే... మన విజయాల గురించి తల్లితండ్రులు, మనల్ని ప్రేమించేవారు గొప్పగా చెప్పుకోవడం కంటే పెద్ద బహుమతి ఏదీ ఉండదనేది నా అభిప్రాయం. అదే అద్భుతమైన అనుభూతి.'

కాఫీ సందేశ్!

కాఫీని చాలా మంది తాగుతారు. బెంగాలీలకు సందేశ్ అత్యంత ఇష్టమైన స్వీట్. ఈ రెండింటిని కలిపితే? రుచికరమైన ఫ్యూజన్ రెసిపీ అవుతుంది. ఫ్యూజన్ ఫుడ్స్‌కు మంచి ఆదరణ లభిస్తున్న నేపథ్యంలో దీనిని ఎలా చేయాలో చూద్దాం..

కావాల్సిన పదార్థాలు

వెన్న తీయని పాలు: ఒక లీటరు, నిమ్మరసం- అరకప్పు, పంచదార- అరకప్పు, ఇన్‌స్టెంట్ కాఫీ పౌడర్- పావు కప్పు, ఏలకుల పొడి- పావు టీస్పూను, ఉప్పు- పావు టీస్పూను, నెయ్యి- రెండు స్పూన్లు, డ్రైఫ్రూట్స్- రుచికి తగినట్లుగా..

తయారీ విధానం

- పాలను తొరక కట్టేదాకా మరిగించాలి. దానిలో నిమ్మరసం కలపాలి.
- విరిగిన పాలను ఒక గుడ్డలో పోసి వడగట్టాలి. అదనంగా ఉన్న నీటినీ తీసివేయాలి.



- ఆ తర్వాత మిగిలిన పాల ముద్దను మృదువుగా కలపాలి. దానిలో పంచదార, కాఫీపౌడర్, ఏలకుల పొడి, ఉప్పు వేసి బాగా కలపాలి.
- రెండు నిమిషాలు స్టౌ మీద పెట్టి వేడి చేయాలి.
- ఆ తర్వాత మిశ్రమాన్ని స్టౌ మీద నుంచి దింపి చల్లబరచాలి. దానిలో నెయ్యి వేసి కలపాలి.
- ఆ మిశ్రమాన్ని చిన్న చిన్న ఉండలుగా చేసి- వాటిపై డ్రైఫ్రూట్స్ అద్దాలి.

జాగ్రత్తలు

- కాఫీ రుచిని అందరూ ఆస్వాదించరు. కాబట్టి రుచికి అనుగుణంగా కాఫీ పౌడర్‌ను కలుపుకోవాలి

మధ్యాహ్నం నిద్ర ఇబ్బంది పెడుతుంటే

మధ్యాహ్నం కునుకు మంచిదే అంటారు. కానీ ఆఫీసులో ఆ కునుకు కెరీర్‌పై ప్రభావాన్ని చూపించవచ్చు. మధ్యాహ్నం నిద్ర చాలామందికి ఎదురయ్యేదే. ఈ పరిస్థితిని బయటపడాలంటే ఇలా చేయాలంటున్నారు నిపుణులు.

- లంచ్‌లో ఎక్కువ కార్బోహైడ్రేట్స్ లేకుండా చూసుకోవాలి. ముఖ్యంగా రైస్ తినడం వల్ల నిద్ర ముంచుకొస్తుంది. కార్బోహైడ్రేట్స్‌లో గ్లైసెమిక్ ఇండెక్స్ ఎక్కువగా ఉంటుంది. ఇది నిద్రను ప్రేరేపించే రసాయనం అయినటువంటి ట్రిప్టోఫన్‌ను వేగంగా విడుదలయ్యేలా చేస్తుంది.
- రాత్రుళ్లు పొద్దుపోయే వరకు టీవీ చూడటం వల్ల దాని ప్రభావం నిద్రపై పడుతుంది. బెడ్‌పైకి చేరిన తరువాత ఫోన్ చూసే అలవాటు కూడా మంచిది కాదు. బ్లూ లైట్ నిద్రను దూరం చేస్తుంది.
- రాత్రివేళ త్వరగా పడుకుని, సూర్యోదయం కన్నా ముందే లేవడం అలవాటు చేసుకోవాలి. దీనివల్ల శరీరానికి, మనసుకు అవసరమైన విశ్రాంతి లభిస్తుంది. ఇది రోజంతా యాక్టివ్‌గా ఉండటానికి దోహదపడుతుంది.
- శరీరానికి తగినంత ఎనర్జీ అందనప్పుడు కూడా అలసట వస్తుంది. శక్తి కావాలంటే నట్స్, బెర్రీస్, డేట్స్ తీసుకోవాలి. ఇవి ఎక్కువ ఎనర్జీని అందిస్తాయి. ఇవి అలసటను దూరం చేసి శరీరానికి శక్తిని అందిస్తాయి.



- ప్రతిరోజు వ్యాయామం చేయడం అలవాటు చేసుకోవాలి. దీనివల్ల ఆ రోజంతా హుషారుగా ఉంటుంది. కనీసం నలభై ఐదు నిమిషాలు వేగంగా వాకింగ్ చేస్తే మంచి ఫలితం ఉంటుంది. యోగా, మెడిటేషన్ వంటివి కూడా మంచి ఫలితాలను ఇస్తాయి.
- మధ్యాహ్నం వేళ మెదడుకు ఉత్సాహానిచ్చే విధంగా ఇష్టమైన వాటిని చూడటం, ఆసక్తి ఉన్న వాటికోసం సెర్చ్ చేయడం లాంటివి చేయాలి.



లాపతా లేడీస్... మహిళల గుర్తింపుపై బలమైన ముద్ర వేసిన సినిమా. బెస్ట్ ఫారిన్ ఫిల్మ్ కేటగిరీలో ఇండియా నుంచి అధికారిక చిత్రంగా ఆస్కార్ బరిలో నిలిచింది. బిప్లాబ్ గోస్వామి అందించిన కథకు తన స్క్రీన్‌ప్లే, డైలాగ్స్‌తో మాయ చేశారు స్నేహా దేశాయ్. లాపతా లేడీస్‌తో తన కలను సాకారం చేసుకున్నారామె. మరిన్ని విశేషాలు ఆమె మాటల్లోనే...



ఈ గుర్తింపుతో కల సాకారమైంది

"ఒక రచయితగా ఈ గుర్తింపు నాకలను సాకారం చేసింది. ఈ ప్రాజెక్టులో భాగస్వాములైన అందరికీ గుర్తింపు లభించింది. ఇందులో నేను కూడా భాగస్వామి కావడం నా అదృష్టం. ఈ చిత్రం మూల కథ బిప్లాబ్ గోస్వామి రాశారు. సినీస్తాన్ ఇండియా స్టోరీటెల్లర్ కాంపిటీషన్‌లో ఆయన రాసిన కథ పోటీలో నిలిచింది. ఆ కాంపిటీషన్ జ్యూరీలో అమీర్‌ఖాన్ ఉన్నారు. ఆ స్టోరీ నచ్చడంతో స్క్రీన్‌ప్లే డెవలప్ చేయమని నాకు ఇచ్చారు. అమీర్‌ఖాన్ వాళ్ల అబ్బాయి జునైద్‌ఖాన్ హీరోగా వచ్చిన 'మహారాజ్' సినిమాకు నేను పనిచేశాను. నా పని నచ్చడంతో గోస్వామి కథను డెవలప్ చేయమని చెప్పారు. అలా లాపతా లేడీస్ పట్టాలెక్కింది. సినిమా కోసం కొన్ని క్యారెక్టర్లు డెవలప్ చేసే స్వేచ్ఛను ఇచ్చారు. కథలు చెప్పడం భారతీయ మూలాల్లోనే ఉంది. అలాంటి వాతావరణంలోనే నేను పెరిగాను. మా తాత, అమ్మమ్మ, నానమ్మ, మా పేరెంట్స్ కథలు అద్భుతంగా చెప్పేవారు. ఆ ప్రభావం నాపై ఉంది.

అదే చూపించాం...

ఇది స్త్రీవాద చిత్రం కాదు. మహిళలు, మహిళా సాధికారత గురించి మాట్లాడే సినిమా. మహిళలు వాళ్ల సమస్యలకు పరిష్కారం కనుగొనమని అడిగేందుకు ప్రయత్నించాం. స్వేచ్ఛ వైపు అడుగులు వేయమని కోరాం. ఇందులో పురుష క్యారెక్టర్లను కూడా అద్భుతంగా చూపించాం. మొత్తంగా బ్యాలెన్స్ చేశామనే అనుకుంటున్నాం. జీవితంలో ఎదగాలంటే ఒకరి సహకారం మరొకరికి అవసరం. అదే సినిమాలో చూపించాం. సినిమాలో ప్రధాన స్త్రీ క్యారెక్టర్లకు ముసుగులు వేయడమనేది కథ ముందుకు వెళ్లేందుకు ట్రిగ్గర్‌లా ఉపయోగపడతాయని పెట్టాం. లక్ష్యాలు, ఆశయాలు ఎంత చిన్నవైనా, పెద్దవైనా కావచ్చు. అని కానీ వాటిని సంపూర్ణంగా సాధించుకోవాలి. ఉదాహరణకి గృహిణిగా ఉంటే అత్తగారితో స్నేహం చాలా ముఖ్యం. భాగస్వామి కోసం సబ్జీని వండటం ముఖ్యమైన అంశం. అదే ఇందులో చూపించాం.



తగిన గుర్తింపు లేదు

ఒక సినిమా విజయం సాధించినప్పుడు దర్శకులకు, నటులకు వచ్చినంత గుర్తింపు రచయితలకు రావడం లేదు. ఇది బాధ కలిగించే అంశమే. అయితే పెన్నుకున్న పవర్‌ను ప్రేక్షకులు అర్థం చేసుకుంటున్నారు. ఒక బౌండ్ స్క్రిప్టుకున్న పవర్‌ని, రచయితలకు ఉన్న శక్తిని ప్రేక్షకుడు తెలుసుకున్నారు. గుల్జార్, జావేద్ అక్తర్, జుహీ చతుర్వేది లాంటి గొప్ప రచయితలు కథలు అందించిన సినిమాలు వాళ్ల పేర్లతో అమ్ముడవుతున్నాయి.

అవకాశాలు పుష్కలం

కథలు రాయడాన్ని కెరీర్‌గా ఎంచుకునే వారికి బోలెడు అవకాశాలు ఉన్నాయి. అయితే రాసే కథలో కాంప్రమైజ్ కావద్దు. మీ మనసును ఫాలో కావాలి. కథలను స్వేచ్ఛగా రాయాలి. ముందుగా బాగా చదవడం అలవాటు చేసుకోవాలి. సాహిత్యం, కామిక్స్, ఫిక్షన్ చదవాలి. పదాలు వెతుక్కునేందుకు శ్రమ పడకుండా ఉండేలా తయారవ్వాలి. సినిమాలు బాగా చూడాలి. రాసిన పదాలు చాలా దూరం ప్రయాణిస్తాయి. అందులో సందేహం లేదు.

నటన నుంచి రచన వైపు...

మాది ముంబయి. నాకు గుజరాతీ థియేటర్‌తో చాలా సంబంధం ఉంది. దాదాపు 25 ఏళ్లు పనిచేశాను. నేను ముందుగా నటిని. ఆ తరువాతే రచయితగా మారాను. స్నేహితులతో వన్ లైన్ ఐడియాస్, స్టోరీస్ షేర్ చేసే దాన్ని. గుజరాత్ థియేటర్ తరువాత టీవీ రంగంలోకి అడుగుపెట్టాను. గుజరాతీ టీవీ నుంచి హిందీ టీవీకి వచ్చాను. హిందీ టీవీ నుంచి మహారాజ్ అవకాశం వచ్చింది. ఆ తరువాత లాపతా లేడీస్ ఛాన్స్ దక్కింది. ప్రతినెలా టీవీ కోసం 56 ఎపిసోడ్‌లు రాసేదాన్ని. టీవీ రంగంలో టైమ్‌లైన్ కీ ఫ్యాక్టర్‌గా ఉంటుంది. ఈ రోజు నువ్వు రాసింది రేపు లేక ఎల్లుండి షూట్‌కి వెళుతుంది. డ్రాఫ్ట్ రీరైట్ చేయడం ఉండదు.

సహకారం మరువలేనిది

స్నేహితులు, బంధువులు, వెల్‌విషర్స్ నుంచి అభినందనలు చెబుతూ చాలా మెసేజ్‌లు వచ్చాయి. వాళ్ల సపోర్టు నాకెంతో ఆనందానిచ్చింది. నా కుటుంబ సభ్యులు నన్నెంతో నమ్మారు. నా కష్టాలను వాళ్లు చూశారు. ఇప్పుడు వాళ్లెంతో గర్వపడుతున్నారు. దర్శకురాలు కిరణ్‌రావుతో పనిచేయడం ఎంతో సంతోషానిచ్చింది. ఆమె తన టీమ్ మొత్తాన్ని నమ్మారు. మొదటి నుంచి కథను డెవలప్ చేయడానికి క్రియేటివ్ ఫ్రీడం అందించారు. ఆమెతో చేసిన డిస్కషన్స్ ఎంతో ఉపయోగపడ్డాయి. ఆమె సహకారం వల్లే రచన సులువుగా సాగిపోయింది. దర్శక రచయితల మధ్య రిలేషన్‌షిప్‌లో ఆ నమ్మకం, సహకారం చాలా అరుదుగా చూస్తుంటాం. యువ రచయితలను ప్రోత్సహించడంలో అమీర్‌ఖాన్ ఎప్పుడూ ముందుంటారు.'

ఒంటరితనం.. అధిగమించండి ఇలా

కొన్నిసార్లు మనం ఒంటరిగా ఉండాల్సిన రోజులుంటాయి. స్నేహితులు ఉండరు.. కుటుంబ సభ్యులు ఉండరు.. బయటకు వెళ్దామంటే - 'ఒంటరిగా వెళ్లాలా?' అనే ఆలోచన వేధిస్తూ ఉంటుంది. జీవితంలో ఇలాంటి ఫేజ్ వచ్చినప్పుడు ఏం చేయాలి అనే ప్రశ్న చాలా మందిని వెంటాడుతూ ఉంటుంది. ఇలాంటి సమయాల్లో- "మీకు మీరే స్నేహితులు.. మీరు మీరే కంపెనీ" అంటున్నారు మానసిక నిపుణులు. ఒంటరిగా ఉండాల్సి వచ్చినప్పుడు సమయాన్ని గడపటానికి వారు కొన్ని టిప్స్ చెబుతున్నారు. అవేమిటో చూద్దాం..

కొత్త స్కిల్ నేర్చుకోండి..

కొత్త స్కిల్స్ నేర్చుకోవటానికి వయస్సు ఎప్పుడూ అడ్డు కాదు. ఒంటరిగా ఉండాల్సిన సమయంలో కొత్త స్కిల్స్‌ను నేర్చుకుంటే జీవితం కొత్త మలుపు తిరిగే అవకాశముంటుంది. ఉదాహరణకు మీకు ముగ్గులు వేయటం రాదనుకుందాం. ఖాళీగా ఉన్న సమయంలో ముగ్గులు వేయటం నేర్చుకుంటే- ఎప్పుడో ఒకప్పుడు ఉపకరిస్తుంది.





సోషల్ మీడియా వద్దు..

ఖాళీగా ఉన్న సమయం దొరికితే చాలు- సోషల్ మీడియాలో మునిగిపోవటం అందరికీ అలవాటు అయిపోయింది. సోషల్ మీడియాను ఎక్కువగా చూడటం వల్ల సమయం గడిచినట్లు అనిపిస్తుంది. కానీ అంతర్ముఖులం కావటానికి సమయం చిక్కదు. సోషల్ మీడియాలో గడిపే సమయంలో మన గురించి మనం ఆలోచించుకుంటే- మన చేసిన తప్పులను విశ్లేషించుకుంటే.. మన బలాలను మదింపు వేసుకుంటే ప్రయోజనం ఉంటుంది.

వ్యాయామం తప్పనిసరి

ఒంటరితనాన్ని అధిగమించాలంటే- ప్రతి రోజు వ్యాయామం తప్పనిసరిగా చేయాలి. దీని వల్ల శరీరంలోని కణాలు ఉత్తేజిమవుతాయి.. పాజిటివ్ ఆలోచనలు వస్తాయి. వీలైనంత వరకు- ప్రకృతి ఒడిలో వ్యాయామం చేయటం వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయి.





ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ	ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
అమెజాన్ ప్రైమ్			**ఆహా...**		
హౌస్ ఆఫ్ స్పాయిల్స్	వెబ్‌సిరీస్	అక్టోబర్ 03	35 చిన్న కథ కాదు	తెలుగు చిత్రం	అక్టోబర్ 02
ది ట్రైబ్	వెబ్‌సిరీస్	అక్టోబర్ 04	బాలూగాని టాకీస్	తెలుగు చిత్రం	అక్టోబర్ 04
నెట్‌ఫ్లిక్స్			**జీ 5**		
టిమ్ డిల్లాన్	హాలీవుడ్ మూవీ	అక్టోబర్ 01	ది సిగ్నేచర్	హిందీ చిత్రం	అక్టోబర్ 04
షెఫ్స్ టేబుల్	వెబ్‌సిరీస్	అక్టోబర్ 02	**జియో సినిమా**		
లవ్ ఈజ్ బ్లైండ్	వెబ్‌సిరీస్	అక్టోబర్ 02	అమర్ ప్రేమ్ కీ ప్రేమ్ కహానీ	హిందీ చిత్రం	అక్టోబర్ 04
అన్‌సాల్వ్‌డ్ మిస్టరీస్ 5	వెబ్‌సిరీస్	అక్టోబర్ 02	**మనోరమా మ్యాక్స్**		
హార్ట్‌స్టాపర్ 3	వెబ్‌సిరీస్	అక్టోబర్ 03			
కంట్రోల్	హిందీ చిత్రం	అక్టోబర్ 04	ఆనందపురం డైరీస్	మలయాళ చిత్రం	అక్టోబర్ 04





అరవింద్ సంతకం

ప్రముఖ మరాఠీ నిర్మాత గజేంద్ర అహిరే దర్శకత్వం వహించిన హిందీ చిత్రం 'ది సిగ్నేచర్'. 2013లో వచ్చిన మరాఠీ చిత్రం 'అనుమతి'కి ఇది రీమేక్. అనుపమ్‌ఖేర్ లీడ్‌రోల్ పోషించారు. మహిమా చౌదరి, నీనా కులకర్ణి, రణ్‌వీర్ షోరే కీలకపాత్రలు పోషించారు.

అరవింద్ అనే పాత్రలో అనుపమ్‌ఖేర్ కనిపించారు. వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న భార్యను కాపాడు కునేందుకు ఆయన పడిన కష్టాలు, వారి కుటుంబంలో ఎలాంటి సంక్షోభాన్ని సృష్టించాయి అనే అంశం చుట్టూ అల్లుకున్న కథ ఇది. మధ్యతరగతి కుటుంబాల్లోని కష్టాలు హృదయానికి హత్తుకునేలా తెరకెక్కించారని ట్రైలర్‌ను బట్టి తెలుస్తోంది.



మూడేళ్లలో ఏఐ ఉత్పత్తుల మార్కెట్
రూ.83 లక్షల కోట్లకు..

న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా కృత్రిమ మేథ (ఏఐ) ఆధారిత ఉత్పత్తులు, సర్వీసుల మార్కెట్ 44-45 శాతం వార్షిక వృద్ధితో 2027 నాటికి 99 వేల కోట్ల డాలర్ల (రూ.83.16 లక్షల కోట్లు) స్థాయికి చేరుతుందని అంచనా. రాబోయే మూడేళ్ల కాలంలో ఏఐ పని భారం ఏడాదికి 25 నుంచి 35 శాతం మేరకు పెరగవచ్చని బెయిన్ అండ్ కో 5వ వార్షిక ప్రపంచ టెక్నాలజీ నివేదికలో అంచనా వేసింది. ఏఐ విస్తరిస్తున్న కొద్దీ కంప్యూటింగ్ శక్తి వేగంగా పెరగాల్సి ఉందని ఆ నివేదిక తెలిపింది. ఫలితంగా రాబోయే 5 నుంచి 10 ఏళ్ల మధ్య కాలంలో భారీ డేటా సెంటర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏర్పడుతుందని పేర్కొంది. ప్రస్తుతం 50 నుంచి 200 మెగావాట్లున్న డేటా సెంటర్ల సామర్థ్యం గిగావాట్ కన్నా పై స్థాయికి పెంచాల్సి వస్తుందని, అంటే నేడు 100 కోట్ల డాలర్ల నుంచి 400 కోట్ల డాలర్లున్న డేటా సెంటర్ల వ్యయం ఐదేళ్ల కాలంలో 1,000 కోట్ల డాలర్ల నుంచి 2,500 కోట్ల డాలర్లకు చేరుతుందని అంచనా వేసింది. ఏఐతో పని చేయగల జీపీయూల డిమాండు పెరిగిన కొద్దీ వాటికి కావలసిన ఆధునిక విడిభాగాల డిమాండును 30 శాతం మేరకు పెంచుతుందని అంచనా వేసింది.

పండగ సీజన్‌పై 'ఆటో' ఆశలు
కొత్త కార్ల విడుదలకు కంపెనీలు రెడీ

దేశీయ ఆటోమొబైల్ కంపెనీలు ఈ ఏడాది పండగ సీజన్‌పై భారీ ఆశలు పెట్టుకున్నాయి. ఇందులో భాగంగా వినియోగదారులను ఆకట్టుకునేందుకు కియా మోటార్స్, మారుతి సుజుకీ, నిస్సాన్, మహీంద్రా అండ్ మహీంద్రా, బీవైడీ, మెర్సిడెస్ బెంజ్ సహా మరికొన్ని కంపెనీలు వచ్చే నెలలో మార్కెట్లోకి కొత్త కార్లను విడుదల చేసేందుకు రెడీ అవుతున్నాయి. కొంతకాలంగా నిస్తేజంగా సాగుతూ వస్తున్న ఆటో మార్కెట్‌కు దసరా, దీపావళి పండగలు మరింత ఊపునిస్తాయని కంపెనీలు అంచనా వేస్తున్నాయి.

కొత్త తరం కియా కార్నివాల్



కియా మోటార్స్ తన ప్రీమియం మల్టీ పర్పస్ వెహికిల్ (ఎంపీవీ) కార్నివాల్‌లో న్యూ జనరేషన్ మోడల్‌ను వచ్చే నెల 3న విడుదల చేసే అవకాశం ఉంది. 2024 కార్నివాల్‌ను సరికొత్త డిజైన్, హంగులతో అందుబాటులోకి తేనుంది. దీని ధర రూ.40-45 లక్షల స్థాయిలో ఉండవచ్చని అంచనా.

కియా ఈవీ 9



కియా వచ్చే నెలలో కార్నివాల్‌తో పాటు తన ఫ్లాగ్‌షిప్ ఎలక్ట్రిక్ మోడల్ 'ఈవీ 9'ను సైతం విడుదల చేయనున్నట్లు తెలిసింది. 99.8 కిలోవాట్ బ్యాటరీ ప్యాక్‌తో కూడిన ఈ కారు పూర్తి చార్జింగ్‌తో 561 కిలోమీటర్ల వరకు ప్రయాణించగలదు. దీని ధర వేరియంట్‌ను బట్టి రూ.90 లక్షల నుంచి రూ.1.20 కోట్ల స్థాయిలో ఉండే అవకాశం ఉంది.

నిస్సాన్ మాగ్నైట్ ఫేస్‌లిఫ్ట్



జపాన్ కార్ల కంపెనీ నిస్సాన్ తన కాంపాక్ట్ ఎస్‌యూవీ మోడల్ మాగ్నైట్‌లో ఫేస్ లిఫ్ట్ వెర్షన్‌ను వచ్చే నెల 4న మార్కెట్లోకి విడుదల చేయబోతోంది. దేశీయ మార్కెట్లో ప్రస్తుతం అత్యధికంగా అమ్ముడవుతున్న నిస్సాన్ మోడల్ ఇదే. కంపెనీ ఈ కారును సరికొత్త డిజైన్‌తో పాటు అదనపు హంగులతో అందుబాటులోకి తీసుకువస్తోంది. దీని ధరల శ్రేణి రూ.6-11 లక్షల స్థాయిలో ఉండే అవకాశం ఉంది.

బీవైడీ ఈమ్యాక్స్ 7



చైనా ఎలక్ట్రిక్ కార్ల కంపెనీ బీవైడీ తన ప్రీమియం ఎలక్ట్రిక్ ఎంపీవీ మోడల్ 'ఈమ్యాక్స్ 7' కారును వచ్చే నెల 8న భారత మార్కెట్లోకి ప్రవేశపెట్టనుంది. సంస్థ ఇప్పటికే విక్రయిస్తోన్న ఈ6 మోడల్‌కు ఫేస్‌లిఫ్ట్ వెర్షన్ ఇది. కంపెనీ ఈ కారు ప్రీ-బుకింగ్‌ను సైతం ప్రారంభించింది. రూ.51వేలు చెల్లించి కారును బుక్ చేసుకోవచ్చు. దీని ధరల శ్రేణి రూ.30-32 లక్షల స్థాయిలో ఉండే అవకాశం ఉంది.

మారుతి డిజైర్ ఫేస్ లిఫ్ట్



దేశీయ కార్ల తయారీ దిగ్గజం మారుతి సుజుకీ ఇండియా ఈ దీపావళి సీజన్‌లో 'డిజైర్' ఫేస్ లిఫ్ట్ వెర్షన్‌ను మార్కెట్లోకి విడుదల చేయనుంది. సరికొత్త లుక్, ప్రీమియం ఇంటీరియర్స్‌తో పాటు హెడ్, టెయిల్ ఎల్ఈడీ ల్యాంప్స్, సరికొత్త అల్లాయ్స్, ఎలక్ట్రిక్ సన్‌రూఫ్, ఆటోమెటిక్ క్లైమెట్ కంట్రోల్, 9 అంగుళాల సైజున్న టచ్ స్క్రీన్‌తో దీన్ని డిజైన్ చేసినట్లు తెలిసింది. దీని ధర రూ.7 లక్షల స్థాయిలో ఉండవచ్చని అంచనా.

మహీంద్రా ఎక్స్‌యూవీ 3ఎక్స్‌ఓ ఈవీ



కాంపాక్ట్ ఎస్‌యూవీ మోడల్ 'ఎక్స్‌యూవీ 3ఎక్స్‌ఓ'ను ఇప్పటికే మార్కెట్లో విక్రయిస్తోన్న మహీంద్రా.. ఇందులో ఎలక్ట్రిక్ వెర్షన్‌ను ఈ దీపావళి సీజన్‌లో మార్కెట్లోకి విడుదల చేసేందుకు రెడీ అవుతోంది.

కొత్త తరం బెంజ్ ఈ-క్లాస్



జర్మన్ లగ్జరీ కార్ల దిగ్గజం మెర్సిడెస్ బెంజ్ భారత మార్కెట్లోకి ఆరో తరం ఈ-క్లాస్ మోడల్‌ను అందుబాటులోకి తీసుకురానుంది. అక్టోబరు 9న ఈ కారును విడుదల చేసే అవకాశం ఉంది. ఈ-200, ఈ-220డీ వేరియంట్లలో లభించనున్నఈ కారు ధర శ్రేణి రూ.80-90 లక్షల స్థాయిలో ఉండే వీలుంది.

2030 నాటికి రిటైల్ రుణాలు మూడింతలు
ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్ రిపోర్టు అంచనా

ముంబై: దేశీయ బ్యాంక్‌లు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ)ల రిటైల రుణాలు 2030 నాటికి మూడింతల స్థాయికి పెరగవచ్చని ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్ తాజా రిపోర్టు అంచనా వేసింది. దాంతో కుటుంబాల రుణ భారం 2030-31 ఆర్థిక సంవత్సరం నాటికి 34 శాతానికి పెరగవచ్చని నివేదికలో ప్రస్తావించింది. గత ఆర్థిక సంవత్సరం (2023-24) నాటికి ఈ వాటా 23 శాతంగా నమోదైంది. మరిన్ని ముఖ్యాంశాలు..

- బ్యాంక్‌లతో పోలిస్తే ఎన్‌బీఎఫ్‌సీలు బలమైన రుణ వృద్ధిని కనబర్చనున్నాయి. ఎన్‌బీఎఫ్‌సీ రిటైల్ రుణాలు 14 శాతం చొప్పున వృద్ధి చెందవచ్చు. ఆర్థిక వ్యవస్థ వేగంగా వృద్ధి చెందుతుండటం రుణాల తిరిగి చెల్లింపుల సామర్థ్యానికి తోడ్పడనుంది.
- ఫైనాన్స్ కంపెనీల విభాగంలో అప్పర్ లేయర్ ఎన్‌బీఎఫ్‌సీలు సమృద్ధిగా మూలధన నిల్వలు కలిగి ఉన్నాయి. ఈ అంశం వచ్చే రెండేళ్లపాటు రుణ వృద్ధికి తోడ్పడనుంది.
- దేశంలో తనఖా రహిత రిటైల్ రుణాలు అసాధారణ స్థాయిలో వృద్ధి చెందుతుండటం, ఈ విభాగంలో మొండి బకాయిలు కూడా క్రమంగా పెరుగుతుండటంపై ఆర్‌బీఐ ఈ మధ్య ఆందోళన వ్యక్తం చేసింది. భవిష్యత్‌లో ఇది ఆర్థిక సేవల రంగ స్థిరత్వానికి ముప్పుగా పరిణమించే అవకాశం ఉండటంతో బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలకు ఈ విభాగ రుణాల మంజూరుకు సంబంధించిన నిబంధనలను కఠినతరం చేసింది.

క్రెడిట్ కార్డు వ్యయాల వృద్ధి తగ్గుముఖం

దేశంలో క్రెడిట్ కార్డు వ్యయాల వృద్ధి గత మూడు ఆర్థిక సంవత్సరాలుగా తగ్గుముఖం పడుతోంది. 2021-22 ఆర్థిక సంవత్సరంలో క్రెడిట్ కార్డు వ్యయాలు ఏకంగా 54.10 శాతం వృద్ధి చెందగా.. 2022-23లో ఈ వృద్ధి 47.50 శాతానికి తగ్గింది. 2023-24లో 27.80 శాతానికి పరిమితమైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2024-25) వృద్ధి మరింత తగ్గవచ్చని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి. 2024-25లో ఇప్పటివరకు వృద్ధి 16.6 శాతంగా నమోదైంది. అయితే, ఏటా పండగ సీజన్ (సెప్టెంబరు-డిసెంబరు)లో క్రెడిట్ కార్డు వ్యయాలు పతాక స్థాయిలో నమోదవుతాయి. ఎందుకంటే, ఈ సీజన్‌లో ఈ-కామర్స్ కంపెనీలు పండగ సేల్‌లో భాగంగా కార్డు ద్వారా కొనుగోలుపై క్యాష్ బ్యాక్‌లు, ప్రత్యేక డిస్కౌంట్‌లు ఆఫర్ చేస్తుండటం ఇందుకు కారణం. కాబట్టి ఈ ఆర్థిక సంవత్సరం మొత్తానికి కార్డు వ్యయాల వృద్ధి 20-22 శాతానికి పరిమితం కావచ్చని అంచనా.



తమిళనాడులో టాటా మోటార్స్ ప్లాంట్
రూ.9,000 కోట్ల పెట్టుబడి
ఎస్‌యూవీ, స్పోర్ట్స్ కార్ల తయారీ

రాణిపేట్ (తమిళనాడు): దేశీయ ఆటోమొబైల్ దిగ్గజం టాటా మోటార్స్.. స్పోర్ట్స్ యుటిలిటీ వెహికల్స్ (ఎస్‌యూవీ), స్పోర్ట్స్ కార్ల కోసం తమిళనాడులో కొత్త ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోంది. చెన్నైకి సమీపంలో పనపాక్కం జిల్లాలో రూ.9,000 కోట్ల పెట్టుబడితో కంపెనీ ఈ ప్లాంట్‌ను నెలకొల్పనుంది. శుక్రవారం నాడు టాటా సన్స్ లిమిటెడ్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్‌తో కలిసి తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శంకుస్థాపన చేశారు. టాటా మోటార్స్‌తో పాటు కంపెనీ బ్రిటిష్ ఆటో విభాగమైన జాగ్వార్ అండ్ లాండ్ రోవర్ (జేఎల్ఆర్) కొత్తగా ఏర్పాటు చేయనున్న ప్లాంట్‌లో నెక్స్ట్ జెనరేషన్ వాహనాలను ఉత్పత్తి చేయనున్నాయి. దశలవారీగా ఈ ప్లాంట్ పనులను ప్రారంభించి వార్షిక ఉత్పత్తి సామర్థ్యాన్ని 2.5 లక్షల యూనిట్లకు చేర్చనున్నట్లు టాటా మోటార్స్ వెల్లడించింది. కంపెనీ పూర్తి స్థాయిలో ఉత్పత్తి సామర్థ్యాన్ని చేపట్టటానికి ఐదు నుంచి ఏడేళ్ల సమయం పట్టే వీలుందని తెలిపింది.

దేశ,విదేశీ మార్కెట్ల కోసం: దేశీయ, విదేశీ మార్కెట్లలో మరింత పట్టును చేజిక్కించుకునేందుకు ఈ ప్లాంట్ ఎంతగానో దోహదపడుతుందని టాటా మోటార్స్ అంచనా వేస్తోంది. ఈ ప్లాంట్‌ను పూర్తిగా పునరుత్పాదక ఇంధన వనరులతో నిర్వహించనున్నట్లు పేర్కొంది. కాగా తమిళనాడు ఇప్పటికే ఆటోమొబైల్ హబ్‌గా ఉందని తాజాగా టాటా మోటార్స్ ఎస్‌యూవీ వాహనాల తయారీకి ముందుకు రావటంతో ఎంతో సంతోషాన్నిస్తోందని ముఖ్యమంత్రి స్టాలిన్ అన్నారు. ఈ ప్లాంట్ ద్వారా కొత్తగా 5,000 మందికి ఉపాధి అవకాశాలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు.

ఫామ్‌గేట్ ధర		వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్	
హైదరాబాద్	125	విజయవాడ	121
వరంగల్	125	గుంటూరు	126
కరీంనగర్	125	ఒంగోలు	126
మహబూబ్‌నగర్	125	చిత్తూరు	126
కర్నూలు	125	నెల్లూరు	126
విశాఖపట్నం	107	అనంతపురం	126
గోదావరి	121		



- అమెజాన్ ఫ్రెష్.. పండగల సీజన్‌ను పురస్కరించుకుని అక్టోబరు 1 నుంచి 7 వరకు ఫెస్టివ్ సూపర్ వాల్యూ డేస్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ సేల్‌లో భాగంగా నిత్యావసరాలు, ప్యాకేజ్డ్ ఫుడ్స్, స్నాక్స్, బెవరేజెస్‌పై 45 శాతం వరకు డిస్కౌంట్‌ను అందించనుంది. అలాగే కొత్త కస్టమర్లకు ఆర్డర్లపై రూ.400 క్యాష్ బ్యాక్‌తో పాటు 50 శాతం వరకు తగ్గింపును ఆఫర్ చేస్తోంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)			
29వ తేదీ		విజయవాడ	535
హైదరాబాద్	510	గోదావరి	535
వరంగల్	512	విశాఖపట్నం	535
చిత్తూరు	523	దజను గుడ్లు రూ. 78	



- శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్.. విజయవాడ, విశాఖపట్నంలలో టూ-వీలర్ ఎక్స్చేంజ్, లోన్ మేళాను నిర్వహిస్తోంది. ఈ మేళాలో వినియోగదారులు తమ రుణ అర్హతను తక్షణమే తెలుసుకోవటమే కాకుండా రుణ ప్రక్రియను వేగంగా పూర్తి చేసుకోవచ్చు. ఈ రుణ మేళా కోసం హీరో, సుజుకీ, టీవీఎస్, యమహా తదితర సంస్థలు శ్రీరామ్ ఫైనాన్స్‌తో జట్టు కట్టాయి.
- అంతర్జాతీయ ఎక్స్‌ప్రెస్ సర్వీసుల సంస్థ డీహెచ్‌ఎల్ ఎక్స్‌ప్రెస్ భారత్‌లో వార్షిక చార్జీలను సవరించింది. సగటున ఈ చార్జీలను 6.9 శాతం వరకు పెంచింది. పెంచిన చార్జీలు 2025 జనవరి 1 నుంచి అమల్లోకి వస్తాయి.
- ఐటీసీ సన్‌ఫీస్ట్ చిన్నారుల కోసం బిగ్ ఫాంటసీస్: గివ్ వింగ్స్ టు యువర్ ఇమాజినేషన్ పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. చిన్న పిల్లల్లో సృజనాత్మక శక్తిని వెలికితీయటంతో పాటు ఆధునిక టెక్నాలజీలకు అనుగుణంగా వారి ఊహాశక్తిని పెంపొందించేందుకు ఐటీసీ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమం కింద ఎంపికైన చిన్నారులకు అమెరికాలోని అంతరిక్ష సంస్థ నాసా ను సందర్శించే అవకాశం కల్పించనుంది.
- గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ (జీఏవీఎల్).. పంట రక్షణ కోసం హలో గోద్రెజ్ పేరుతో ప్రత్యేక హెల్ప్‌లైన్‌ను ప్రారంభించింది. తెలుగు సహా పలు భాషల్లో ఇది అందుబాటులో ఉండనుంది. పంట రక్షణకు సంబంధించి సలహాలు, సూచనలను రైతులకు ఇది అందించనుంది. రైతులు 022-25194491 నంబరుకు కాల్ చేయటం ద్వారా తమకు అవసరమైన సమాచారాన్ని పొందవచ్చని జీఏవీఎల్ వెల్లడించింది.

స్పోర్ట్స్



ఎక్స్‌ప్రెస్ వేగం

రెండేళ్ల కిందటే ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అడుగుపెట్టిన మయాంక్..ఎక్స్‌ప్రెస్ వేగంతో బంతులు విసురుతూ అబ్బురపరిచాడు. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ తరపున ఈసారి ఐపీఎల్‌లో అరంగేట్రం చేసిన అతడు..తొలి రెండు మ్యాచ్‌ల్లోనే గంటకు 156 కి.మీ. వేగంతో బౌలింగ్ చేసి బ్యాటర్లను గడగడలాడించాడు. కానీ ఆడిన మూడు మ్యాచ్‌ల్లో రెండుసార్లు గాయపడడంతో.. టోర్నీ మొత్తానికి దూరమయ్యాడు. లేదంటే టీ20 వరల్డ్ కప్‌నకే మయాంక్ ఎంపికయ్యేవాడని భావించారు. అనంతరం గాయం నుంచి కోలుకున్న యాదవ్‌ను ఇటీవల జాతీయ క్రికెట్ అకాడమీలో జరిగిన ప్రత్యేక శిబిరానికి ఎంపిక చేసి శిక్షణ ఇచ్చారు.



మయాంక్, నితీశ్ వచ్చేశారు
బంగ్లాదేశ్‌తో మూడు టీ20లకు టీమిండియా ఎంపిక

న్యూఢిల్లీ: నిప్పులు చెరిగే బంతులతో బ్యాటర్లలో గుబులు పుట్టిస్తూ ప్రపంచ క్రికెట్‌ను ఆకర్షించిన యువ పేసర్ మయాంక్ యాదవ్‌కు టీమిండియాలో తొలిసారి చోటు దక్కింది. బంగ్లాదేశ్‌తో జరిగే మూడు టీ20లకు శనివారం ఎంపిక చేసిన జట్టులో 22 ఏళ్ల ఢిల్లీ పేస్ సంచలనానికి సెలెక్టర్లు స్థానం కల్పించారు. సూర్యకుమార్ యాదవ్ సారథ్యం వహించే 15 మంది జట్టులో ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యానూ చేర్చారు. గతంలో జింబాబ్వే పర్యటనకు ఎంపికైనా..గాయంతో ఆ టూర్‌ను మిస్సయిన తెలుగు ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి కూడా చోటు నిలబెట్టుకున్నాడు. ఇక పనిభారం రీత్యా గిల్, జైస్వాల్, పంత్, బుమ్రా, సిరాజ్‌లకు విశ్రాంతి ఇచ్చారు. మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి మూడు సంవత్సరాల అనంతరం జాతీయ జట్టులో పునరాగమనం చేశాడు. కీపర్, బ్యాటర్ జితేశ్ శర్మకు కూడా స్థానం లభించింది. అయితే సంజూ శాంసన్ ప్రధాన కీపర్‌గా బాధ్యతలు నిర్వర్తించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. తొలి టీ20 వచ్చేనెల ఆరున గ్వాలియర్ జరగనుంది. తొమ్మిదిన న్యూఢిల్లీలో రెండో మ్యాచ్, 12న హైదరాబాద్‌లో ఆఖరి టీ20 జరగనుంది.

భారత జట్టు

సూర్యకుమార్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ (కీపర్), రింకూ సింగ్, హార్దిక్ పాండ్యా, రియాన్ పరాగ్, నితీశ్ కుమార్ రెడ్డి, శివమ్ దూబే, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, వరుణ్ చక్రవర్తి, జితేశ్ శర్మ (కీపర్), అర్షదీప్ సింగ్, హర్షిత్ రాణా, మయాంక్ యాదవ్.

ఆరుగురితో రిటైన్ పాలసీ

ఫ్రాంచైజీ పర్స్ విలువ రూ. 120 కోట్లు
ఆటగాళ్ల మ్యాచ్ ఫీజు రూ. 7.50 లక్షలు
ఇంపాక్ట్ ప్లేయర్ కొనసాగింపు

ఐపీఎల్ వేలంపై పాలకమండలి నిర్ణయాలు



బెంగళూరు: ఐపీఎల్ మెగా వేలం రిటెన్షన్ విధానంపై నెలకొన్న ఉత్కంఠకు తెర పడింది. ప్రతీ జట్టు గరిష్ఠంగా ఆరుగురు ఆటగాళ్లను రిటైన్ చేసుకోవచ్చు. ఇందులో కనీసం ఓ అన్‌క్యాప్డ్ ప్లేయర్ ఉండాల్సిందే. అలాగే వీరందరినీ వేలానికి ముందే అట్టిపెట్టుకోవడమా? రైట్ టు మ్యాచ్ (ఆర్‌టీఎం) ద్వారా తీసుకోవడమా? లేక ఈ రెండు పద్ధతుల ద్వారా కొనసాగించడమా? అనేది ఆయా ఫ్రాంచైజీలదే తుది నిర్ణయం. 2022లో జరిగిన ఆటగాళ్ల వేలంలో నలుగురిని మాత్రమే రిటైన్ చేసుకునే అవకాశం కల్పించారు. అయితే ఫ్రాంచైజీల సూచన మేరకు ఈసారి మెగా వేలంలో మాత్రం అదనంగా మరో ఆటగాడిని చేర్చింది. ఇదిలావుండగా గత సీజన్ నుంచి కొనసాగుతున్న ఇంపాక్ట్ ప్లేయర్ రూల్‌ను మున్ముందు కూడా అమలు చేయనున్నారు. అంతేకాకుండా.. వేలంలో ఏదైనా జట్టు కొనుగోలు చేసిన ఆటగాడు ఆ తర్వాత తాను లీగ్‌కు అందుబాటులో ఉండలేనని చెబితే మాత్రం అతడిపై రెండు సీజన్ల నిషేధం విధించనున్నారు. శనివారం జరిగిన ఐపీఎల్ పాలక మండలిలో వేలానికి సంబంధించి పలు నిర్ణయాలను తీసుకున్నారు.

సాలరీ క్యాప్ రూ.120 కోట్లు

మెగా వేలంలో పది ఫ్రాంచైజీలు ఆటగాళ్లను కొనుగోలు చేసేందుకు (సాలరీ క్యాప్) ఖర్చు చేసే మొత్తాన్ని కూడా రూ.120 కోట్లకు పెంచారు. నిరుడు మినీ వేలంలో ఈ మొత్తం రూ.100 కోట్లుగా ఉండింది. దీంతో ఈసారి వేలం రాకెట్ వేగంతో దూసుకెళ్లనుందనే అంచనాలున్నాయి.

రిటెన్షన్ ఖర్చు రూ.75 కోట్లు

మరోవైపు రిటెన్షన్ ఆటగాళ్ల మొత్తానికి సంబంధించి కూడా బీసీసీఐ స్పష్టమైన నిబంధన విధించింది. దీని ప్రకారం తొలి రిటెన్షన్ ఆటగాడికి రూ.18 కోట్లు, రెండో ఆటగాడికి రూ.14 కోట్లు, మూడో ఆటగాడికి రూ.11 కోట్లు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే ఏదైనా ఫ్రాంచైజీ మరో ఇద్దరిని కూడా కొనసాగించాలనుకుంటే మాత్రం.. నాలుగో ప్రాధాన్య ప్లేయర్‌కు కూడా రూ.18 కోట్లు ఇవ్వాల్సి ఉంటుంది. అలాగే ఐదో ఆటగాడికి రూ.14 కోట్లు ఇవ్వక తప్పదు. దీన్ని బట్టి రిటెన్షన్ పాలసీని పూర్తి స్థాయిలో వినియోగించుకున్న జట్టు రూ.75 కోట్లు వేలానికి ముందే ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇదంతా కూడా తమ సాలరీ క్యాప్ రూ.120 కోట్ల నుంచి వినియోగించుకోవాల్సి ఉంటుంది. అంటే.. మిగిలిన రూ.45 కోట్లతోనే ఆర్‌టీఎం, ఇతర 15 మంది ప్లేయర్లను కొనుగోలు చేయాలి. దీంతో స్టార్ ఆటగాళ్లతో కూడిన ఆయా ఫ్రాంచైజీలు ఆచితూచి నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది.

ఆటగాళ్లకు అదనపు ఆదాయం

ఐపీఎల్ ఆటగాళ్లకు బీసీసీఐ నుంచి మరో తీపికబురు అందింది. తొలిసారిగా ఈ లీగ్‌లో ఆడే ఆటగాళ్లకు కూడా మ్యాచ్ ఫీజు కింద ప్రతీ మ్యాచ్‌కు రూ.7.50 లక్షలు ఇవ్వనున్నట్టు బోర్డు కార్యదర్శి జైషా ప్రకటించాడు. ఇందు కోసం ప్రతీ ఫ్రాంచైజీకి రూ.12.60 కోట్లను కేటాయిస్తున్నట్టు తెలిపాడు. ఒకవేళ సీజన్‌లో ప్రతీ మ్యాచ్ ఆడిన ప్లేయర్‌కు కోటి 5 లక్షల రూపాయలు అందుకుంటాడు. ఇది తన ఫ్రాంచైజీ అందించే కాంట్రాక్ట్ మొత్తానికి అదనం కానుంది. మరోవైపు వేలంలో తక్కువ ధర పలికి.. మ్యాచ్‌ల్లో అద్భుత ప్రదర్శన కనబరిచే ఆటగాళ్లకు బోర్డు తాజా నిర్ణయం ఆర్థికంగా లబ్ధి చేకూర్చనుంది.

అన్‌క్యాప్డ్ ప్లేయర్ కూడా..

2021 తర్వాత అన్‌క్యాప్డ్ ప్లేయర్ రూల్‌ను కూడా అమలు చేయనున్నారు. గత ఐదేళ్ల కాలంలో అంతర్జాతీయ క్రికెట్ ఆడని స్వదేశీ ఆటగాడిని ఈ రూల్ కింద పరిగణించవచ్చని పేర్కొంది. అలాగే బోర్డు సెంట్రల్ కాంట్రాక్ట్ కూడా ఉండకూడదు. ఈ రూల్ ప్రకారం ఎంఎస్ ధోనీని సీఎస్‌కే అన్‌క్యాప్డ్ ప్లేయర్ కింద జట్టులోకి తీసుకునే అవకాశం ఉంది. అతడికి కేవలం రూ.4 కోట్లు ఇవ్వాల్సి ఉంటుంది.

ఒక్క బంతీ పడలేదు..



రెండో రోజూ వర్షార్పణం
బంగ్లాతో భారత్ రెండో టెస్టు

కాన్పూర్: తొలిరోజు 35 ఓవర్ల ఆటకు అనుమతించిన వరుణుడు రెండోరోజు శనివారం ఆ కాస్త అవకాశాన్ని కూడా ఇవ్వలేదు. ఉదయం నుంచి కురిసిన వర్షంతో గ్రీన్‌పార్క్ మైదానం చిత్తడిగా మారింది. దీంతో ఒక్క బంతీ పడకుండానే ఆట రద్దయ్యింది. మధ్యాహ్నం 2 గంటల వరకు వేచి చూసినా గ్రౌండ్ ఆటకు అనుకూలంగా లేకపోవడంతో అంపైర్లు కీలక నిర్ణయం తీసుకున్నారు. భారత్‌లో 2015 బెంగళూరు టెస్టు తర్వాత ఓ రోజు ఆట పూర్తిగా రద్దు కావడం ఇదే తొలిసారి. ఉదయం పది గంటలకు వర్షం ఆగినా మరో గంట తర్వాత మళ్లీ కురవడంతో కవర్లను అలాగే ఉంచాల్సి వచ్చింది. మధ్యలో సూపర్‌సాపర్లతో నీటిని తోడేసే ప్రయత్నం జరిగినా ఫలితం లేకపోయింది. మధ్యాహ్నం మరోసారి చిరుజల్లులు కురియడంతో 2 గంటలకు అంపైర్లు ఆటను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. మూడో రోజు ఆదివారం కూడా వర్షం ఇబ్బంది కలిగించవచ్చు. ఇక ఈ మ్యాచ్‌లో బంగ్లా తొలి ఇన్నింగ్స్‌లో 107/3 పరుగులతో కొనసాగుతోంది.



నిరంకుశ ఉష!

- ఐఓఏ సభ్యుల ఆరోపణ
- జోక్యం చేసుకోవాలని ఐఓసీకి లేఖ

న్యూఢిల్లీ: భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) చీఫ్ పీటీ ఉష, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుల మధ్య నడుస్తున్న యుద్ధం కొత్త మలుపు తీసుకుంది. ఐఓఏ వ్యవహారాల్లో పీటీ ఉష నిరంకుశంగా వ్యవహరిస్తోందని 12 మంది ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఈసీ) సభ్యులు అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) సీనియర్ అధికారి జెరోమ్ పోయివేకి శుక్రవారం లేఖ రాయడం సంచలనం రేపింది. ఐఓఏను ప్రజాస్వామ్యయుతంగా నడిపేలా చర్యలు తీసుకోవాలని ఆ సభ్యులు జెరోమ్‌కు రాసిన లేఖలో కోరారు. ఐఓఏ సీఈవో పదవి నుంచి రఘురామ్ అయ్యర్‌ను తొలగించాలని ఈసీ సభ్యులు పట్టుబడుతుండగా..ఉష అందుకు నిరాకరిస్తోంది. ఇదే ఇప్పుడు ఉషపై సభ్యుల తిరుగుబాటుకు ప్రధాన కారణమైంది. ఐఓఏ రాజ్యాంగం ప్రకారమే అయ్యర్‌ను నియమించినట్టు ఉష స్పష్టంజేస్తోంది. అంతేకాదు..అయ్యర్ నియామకానికి ఆమోదం తెలుపుతామని గతంలో జెరోమ్‌కు ఆ 12 మంది ఈసీ సభ్యులు హామీ ఇచ్చిన విషయాన్ని కూడా ఉష గుర్తు చేసింది. ఉషను వ్యతిరేకిస్తున్న వారిలో ఐఓఏ సీనియర్ ఉపాధ్యక్షుడు అజయ్ పటేల్, ఉపాధ్యక్షులు రాజ్యలక్ష్మీ దేవ్, గగన్ నారంగ్‌తోపాటు సభ్యులు రోహిత్ రాజ్‌పాల్, డోలా బెనర్జీ, యోగేశ్వర్ దత్ తదితరులున్నారు.

గాయత్రి జోడీకి కాంస్యం



మకావు: తెలుగమ్మాయి పుల్లెల గాయత్రి-ట్రీసా జాలీ జోడీకి మకావు ఓపెన్ సూపర్ 300 టోర్నీలో కాంస్య పతకం సాధించింది. శనివారం జరిగిన సెమీఫైనల్లో గాయత్రి ద్వయం 17-21, 21-16, 10-21తో చైనీస్ తైపీ జోడీ హిస్సీ షాన్-హుంగ్ ఎన్ జు (చైనీస్ తైపీ) చేతిలో ఓటమిపాలై కంచు పతకంతో సరిపెట్టుకుంది.



శిరీష కంచు మోత

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ ఓపెన్ అండర్-23 అథ్లెటిక్స్ పోటీల్లో శ్రీకాకుళం జిల్లాకు చెందిన యువ అథ్లెట్ ముగడ శిరీష కంచు మోత మోగించింది. బిహార్‌లోని పట్నాలో శనివారం జరిగిన మహిళల 400 మీటర్ల రేసులో శిరీష మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం అందుకుంది.

పరాజయం అంచున కివీస్

గాలె: శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టులో ఫాలో ఆన్ ఆడుతున్న న్యూజిలాండ్ ఓటమి దిశగా పయనిస్తోంది. లెఫ్టామ్ స్పిన్నర్ ప్రభాత్ జయసూర్య (6/42) మరోసారి అద్భుత బౌలింగ్‌తో కివీస్ వెన్నువిరిచాడు. దీంతో తొలి ఇన్నింగ్స్‌లో ఆ జట్టు 88 పరుగులకే కుప్పకూలింది. ఇక కివీస్ 514 రన్స్ వెనుకంజలో ఉండడంతో లంక జట్టు ప్రత్యర్థిని ఫాలోఆన్ ఆడించింది. మూడోరోజు శనివారం వెలుతురులేమితో ఆట ముగిసేసరికి కివీస్ రెండో ఇన్నింగ్స్‌లో 199/5 స్కోరుతో ఉంది. కాన్వే (61), విలియమ్సన్ (46) రాణించగా.. క్రీజులో బ్లండెల్ (47), ఫిలిప్స్ (32) పోరాడుతున్నారు. నిషాన్‌కు 3 వికెట్లు దక్కాయి. కివీస్ విజయానికి మరో 315 పరుగుల దూరంలో ఉంది. లంక తొలి ఇన్నింగ్స్‌ను 602/5 వద్ద డిక్లేర్ చేసింది.



- నిలకడగానే ఆరోగ్యం
- మూడు నెలలు ఆటకు దూరం?

కారు బోల్తా.. క్రికెటర్ ముషీర్‌కు గాయం

లఖ్‌నవూ: ముంబై దేశవాళీ క్రికెటర్, భారత బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ సోదరుడు ముషీర్ ఖాన్ (19) రోడ్డు ప్రమాదంలో స్వల్పంగా గాయపడ్డాడు. అయితే, ప్రస్తుతం అతడి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. మంగళవారం నుంచి జరిగే ఇరానీ కప్ మ్యాచ్ కోసం తన తండ్రి నౌషాద్ ఖాన్‌తో కలసి ముషీర్.. అజమ్‌ఘర్ నుంచి కారులో బయల్దేరాడు. అయితే, వారు ప్రయాణిస్తున్న వాహనం లఖ్‌నవూ శివార్లలో డివైడర్‌ను ఢీకొని పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో ముషీర్‌కు పెద్దగా గాయాలు కాకపోయినా.. మెడ భాగంలో ఫ్రాక్చరైనట్టు అతనికి చికిత్స అందిస్తున్న మేదాంత ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. కోలుకోవడానికి మూడు నెలలు పడుతుందని వెల్లడించాయి. ఫ్రాక్చర్ కావడంతో ఇరానీ కప్‌తోపాటు రంజీ ట్రోఫీ కొన్ని మ్యాచ్‌లకు ముషీర్ దూరం కానున్నాడు. ముషీర్ తండ్రి నౌషాద్ కూడా చిన్నపాటి గాయాలతో బయటపడ్డాడు.



రంగంలోకి సిట్!

(మొదటి పేజీ తరువాయి)

గోపీనాథ్ జెట్టి, కడప ఎస్పీ హర్షవర్ధన్ రాజు, తిరుపతి అడ్మిన్ ఏఎస్పీ వెంకటరావు, డీఎస్పీలు సీతారామారావు, శివనారాయణ స్వామి, అన్నమయ్య జిల్లా ఎస్‌బీ సీఐ సత్యనారాయణ, విజయవాడ సీఐ ఉమా మహేశ్వర్, చిత్తూరు జిల్లా కల్లూరు సీఐ సూర్యనారాయణ సభ్యులుగా 'సిట్' ఏర్పడిన సంగతి తెలిసిందే. శనివారం మధ్యాహ్నం విజయవాడ నుంచి వందేభారత్ రైలులో సిట్ అధికారులు తిరుపతి చేరుకున్నారు. అక్కడి నుంచి నేరుగా తిరుమలకు వెళ్లి... శ్రీవారిని దర్శించుకున్నారు. ఆపై టీటీడీ కార్యనిర్వహణాధికారితోపాటు ఇతర అధికారులతో సమావేశమయ్యారు. నెయ్యి కొనుగోలుకు సంబంధించిన ప్రాథమిక సమాచారం సేకరించారు.

మూడు బృందాలుగా 'సిట్'

తిరుపతిలోని పోలీసు అతిథి గృహంలో సిట్ అధికారులు శనివారం రాత్రి పొద్దుపోయేదాకా సమావేశమయ్యారు. దర్యాప్తు విధి విధానాలపై చర్చించారు. 'సిట్'ను మూడు బృందాలుగా విభజించి... వివిధ కోణాల్లో దర్యాప్తు చేయాలని నిర్ణయించుకున్నారు. తిరుమలలో నెయ్యి వినియోగం, 2019కి ముందు లడ్డూల నాణ్యత, 2019-24 మే నెల దాకా ఎలా ఉండింది? ఇప్పుడు పరిస్థితి ఏమిటి? తిరుమల లడ్డూ తయారీకి 2019కు మునుపు ఏయే పదార్థాలను ఎంతెంత పరిమాణంలో వాడేవారు? తర్వాత ఏమైనా మార్పులు జరిగాయా? నెయ్యి సేకరణ టెండర్ల నిబంధనల సడలింపు, ఏఆర్ డెయిరీకి ఆర్డర్ ఇవ్వడానికి వీలుగా నిబంధనలు సడలించారా... అన్న అంశాలపై ఒక బృందం కూపీ లాగనుంది. రెండో టీమ్... అచ్చంగా ఏఆర్ డెయిరీపైనే దృష్టి కేంద్రీకరించనుంది. ఆ డెయిరీ నేపథ్యం ఏమిటి? దాని సామర్థ్యం, నెయ్యి కల్తీ ఎక్కడ జరిగింది? దానికి బాధ్యులెవరు? తెరవెనుక సూత్రధారులెవరు? అన్న అంశాలను పరిశీలించనుంది. ఇక మూడో బృందం... తిరుపతిలో టీటీడీ మార్కెటింగ్ కార్యాలయం, గోదాములు, ల్యాబ్‌పై ఫోకస్ పెట్టనుంది. అందులో భాగంగా గత ఐదేళ్లలో నెయ్యి సరఫరా టెండర్లు ఎవరెవరికి ఇచ్చారు? ఎక్కడెక్కడి నుంచి కొనుగోలు చేశారు? సరఫరా చేసిన సంస్థల నేపథ్యం, వివరాలు, టెండర్లు నిర్వహించింది ఎవరు? గత ఐదేళ్లలో నెయ్యి నాణ్యతపై ల్యాబ్ నుంచీ వచ్చిన రిపోర్టులు, గత మూడు నెలల్లో వచ్చిన రిపోర్టులను పరిశీలిస్తారు.

ఫైళ్ల పరిశీలన...

నెయ్యి కొనుగోలు టెండర్లు, సరఫరాకు సంబంధించిన ఫైళ్లను సిట్ అధికారులు తెప్పించుకుని పరిశీలించారు. రెగ్యులర్ నెయ్యి కొనుగోలు టెండర్లలో పాల్గొన్న కంపెనీలు, ఆ తర్వాత రివర్స్ టెండర్ నిర్వహించిన విధానం, బిడ్‌లు వేసిన కంపెనీలు, టెండర్ దక్కించుకున్న కంపెనీలు సమర్పించిన డాక్యుమెంట్లను పరిశీలించారు. తిరుమలకు నెయ్యి లోడ్‌తో వచ్చిన లారీలు, వాటి రిజిస్ట్రేషన్ నెంబర్లు, ఇతర కీలక సమాచారం కూడా సేకరించినట్లు తెలిసింది. తమిళనాడులోని దుండిగల్‌లో ఉన్న ఏఆర్ ఫుడ్స్‌కు నెయ్యి కాంట్రాక్టు దక్కగా, నెల్లూరులోని శ్రీవైష్ణవి డెయిరీ నుంచి నెయ్యి ట్యాంకర్లు తిరుమలకు ఎందుకొచ్చాయని ఆరా తీస్తే అసలు విషయాలు వెలుగు చూస్తాయని అధికారవర్గాలు చెబుతున్నాయి.

వినతులు 4396 పరిష్కారం 3327



శనివారం టీడీపీ కార్యాలయంలో దివ్యాంగుల నుంచి వినతులు స్వీకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

- చంద్రబాబు ఆదేశాలతో సత్వర న్యాయం
- మూడున్నర నెలల్లో 75 శాతం పరిష్కారం

అమరావతి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక మూడున్నర నెలల్లో సీఎం చంద్రబాబుకు వ్యక్తిగతంగా ప్రజల నుంచి 4,396 వినతులు అందాయి. ఇందులో 75శాతం పరిష్కారమైనట్టు అధికార వర్గాలు పేర్కొన్నాయి. చంద్రబాబుకు అందిన వినతులపై అధికార వర్గాలు ఒక నివేదికను తయారు చేశాయి. ఈ నివేదిక ప్రకారం 3,327 వినతులు పరిష్కారమయ్యాయి. వినతులు పరిష్కారం అయినట్లుగా వివిధ శాఖల నుంచి వచ్చిన సమాచారంపై సీఎంవో పరిశీలన నిర్వహించింది. ఆయా దరఖాస్తుదారులకు ఫోన్ చేసి కనుక్కొన్నారు. మొత్తం 2.5వేల వినతులపై ఈ ఆడిట్ జరిగింది. ఇందులో 1,400 మంది సంతృప్తి వ్యక్తం చేశారు. మరో 700 మంది అసంతృప్తి వ్యక్తం చేయగా, 400 మంది ఫోన్ తీయలేదు. దీంతో వీటిపై మరోసారి పరిశీలన జరిపారు. మొత్తంగా 150 వినతులకు సంబంధించి పరిష్కారం కాకుండానే అయినట్లుగా చూపించినట్లు తేలింది. వీటి పరిష్కారం కోసం మరోసారి ఆయా శాఖలకు పురమాయించారు. ఇందులో 50వరకూ పరిష్కారమయ్యాయి. రాష్ట్ర సచివాలయానికి సమీపంలో ఉండటంతో గుంటూరు (429), ఎన్టీఆర్ జిల్లా(358)ల నుంచి ఎక్కువ వినతులు వచ్చాయి. 200కు పైగా వినతులు వచ్చిన జిల్లాల్లో తిరుపతి, పల్నాడు, ప్రకాశం, చిత్తూరు, కడప, నెల్లూరు ఉన్నాయి. 100లోపు వినతులు అందిన జిల్లాల్లో అనకాపల్లి, అంబేడ్కర్ కోనసీమ, సత్యసాయి, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం జిల్లాలు ఉన్నాయి. తమ సమస్యలు పరిష్కారం అయ్యాయని సంతృప్తి వ్యక్తమైన జిల్లాల్లో గుంటూరు టాప్‌లో ఉంది.

3 గంటలు నిలబడిన చంద్రబాబు

సీఎం చంద్రబాబు శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయాన్ని సందర్శించినప్పుడు ఆయనకు వినతులు ఇవ్వడానికి వచ్చినవారితో కార్యాలయం కిక్కిరిసిపోయింది. వినతులు తీసుకోవడానికి ఆయన 3గంటల పాటు నిలబడే ఉన్నారు. దివ్యాంగులు, వృద్ధుల నుంచి కార్యాలయం ప్రధాన ద్వారం వద్దే వినతులు తీసుకొన్నారు. కొంతమందిని కార్యాలయం లోపల కలిసి వారితో మాట్లాడి వినతులు స్వీకరించారు. తర్వాత ఆవరణలో క్యూలైన్లలో ఉన్న వారి వద్దకు తానే వెళ్లి ఒకరి తర్వాత మరొకరి నుంచి తీసుకొన్నారు. ఉదయం 11.30కు కార్యాలయం లోపల అడుగుపెట్టిన ఆయన 2.30 తర్వాత వెళ్లిపోయారు. ఇంకా పెద్దసంఖ్యలో సందర్శకులు మిగిలిపోవడంతో వారినుంచి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు వినతులు తీసుకొన్నారు.

పోలీసు అధికారుల తీరుపై ఫిర్యాదు

కార్యాలయంలోని పార్టీ నేతలతో చంద్రబాబు కొద్దిసేపు సమావేశమయ్యారు. అనంతపురం జిల్లాకు చెందిన పోలీసు అధికారుల తీరుపై కొందరు నేతలు ఆయనకు ఫిర్యాదు చేశారు. 'అనంతపురం జిల్లాలో ఒక ఆలయంలో రథాన్ని వైసీపీకి చెందిన వారు తగులబెట్టారు. విచారణ పూర్తి కాకముందే ఆ ఘటనలో రాజకీయ ప్రమేయం లేదని పోలీసు అధికారులు ప్రకటనలు ఇచ్చారు. ఆ ఘటన రాజకీయ కోణంలోనే జరిగింది. అధికారుల అత్యుత్సాహాన్ని తగ్గించాలి' అని కోరారు. ఏం జరిగిందో తెలుసుకొంటానని చంద్రబాబు వారితో చెప్పారు. కొందరు ఎమ్మెల్యేల తీరుతో నియోజకవర్గాల్లో సమస్యలొస్తున్నాయని నాయకులు చెప్పారు. పార్టీపరంగా దానిపై సమాచారం తెప్పిస్తున్నామని, ఆ తర్వాత వారిని పిలిపించి మాట్లాడతానని చంద్రబాబు అన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, పార్టీ నేతలు అశోక్ బాబు, వర్ల రామయ్య, పట్టాభి, రఫీ తదితరులు పాల్గొన్నారు.

భూమిని కబ్జా చేశారు

- సీఎంకు వైసీపీ బాధితుల మొర

టీడీపీ కేంద్ర కార్యాలయంలో సీఎం చంద్రబాబు ప్రజల నుంచి శనివారం అర్జీలు స్వీకరించారు. సాయం కోసం వచ్చిన వారి సాధకబాధకాలను ఓపిగ్గా విన్నారు. తన దృష్టికి వచ్చిన తీసుకొచ్చిన సమస్యలు, ఫిర్యాదులను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. పల్నాడు జిల్లా పమిడిమర్రుకు చెందిన గుర్రపుశాల శ్రీనివాసరావు అనే వైసీపీ బాధితుడు అర్జీ ఇస్తూ.. తన తండ్రి వారసత్వంగా తమ అన్నదమ్ములిద్దరికీ రెండెకరాల చొప్పున భూమి ఉందని, గత ప్రభుత్వంలో వైసీపీ నేతలు ఆ భూమిని ఆక్రమించి, దొంగ పాసుపుస్తకాలు సృష్టించారని ఫిర్యాదు చేశారు. పొలం గురించి అడుగుతుంటే తమ పైనే దాడికి దిగుతున్నారని వాపోయారు.

లడ్డూపై రేపు సుప్రీంకోర్టులో విచారణ

- ఐదు పిటిషన్లూ ఒకేసారి విననున్న బెంచ్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): తిరుపతి లడ్డూ అపవిత్రం అయిన వ్యవహారంపై సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్లు సోమవారం విచారణకు రానున్నాయి. న్యాయమూర్తులు జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌తో కూడిన బెంచ్ ఎదుట ఈ పిటిషన్లపై విచారణ జరగనుంది. టీటీడీ లడ్డూల తయారీలో ఉపయోగించే నెయ్యిలో ఎద్దు, పంది తదితర జంతువుల కొవ్వు కలిపారంటూ జరుగుతున్న ప్రచారంపై కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరగాలని దాదాపు ఐదుగురు పిటిషన్లు దాఖలు చేశారు. ఆలయాల నిర్వహణలో మరింత జవాబుదారీ విధానం రావాలని కూడా ఒకరిద్దరు పిటిషన్‌దారులు కోరారు. లడ్డూలు అపవిత్రమైన సంఘటనపై విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తి లేదా విశ్రాంత హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలో ఒక కమిటీని నియమించి దర్యాప్తు జరపాలని సుదర్శన్ న్యూస్ టీవీ సంపాదకుడు సురేశ్ ఖండేరావు పిటిషన్ దాఖలు చేశారు. లడ్డూల కల్తీపై ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ద్వారా దర్యాప్తు జరిపించాలని హిందూసేన అధ్యక్షుడు సూర్జిత్‌సింగ్ యాదవ్ మరో పిటిషన్ దాఖలు చేశారు. ప్రభుత్వ సంస్థలు నిర్వహిస్తున్న హిందూ ఆలయాల్లో జవాబుదారీ పాలన అవసరమని, ఆలయాలపై ప్రభుత్వ యంత్రాంగం పట్టు లేకుండా చూడాలని చరిత్రకారుడు డాక్టర్ విక్రమ్ సంపత్, ప్రవచనకర్త దుష్యంత్ మరో పిటిషన్ దాఖలు చేశారు. ఇక.. సీనియర్ బీజేపీ నేత సుబ్రమణ్య స్వామి దాఖలు చేసిన పిటిషన్‌లో కోర్టు పర్యవేక్షణలో కమిటీని నియమించి దర్యాప్తు జరిగేలా చూడాలని కోరారు. చివరగా పిటిషన్ దాఖలు చేసిన వైసీపీ రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి కూడా కోర్టు పర్యవేక్షణలో స్వతంత్ర దర్యాప్తు జరగాలని లేదా నిపుణులను నియమించి విశ్రాంత న్యాయమూర్తి పర్యవేక్షణలో విచారణ జరిపించాలని కోరారు. ఈ పిటిషన్లు అన్నింటిపైనా సోమవారం సుప్రీంకోర్టు విచారణ జరపనుంది.



సీఎం చంద్రబాబుకు రూ.కోటి విరాళం చెక్కును అందజేస్తున్న జీవీఆర్ ఇన్‌ఫ్రా ప్రతినిధులు రామచంద్రరాజు, గంగాప్రసాద్

వరద బాధితులకు అభయ హస్తం

- జీవీఆర్ ఇన్‌ఫ్రా కోటి, సీఎంఆర్ గ్రూప్ 50లక్షల విరాళం

అమరావతి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి జీవీఆర్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్, సీఎంఆర్ గ్రూప్ సంస్థలు భారీగా విరాళాలు అందజేశాయి. శనివారం ఉండవల్లిలోని నివాసంలో సీఎం చంద్రబాబును కలిసిన జీవీఆర్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ తరఫున ఆ సంస్థ ప్రతినిధులు రామచంద్రరాజు, గంగాప్రసాద్ రూ.కోటి చెక్కు, సీఎంఆర్ గ్రూప్ చైర్మన్ మావూరి వెంకట రమణ రూ.50లక్షల చెక్కు అందజేశారు.

స్వర్ణాంధ్ర సాధనకు సూచనలివ్వండి: సీఎం

స్వర్ణాంధ్ర సాధనకు సూచనలివ్వాలంటూ సీఎం చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు. "2047 నాటికి మెరుగైన వృద్ధిరేటు సాధించి, 43వేల పైచిలుకు తలసరి ఆదాయంతో భారతదేశాన్ని ముందుకు నడిపించడమే మన లక్ష్యం. ఇందుకనుగుణంగా 'స్వర్ణాంధ్రప్రదేశ్-2047' వైపు ప్రయాణాన్ని ప్రారంభించాం. ప్రకాశవంతమైన ఆంధ్రప్రదేశ్ రూపకల్పనకు పౌరులుగా మీ విలువైన సూచనలను ఆహ్వానిస్తున్నాం" అని పేర్కొన్నారు. ప్రజల అభిప్రాయాలు, సూచనలను swamandhra.ap.gov.in ద్వారా పంపవచ్చని, సూచనలిచ్చిన వారి అభినందనలతో ఈ-సర్టిఫికెట్ కూడా అందుకోవచ్చని వివరించారు.

గుర్రం జాషువాకు సీఎం నివాళి

సంఘ సంస్కరణే లక్ష్యంగా, కులవివక్ష రూపుమాపడానికి కృషి చేసిన 'పద్మభూషణ్' గుర్రం జాషువా జయంతి సందర్భంగా 'సీఎం చంద్రబాబు శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో జాషువా చిత్రపటానికి పూలమాలలేసి, ఘన నివాళులర్పించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు అనిత, బాలవీరాంజనేయస్వామి, పొలిట్ బ్యూరో సభ్యుడు జనార్దన్, ఎమ్మెల్సీ అశోక్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు చేయూతనిద్దాం: లూథ్రా

న్యూఢిల్లీ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో వరద బాధితులకు చేయూతనిద్దామని సుప్రీంకోర్టు అడ్వకేట్స్ ఆన్ రికార్డ్ అసోసియేషన్ వెల్ఫేర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ, సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా కోరారు. తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలు చేపడుతున్న సహాయక చర్యలకు మద్దతుగా నిలిచేందుకు సహకరించాలని ట్రస్ట్‌సభ్యులకు పిలుపునిచ్చారు. సభ్యులు ట్రస్టుకుగానీ, లేదా రెండు రాష్ట్రాల సీఎంఆర్ఎఫ్, సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ)కి నేరుగా గానీ ఆర్థిక సాయం చేయవచ్చని స్పష్టం చేశారు.

చేనేత కొందాం.. నేతన్నలకు అండగా ఉందాం

- సీఎం సతీమణి భువనేశ్వరి పిలుపు

అమరావతి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): 'రాబోయే పండుగలకు చేనేత వస్త్రాలు కొందాం..పండుగల్లో వాటిని ధరించుదాం.. నూలుపోగుతో అద్భుతాలు సృష్టించే నేతన్నలకు మనమంతా అండగా ఉండి, ఆయా కుటుంబాలు ఆనందంగా పండుగ చేసుకునేలా చేద్దాం' అంటూ ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ, సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి పిలుపునిచ్చారు. తెలుగు రాష్ట్రాల్లోని చేనేత కుటుంబాలు ఆనందంగా ఉండాలని శనివారం 'ఎక్స్' వేదికగా ఆకాంక్షించారు.

బాబాయి హత్య జరిగిన రోజు మానవత్వం గుర్తుకు రాలేదా..!

- తిరుమలకు వెళ్లదలుచుకోకే కుంటిసాకులు
- టీటీడీ బోర్డులో దళితులను జగన్ ఎందుకు నియమించలేదు?: హోం మంత్రి అనిత



అమరావతి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ నాయకుడు జగన్మోహన్‌రెడ్డి కొత్తగా మానవత్వం గురించి మాట్లాడుతున్నారు. తన బాబాయి వివేకా హత్య జరిగిన రోజు ఆయనకు మానవత్వం గుర్తుకు రాలేదా? బాబాయి ఫొటోను వెనక తగిలించుకొని ఆయన మానవత్వం గురించి మాట్లాడితే బాగుంటుంది' అని హోంమంత్రి వంగలపూడి అనిత వ్యాఖ్యానించారు. శనివారం ఆమె ఇక్కడ టీడీపీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'తిరుమలకు జగన్ వెళ్లదల్చుకోలేదు. దానిని కప్పిపుచ్చుకోవడానికి ఆఖరి నిమిషంలో రద్దు చేసుకొన్నట్లు కుంటిసాకులు చెబుతున్నారు. జగన్ వస్తే అడ్డుకొంటామని కొందరు పీఠాధిపతులు ప్రకటనలు చేశారు. ఈ పరిస్థితుల్లో ఉద్రిక్తతలను నివారించడానికి పోలీస్ శాఖ సెక్షన్ 30 కింద అక్కడి వైసీపీ నేతలకు నోటీసులు ఇచ్చింది. తిరుమలకు రావద్దని జగన్‌కు మా శాఖ ఏ నోటీసు ఇవ్వలేదు. తిరుపతిలో ఒక్క వైసీపీ నాయకుడినీ అరెస్టు చేయలేదు. గృహ నిర్బంధం చేయలేదు. చంద్రబాబును విశాఖ విమానాశ్రయంలో ఆపినట్లు జగన్‌ను ఆపాలని మేం అనుకోలేదు. ఆయన వస్తే అన్ని మర్యాదలతో స్వాగతం లభించేది. అతిథిగృహంలో ఆయనను అధికారులు కలిసి డిక్లరేషన్‌పై సంతకం తీసుకొని స్వామివారి దర్శనానికి తీసుకొని వెళ్లేవారు. డిక్లరేషన్‌పై సంతకం చేస్తే తన చెల్లికి, తల్లికి పట్టిన గతే తనకూ భారతక్క నుంచి పడుతుందనే ఆయన దాని జోలికి రావడం లేదు' అని అనిత చమత్కరించారు. 'ప్రసాదం కల్తీ గురించి వివాదం వస్తే ఆయన దళితుల గురించి మాట్లాడుతున్నారు. తన హయాంలో నియమించిన టీటీడీ పాలక మండలిలో ఒక్క దళితుడినీ ఎందుకు నియమించలేకపోయారు? మా ప్రభుత్వంలో డోలా బాల వీరాంజనేయస్వామిని సభ్యునిగా పెట్టాం. అదే పని జగన్ ఎందుకు చేయలేకపోయారు? డిక్లరేషన్‌పై సంతకం పెట్టాలంటే దేశంపై బురద చల్లుతున్నందుకు ఆయనను ప్రాసిక్యూట్ చేయాలి. ప్రభుత్వ అధికారులతో సిట్ వేయడం ఏమిటని జగన్ ప్రశ్నిస్తున్నారు. ఆయన మీడియా ఉద్యోగులతో వేయాలా? ఇదే అధికారులు ఆయన సీఎంగా ఉన్నప్పుడు కూడా విధుల్లో ఉన్నారు' అని మంత్రి అన్నారు.

సామాన్య భక్తులు ఇబ్బందిపడతారనే జగన్ తిరుమల పర్యటన రద్దు: బొత్స



విశాఖపట్నం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వెళ్లే సామాన్య భక్తులు ఇబ్బందిపడతారనే మాజీ సీఎం జగన్ తన పర్యటన రద్దు చేసుకున్నారని శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ అన్నారు. ఆయన విశాఖలో శనివారం విలేకరులతో మాట్లాడారు. 'సీఎం చంద్రబాబు తన స్వార్థ ప్రయోజనాల కోసమే తిరుపతి లడ్డూలో కల్తీ జరిగిందని ఆరోపణ చేశారు. కల్తీ జరిగినట్టు ఆధారాలు ఉంటే థర్డ్ పార్టీ విచారణ కోరుతూ హైకోర్టు, సుప్రీంకోర్టు, సీబీఐకి ఎందుకు లేఖ రాయలేదు? తిరుపతి లడ్డూను రాజకీయాల్లోకి లాగిన అంశాన్ని వ్యక్తిగత విషయంగా తీసుకుని ప్రజలను చల్లగా చూడాలని శ్రీవారిని ప్రత్యక్షంగా కోరేందుకు జగన్ తిరుపతి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. కాని... అనుమతి లేదని, వెంట ఎవరూ ఉండకూడదన్న షరతులతో పోలీసులు నోటీసులు జారీచేశారు. తిరిగి, ఎవరు వద్దన్నారు? అంటూ చంద్రబాబు ప్రశ్నించడం విడ్డూరంగా ఉంది. స్టీల్ ప్లాంటులో 4వేల మంది కాంట్రాక్టు కార్మికులను తొలగిస్తే సమాధానం చెప్పేవారే లేరు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.25వేల కోట్లు అప్పు చేశారు. సంపద సృష్టించడం అంటే అప్పులు చేయడమా?' అని బొత్స ఎద్దేవా చేశారు.

'సిట్' తేల్చే వరకు లడ్డూపై చర్చవద్దు: రామకృష్ణ

ఆలూరు, సెప్టెంబరు 28: తిరుపతి శ్రీవారిని రాజకీయ వివాదంలోకి లాగవద్దని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. శనివారం కర్నూలు జిల్లాలోని ఆలూరులో ఆయన మాట్లాడారు. లడ్డూ నాణ్యతపై ప్రభుత్వం స్పందించి సిట్‌ను నియమించిందన్నారు. నివేదిక వచ్చే వరకు ఈ విషయానికి ఫుల్‌స్టాప్ పెట్టాలని సీఎం చంద్రబాబును కోరారు. కోట్లాది మంది భక్తుల మనోభావాలతో చెలగాటం వద్దని సూచించారు. రాష్ట్రంలో ఏ సమస్యలు లేనట్లు తిరుపతి లడ్డూపైనే మాట్లాడడం ఏమిటని ప్రశ్నించారు.

ఇదీ కలాం విజ్ఞత!

రెండుసార్లు తిరుమలకు.. రాష్ట్రపతి హోదాలోనే ఒకసారి

- డిక్లరేషన్ ఇచ్చాకే స్వామి దర్శనం
- జగన్‌కు మాత్రం ఎందుకు భేషజం?

అమరావతి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అన్యమతస్తులు తిరుమల వేంకటేశ్వరుడిని దర్శించుకోవాలంటే నిబంధనల ప్రకారం ఇవ్వాల్సిన డిక్లరేషన్‌పై మాజీ సీఎం వైఎస్ జగన్ నానాయాగీ చేశారు. ఇదేం దేశం.? ఇదేం హిందూయిజం.? ఎలాంటి లౌకికవాదమిది.? అంటూ గగ్గోలుపెట్టారు. అయితే గతంలో రాష్ట్రపతిగా ఉన్న సమయంలో మహ్మదీయుడైన ఏపీజే అబ్దుల్ కలాం సైతం డిక్లరేషన్ ఇచ్చి ఆ కలియుగ దైవాన్ని దర్శించుకున్నారు. దేశంలో గొప్ప మేధావిగా పేరొందిన ఆయన రాష్ట్రపతి హోదాలో ఉన్నా.. వేంకటేశ్వరుడి దర్శనం, సంప్రదాయాలు, నిబంధనల పాటింపు విషయంలో విజ్ఞత ప్రదర్శించారు. అలాంటిది డిక్లరేషన్ విషయంలో జగన్ ఎందుకు రచ్చ చేస్తున్నారనే ప్రశ్నలు భక్తుల నుంచి వస్తున్నాయి. భారతరత్న, దేశ మిస్సైల్ మ్యాన్‌గా గుర్తింపు పొందిన అబ్దుల్ కలాం కంటే జగన్ ఎక్కువా? ఏం గొప్ప? అని ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రానికి సీఎంగా చేసిన వ్యక్తికి ఆ మాత్రం విజ్ఞత లేదా? అని నిలదీస్తున్నారు. కలాం తొలుత రాష్ట్రపతిగా ఉన్న సమయంలో 2003 నవంబర్ 20న, తర్వాత 2009 మార్చి 19వ మరోసారి స్వామివారి దర్శనం చేసుకున్నారు. రాష్ట్రపతిగా ఉన్న సమయంలో వేంకటేశ్వరస్వామిని దర్శనం చేసుకోవాలని భావించిన కలాం.. తన కార్యాలయం అధికారిని పిలిపించి తిరుమలలో ఎలాంటి సంప్రదాయాలు పాటించాలి? ఆచార వ్యవహారాలు ఏంటి? అనే వివరాలు తెలుసుకున్నారు. సదరు అధికారి అప్పటి టీటీడీ ఈవోను సంప్రదించి, ఆయన చెప్పిన వివరాలను కలాంకు తెలియజేశారు. ముందుగా అన్యమతస్తులు స్వామి దర్శనం చేసుకోవాలంటే డిక్లరేషన్ ఫామ్‌పై సంతకం చేయాలని చెప్పారు. నిబంధనలకు అనుగుణంగా డిక్లరేషన్ ఫామ్‌ను ఢిల్లీకి తెప్పించుకొని, దానిపై సంతకం చేసి పంపించారు. దాన్ని టీటీడీ ఆమోదించిన తర్వాతనే కలాం తిరుమల వేంకటేశ్వరుడిని దర్శించుకొని వెళ్లారు. రాష్ట్రపతిగా లేనప్పుడు రెండోసారి 2009లో కూడా కలాం అదే పద్ధతి పాటించారు. ఎక్కడా టీటీడీ నిబంధనలు, తిరుమల ఆచార వ్యవహారాలు, సాంప్రదాయాలను ఆగౌరవపరచలేదు.



తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చిన కలాం(ఫైల్)

సినిమా డైలాగ్‌లు ఎందుకు?

డిక్లరేషన్‌పై సంతకం చేయడం అనేది మహా పాపమేమీ కాదు. తిరుమలలో డిక్లరేషన్ ఇవ్వడం అంటే తాను వేరే మతానికి చెందిన వాడినని, అయినా వేంకటేశ్వరస్వామిపై నమ్మకం, విశ్వాసం, గౌరవం ఉందని, దర్శనానికి అనుమతి కోరడం. అంతేకానీ డిక్లరేషన్‌పై సంతకం చేసినంత మాత్రాన హిందువు అయిపోరు, మతం మారిపోరు. ఏ మతం వారికి ఆయా దేవుళ్లపై విశ్వాసం ఉంటుంది. 1987లో దేవదాయ, ధర్మాదాయ శాఖ కొన్ని పరిస్థితుల నేపథ్యంలో చట్టానికి సవరణ చేసింది. అప్పటినుంచి ఈ నిబంధన అమల్లోకి వచ్చింది. దేవదాయశాఖ చట్టం 30/1987 ప్రకారం అన్యమతస్తులు స్వామివారిని దర్శించుకోవాలంటే డిక్లరేషన్ ఇవ్వాలి. అది కూడా 1990 నుంచి అమల్లోకి వచ్చింది. డిక్లరేషన్ అంటే కేవలం వేంకటేశ్వరుడిపై విశ్వాసం ఉందని చెప్పడమే. కానీ దానికి కూడా జగన్ గగ్గోలు పెడుతున్నారు. డిక్లరేషన్ ఇవ్వాలా..? లేదా..? అన్నది జగన్ ఇష్టం. అంతేగానీ సినిమాలో డైలాగ్‌లు చెప్పినట్లు నా మతం మానవత్వం అంటూ జగన్ కబుర్లు చెబుతున్నారని, అబ్దుల్ కలాంతో పాటు చాలా మంది అన్యమతస్తులు డిక్లరేషన్ ఇచ్చి స్వామివారిని దర్శనం చేసుకున్నారన్న విషయం ఆయన తెలుసుకుంటే మంచిదని భక్తులు హితవు పలుకుతున్నారు.

హిందుత్వంపై జగన్ దాడి

- కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆగ్రహం

నార్సింగ్, సెప్టెంబర్ 28 (ఆంధ్రజ్యోతి): దళితులను అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేయాలని జగన్ చూస్తున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. శనివారం హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ తిరుమల డిక్లరేషన్‌పై జగన్ రాద్ధాంతం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్యమతస్తులు తిరుమల వస్తే డిక్లరేషన్ ఇవ్వాలనే నిబంధన ఎప్పటినుండో ఉందని, క్రిస్టియన్ అయిన జగన్ డిక్లరేషన్ ఇస్తే ఆయనకు వచ్చే ఇబ్బందేంటి? అని ప్రశ్నించారు. జగన్ తీరు చూస్తుంటే తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ చేసినట్లు అనిపిస్తుందని అన్నారు. ఇది ముమ్మాటికి హిందుత్వంపై జరుగుతున్న దాడిలో భాగమే అన్నారు.

లడ్డూ వ్యవహారంపై కేంద్రం సీరియస్

అవసరమైతే దర్యాప్తులో కేంద్రం జోక్యం: కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ వ్యవహారంపై కేంద్రం సీరియస్‌గా ఉందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. లడ్డూ ప్రసాదం కోసం జంతువు కొవ్వు కలిసిన నెయ్యిని దిగుమతి చేసుకున్నారనేదని వాస్తవమని, ఈ మేరకు నివేదికలో తేలిందని స్పష్టం చేశారు. ఎప్పటికప్పుడు వివరాలు సేకరిస్తోందని, అవసరమైతే దర్యాప్తులో కేంద్రం జోక్యం చేసుకుంటుందన్నారు. శనివారం ఢిల్లీలోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తిరుమల ప్రతిష్ఠను దిగజార్చారని ఆరోపించారు. రామతీర్థంలో రాముడి విగ్రహం నుంచి మొండెం వేరు చేసినప్పుడు, అంతర్వేదిలో రథం తగలబెట్టినప్పుడు దోషులను పట్టుకోలేదన్నారు. తిరుమలలో ఏం జరుగుతోందో బీజేపీ నేతలకు తెలుసో, తెలియదోనని జగన్ అంటున్నారని, కేంద్రం అన్నీ గమనిస్తూనే ఉందని వ్యాఖ్యానించారు. జగన్ బంధువు సుబ్బారెడ్డి, హిందూ ధర్మాన్ని నమ్మని కరుణాకర్ రెడ్డికి చైర్మన్లుగా బాధ్యతలు అప్పగించారని, తద్వారా జగన్ పెత్తనం చెలాయించారని మండిపడ్డారు. "మా నాన్న తిరుపతి ఎన్నిసార్లు వెళ్లారు? నేను వెళ్లకూడదా? అని జగన్ మాట్లాడారు. మీ తండ్రి కూడా ఏడుకొండలను రెండు కొండలు చేస్తామన్న వ్యక్తే కదా? తిరుమలలో పట్టువస్త్రాలు సమర్పించేటప్పుడు దంపతులు ఉండాలనేది శాస్త్రం. కానీ మీ శ్రీమతి స్వామివారి దగ్గరికి రాకపోవడానికి కొన్ని అభ్యంతరాలు ఉన్నాయి. మీ కుటుంబం వేరే మతాన్ని నమ్ముకుంది. అందుకే ఆమె నిరాకరించారు. మీరొక్కరే వెళ్లి పట్టువస్త్రాలు సమర్పించారు. ఇది శాస్త్ర విరుద్ధం. ముఖ్యమంత్రిగా ఏం చేసినా చెల్లుతుందనే మూర్ఖత్వంతో తిరుమల ప్రతిష్ఠను దిగజార్చుతూ.. హిందువుల మనోభావాలను దెబ్బతీశారు" అని జగన్‌పై శ్రీనివాస వర్మ మండిపడ్డారు. గత ప్రభుత్వాల అనాలోచిత నిర్ణయాల వల్లే విశాఖ స్టీల్ ప్లాంట్ నష్టాల్లోకి వెళ్లిందని శ్రీనివాస వర్మ అన్నారు. గాడిలో పెట్టేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. విశాఖ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేసే అంశంలో కొన్ని చిక్కులు ఉన్నాయని తెలిపారు.

నెయ్యి.. నిప్పు!

- లడ్డూ వివాదానికి ఆజ్యం పోసిన జగన్
- హిందుత్వ, దేశంపై అనుచిత వ్యాఖ్యలు
- ఇతర రాష్ట్రాలకు పాకిన నిరసనలు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)



అగ్నికి ఆజ్యం (నెయ్యి) పోసేవాళ్లనే చూశాం! ఇప్పుడు... వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ 'నెయ్యి' వివాదానికే తన మాటలతో అగ్నిని జతచేశారు. నెయ్యి వివాదంపై మాట్లాడి సరిపెట్టకుండా... సున్నితమైన మత సంప్రదాయాలపైనా, దేశంపైనా ఆయన చేసిన వ్యాఖ్యలపై జాతీయ స్థాయిలో ఆగ్రహం వ్యక్తమవుతోంది. జగన్ వ్యతిరేక ఆందోళనలు ఇతర రాష్ట్రాలకూ విస్తరించాయి. శనివారం గుజరాత్‌లోని 9జిల్లాల్లో జగన్ వ్యతిరేక ఆందోళనలు సాగాయి. జగన్‌పై చర్యలు తీసుకోవాలని, తిరుమల పవిత్రతను కాపాడాలని కోరుతూ మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్‌లో ర్యాలీలు జరిగాయి. తెలంగాణలోనూ జగన్‌పై బీజేపీ నేతలు, హిందూ సంఘాల ప్రతినిధులు మండిపడుతున్నారు. చేసిన తప్పును ఒప్పుకోకపోగా.. వితండ వాదంతో హిందువుల మనోభావాలను గాయపరుస్తున్నారంటూ ఢిల్లీ స్థాయిలో బీజేపీ నేతలు ఆగ్రహిస్తున్నారు. సీఎం చంద్రబాబును ఇరకాటంలోకి నెడదామనుకుని... తానే ఇరుక్కుపోయారని ఓ సీనియర్ ఐఏఎస్ అధికారి అభిప్రాయపడ్డారు.

బండేసి.. బెంగళూరెళ్లారు!

- జగన్ వైఖరిపై సొంత పార్టీలోనే అసంతృప్తి
- ఆలయాల్లో పూజలకు స్పందన అంతంతే

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

తిరుమల లడ్డూ వ్యవహారంపై వైసీపీ అధ్యక్షుడు జగన్ తీరు రాజకీయ వర్గాలు, సామాన్య జనంతో పాటు సొంత పార్టీలోనూ చర్చనీయాంశంగా మారింది. భక్తి విశ్వాసాలతో కూడిన సున్నితమైన అంశంలో జగన్ వైఖరి పట్ల వైసీపీ ముఖ్యనేతలు విస్తుబోతున్నారు. ఎంతో పవిత్రంగా భావించే తిరుమల ప్రసాదాన్ని కల్తీ చేయడం మాయని మచ్చ కాగా... లడ్డూ, దర్శనం విషయంలో జగన్ అనుసరిస్తున్న వైఖరి పార్టీకి భవిష్యత్తులో ఇబ్బందేనని కొందరు ముఖ్యనేతలు చెబుతున్నారు. తిరుమల వెంకటేశ్వరస్వామి దర్శనానికి తాను వెళ్లకుండా ఆంక్షల పేరిట అడ్డుకుందంటూ రాష్ట్ర ప్రభుత్వంపై జగన్ నిందలు వేశారు. శుక్రవారం తిరుమల పర్యటనను రద్దు చేసుకుని శనివారం చల్లగా బెంగళూరుకు జారుకున్నారు. అక్కడే మూడురోజులు ఉండి మంగళవారం తిరుగు ప్రయాణమవుతారు. తాను తిరుమలలో శ్రీవారి దర్శనం చేసుకుని ప్రక్షాళన కార్యక్రమాన్ని నిర్వహిస్తానని, రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల్లో పూజలు చేయాలంటూ వైసీపీ శ్రేణులను అంతకుముందు జగన్ ఆదేశించారు. అయితే తాను డిక్లరేషన్ ఇవ్వాలని టీటీడీ ఆంక్షలు పెట్టిందంటూ తిరుమలకు వెళ్లలేదు. మరోవైపు పార్టీ అధ్యక్షుడిగా వైసీపీ శ్రేణులకు తాను పిలుపునిచ్చిన కార్యక్రమం అమలు తీరునూ సమీక్షించలేదు. జగన్ పట్టించుకోకపోవడంతో శనివారం ఆలయాల్లో వైసీపీ నేతల ప్రక్షాళన పూజలు పెద్దగా జరగలేదు. తిరుమల పర్యటనకు ప్రభుత్వం ఆంక్షలు పెడుతోందని జగన్ చేసిన ఆరోపణలన్నీ టీడీపీ కూటమి నేతలు ఖండించారు. డొంక తిరుగుడు కారణాలు చూపుతూ దైవదర్శనాన్ని రద్దు చేసుకోవడం చర్చకు దారితీసింది. జగన్ ఓ వ్యూహం లేకుండా ఇదే తరహాలో ముందుకు వెళితే పార్టీ మనుగడ ప్రశ్నార్థకమయ్యే ప్రమాదం ఉందన్న ఆందోళన ఆ పార్టీ శ్రేణుల్లో కనిపిస్తోంది. జగన్ హయాంలో లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందంటూ ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆరోపణలు చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపైనా నేరుగా జగన్‌పై ఆరోపణలను గుప్పిస్తున్నారు. కూటమి పార్టీలు, కాంగ్రెస్ నుంచి ముప్పేట దాడి జరుగుతుంటే.. పార్టీ అధినేత జగన్ తన ధోరణిలో తాను పోతుండటంపై వైసీపీ నేతలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. తిరుమల లడ్డూ, దర్శనం విషయంలో ప్రభుత్వంపై బండేసి జగన్ బెంగళూరు విహార యాత్రకు వెళ్లిపోవడం చర్చనీయాంశమైంది.

లులూ.. బ్యాక్ టు ఏపీ!

(మొదటి పేజీ తరువాయి)

సెంటర్, మెగా షాపింగ్ మాల్ వల్ల ఏడువేలమందికి ఉపాధి లభిస్తుందని నాటి ఒప్పందంలో పేర్కొన్నారు. దాంతో ఆ కంపెనీకి అప్పటి టీడీపీ ప్రభుత్వం 13.83 ఎకరాల స్థలాన్ని లీజుకు ఇచ్చింది. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం విశాఖలో లులూ సంస్థకు ఇచ్చిన భూముల లీజును రద్దు చేసేసింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఒప్పందాలు చేసుకున్న పారిశ్రామిక సంస్థల పట్ల వైసీపీ ప్రభుత్వం విధ్వంసకర, కక్షపూరిత విధానాలకు పాల్పడటంతో అనేక పారిశ్రామిక సంస్థలు పొరుగు రాష్ట్రాలకు పారిపోయాయి. లులూ సంస్థ కూడా ఒప్పందాలను రద్దు చేసుకుని రాష్ట్రం నుంచి వెనక్కి వెళ్లిపోయింది. ఇటీవల సాధారణ ఎన్నికల్లో టీడీపీ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, ముఖ్యమంత్రి చంద్రబాబు మళ్లీ రాష్ట్రంలో పరిశ్రమలను ఆకర్షించేందుకు అహర్నిశలు కృషి చేస్తుండటంతో లులూ గ్రూప్ ఇంటర్నేషనల్ సంస్థ మళ్లీ రాష్ట్రంలో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. విశాఖపట్నంలో ఇంతకుముందు టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిపాదించిన మెగా షాపింగ్ మాల్‌తోపాటు మల్టీప్లెక్స్, హైపర్ మార్కెట్ల ఏర్పాటు, విజయవాడ, తిరుపతి నగరాల్లో మల్టీప్లెక్స్‌ల నిర్మాణం, మరోవైపు ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలోనూ పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. వీటిపై చర్చించేందుకు లులూ గ్రూప్ ఛైర్మన్ యూసుఫ్ అలీ శనివారం తమ బృందంతో కలిసి అమరావతికి వచ్చి ముఖ్యమంత్రితో భేటీ అయ్యారు. ఉండవల్లి నివాసంలో మధ్యాహ్నం దాదాపు రెండు గంటల పాటు లులూ గ్రూప్ బృందంతో చంద్రబాబు సుదీర్ఘంగా చర్చలు జరిపారు. లులూ గ్రూప్ ప్రతిపాదించిన ప్రాజెక్టులు, ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పెట్టనున్న పెట్టుబడులపై సీఎం చర్చించారు. రాష్ట్రంలో పెట్టుబడులను ప్రోత్సహించడానికి తమ ప్రభుత్వం తీసుకువస్తున్న అత్యుత్తమ నూతన పారిశ్రామిక పాలసీల గురించి సీఎం వివరించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తోపాటు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు తమ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని చంద్రబాబు చెప్పారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేవారికి ప్రభుత్వం తరఫున పూర్తి మద్దతు, సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. గత ప్రభుత్వం దెబ్బకు భయపడి పారిపోయిన లులూ గ్రూపు తిరిగి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడం పట్ల ముఖ్యమంత్రి సంతోషం వ్యక్తం చేశారు. ఛైర్మన్ యూసుఫ్ అలీతోపాటు వచ్చిన ప్రతినిధులను చంద్రబాబు సత్కరించారు. లులూ వంటి సంస్థల రాకతో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే అంశంపై పారిశ్రామికవేత్తల్లో చర్చ జరుగుతుందని, ఇది రాష్ట్రానికి ప్రయోజనకరమని చంద్రబాబు అన్నారు. అనంతరం లులూ ప్రతినిధి బృందంతో చర్చల సారాంశాన్ని చంద్రబాబు ఎక్స్ వేదికగా వివరించారు. 'లులూ గ్రూప్ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చినందుకు సంతోషిస్తున్నాను. ఆ సంస్థ ఛైర్మన్ యూసుఫ్ అలీ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అష్రఫ్ అలీ, ఇతర ప్రతినిధి బృందంతో ప్రొడక్టివ్ మీటింగ్ జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పెట్టుబడులతోపాటు వైజాగ్‌లో మాల్, మల్టీప్లెక్స్, హైపర్ మార్కెట్, విజయవాడ, తిరుపతిల్లో మల్టీప్లెక్స్‌ల నిర్మాణానికి సంబంధించిన ప్రణాళికలపై చర్చించాం. లులూకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం, మద్దతు అందిస్తుంది" అని చంద్రబాబు ట్వీట్ చేశారు.

పకడ్బందీగా పథకాల అమలు

సీఎం చంద్రబాబు లక్ష్యాలను సాధించేలా అడుగులు వేస్తాం

- పారదర్శకంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల్లో బదిలీలు
- ప్రజలకు మేలు చేసేలా మా కూటమి ప్రభుత్వం పనిచేస్తుంది
- రాష్ట్రానికి తగినన్ని నిధులు ఇచ్చేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది
- గత వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీ రాజ్ వ్యవస్థ నిర్వీర్యం
- బదిలీల ప్రక్రియపై ప్రకటనలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



అమరావతి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రయోజనం, అభివృద్ధే లక్ష్యంగా తాను చేపట్టిన శాఖల్లో పథకాలను పకడ్బందీగా అమలు పర్చాలని నిర్ణయించానని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సీఎం చంద్రబాబు గ్రామస్థాయి నుంచి అభివృద్ధి మొదలు కావాలని స్పష్టమైన లక్ష్యాలు ఇచ్చారని, స్వర్ణ పంచాయతీలు కావాలని స్పష్టం చేశారని, ఆ దిశగా అడుగులు వేస్తున్నామని పేర్కొన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలతోపాటు తాను నిర్వహిస్తున్న ఇతర శాఖల్లో బదిలీలు పారదర్శకంగా జరిగాయని పేర్కొన్నారు. ఉద్యోగుల బదిలీల ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని, ప్రతిభ, సమర్థత, నిబంధనలే కొలమానాలుగా తీసుకోవాలని ఉన్నతాధికారులకు పలుమార్లు దిశానిర్దేశం చేశానన్నారు. ప్రజాప్రతినిధులు, మంత్రుల సిఫారసులు బదిలీలకు నిర్దేశించిన కొలమానాలకు అనుగుణంగా ఉంటే పరిగణనలోకి తీసుకోవాలని సూచించానన్నారు. డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్లు, ఏపీడీలు, డీపీఓలు, జిల్లా పరిషత్ సీఈఓ బదిలీల ప్రక్రియ మొదలయ్యే ముందు తన కార్యాలయం పూర్తి సమాచారం తీసుకుందన్నారు. గత ప్రభుత్వంలో కొందరు అధికారులు కీలక పోస్టుల్లో కొంచెం అటూఇటుగా మారుతూ, ఆ ప్రాంతాలను తమ జాగీర్లుగా మార్చుకునే స్థితికి చేరానని పేర్కొన్నారు. పీఆర్, ఆర్డీ అధికారులకు మాత్రమే డ్వామా పీడీ, ఏపీడీ, జడ్పీ సీఈఓ పోస్టులు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని, అందువల్ల ఇతర శాఖల నుంచి ఈ శాఖల్లోకి రావాలనుకున్న వారిని తీసుకోలేదన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో ఇంత పారదర్శకంగా, లంచాలకు ఆస్కారం లేకుండా ఇటీవల సంవత్సరాల్లో బదిలీలు జరగలేదని, బదిలీ తీరుపై ఉద్యోగుల నుంచి, మీడియా నుంచి మంచి స్పందన వచ్చిందని తెలిపారు.

గత ప్రభుత్వంలో దారిమళ్లిన నిధులు

సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఆశ్రిత పక్షపాతం లేకుండా, ప్రజలకు మేలు చేసేలా పనిచేస్తోందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. గత పాలకులు పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేశారని, కేంద్రం ఇచ్చిన నిధులను దారి మళ్లించారని ఆరోపించారు. జల్‌జీవన్ మిషన్ నిధులను గత పాలకులు సద్వినియోగపరచలేదన్నారు. కేంద్రం మన రాష్ట్రానికి తగినన్ని నిధులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వంద రోజుల్లోపే కేంద్రం నుంచి రూ.4,500 కోట్లు ఉపాధి నిధులను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పొందిందని, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1,987 కోట్లు వచ్చాయన్నారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా 2027 నాటికి 95.44 లక్షల ఇళ్లకు కుళాయి ద్వారా రక్షిత నీరు నిరంతరాయంగా సరఫరా చేయాలనేది పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల లక్ష్యమన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాష్ట్రీయ గ్రామస్వరాజ్ అభియాన్ వార్షిక ప్రణాళిక కోసం మన రాష్ట్రానికి రూ.215 కోట్ల బడ్జెట్‌ను కేంద్రం ద్వారా ఆమోదింపచేసుకున్నామన్నారు. పంచాయతీల్లో అభివృద్ధి పనులు చురుగ్గా, లక్ష్యాన్ని అందుకునేలా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. విరుద్ధంగా వెళ్లే అధికారులకు స్థానచలనం ఉంటుందని పవన్ కల్యాణ్ హెచ్చరించారు. సీఎం చంద్రబాబు తన అనుభవంతో, రాష్ట్ర అభివృద్ధి కోసం తమ శాఖల సమీక్షల్లో, జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో చేసిన సూచనలు విలువైనవని, వాటి ఆధారంగానే పంచాయతీలకు పునరుజ్జీవం చేస్తున్నామన్నారు.

వెంకటరెడ్డిలాంటి తీగలే కాదు..

ప్యాలెస్‌లోని పెద్ద డొంకలూ కదలాలి

- వేల కోట్లు దోచుకున్న ఘనాపాఠి

ఎవరో అందరికీ తెలుసు: షర్మిల



అమరావతి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన గనుల దోపిడీలో వెంకటరెడ్డి లాంటి తీగలే కాదు.. పెద్ద డొంకలూ కదలాలి. ఆ పెద్ద డొంక ఏ ప్యాలెస్‌లో ఉన్నా విచారణ జరపాలి' అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. శనివారం ఆమె ఎక్స్ వేదికగా స్పందించారు. 'గనుల శాఖలో రూ.2,566 కోట్ల మేర ప్రభుత్వ ఖజానాను కొల్లగొట్టిన ఘనుడు వెంకటరెడ్డి అయితే.. తెర వెనుక ఉండి సర్వం తానై రూ.వేల కోట్లు కాజేసిన ఆ ఘనాపాటి ఎవరో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసు. ఐదేళ్లుగా రాష్ట్రంలో అడ్డగోలుగా సహజ సంపదను దోచుకుతిన్నారు. అస్మదీయ కంపెనీలకు మైనింగ్ కాంట్రాక్టులు ఇచ్చారు. టెండర్లు, ఒప్పందాలు, ఏపీఎండీసీ నిబంధనలన్నీ బేఖాతరు చేసి అనుకున్న కంపెనీలకు టెండర్లను కనిపెట్టారు. ఎన్‌జీటీ నిబంధనలనూ తుంగలో తొక్కారు. రాష్ట్ర ఖజానాకు రావాల్సిన నిధులను సొంత ఖజానాకు తరలించారు. గత ప్రభుత్వంలో మైనింగ్ కుంభకోణంపై ఏసీబీతో పాటు సమగ్ర విచారణ జరిపించాలి. పెద్ద తిమింగలాన్ని పట్టుకునేలా దర్యాప్తు జరగాలని డిమాండ్ చేస్తున్నాం. సహజ వనరుల దోపిడీపై సీబీఐ విచారణ కోరండి' అని షర్మిల విజ్ఞప్తి చేశారు. తన సందేశాన్ని సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ట్యాగ్ చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

దేశ ప్రయోజనాలే మిన్నగా బతికిన వ్యక్తి ఏచూరి: రాహుల్

» ఇండియా కూటమి ఏర్పాటులో ఆయనది కీలకపాత్ర: ఖర్గే



న్యూఢిల్లీ, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): రాజకీయంగా ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా దేశ ప్రయోజనాలే మిన్నగా జీవితాంతం బతికిన వ్యక్తి సీతారాం ఏచూరి అని లోక్‌సభలో విపక్షనేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఎన్డీయేకు వ్యతిరేకంగా ఏర్పడిన ఇండియా కూటమిని ఐక్యంగా ఉంచి, బలంగా ముందుకు తీసుకెళ్లడంలో తెరవెనుక ఏచూరి కీలక పాత్ర పోషించారని తెలిపారు. శనివారం, ఇక్కడ తలాకటోరా స్టేడియంలో సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సభను ఆ పార్టీ నిర్వహించింది. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడారు. ఇండియా కూటమిలోని కాంగ్రెస్, ఇతర పార్టీల మధ్య ఏచూరి వారధిగా నిలిచారని తెలిపారు. ఏచూరికి తాను స్నేహితుడిని అయినందుకు గర్వంగా ఉందని తెలిపారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ.. ఇండియా కూటమి ఏర్పాటులో ఏచూరి కీలకపాత్ర పోషించారని పేర్కొన్నారు. ఏచూరి కమ్యూనిస్టులకే కాకుండా అందరికీ ఇష్టమైన నాయకుడు అని అన్నారు.

ఢిల్లీలో తండ్రి, నలుగురు కూతుళ్ల ఆత్మహత్య!

న్యూఢిల్లీ, సెప్టెంబరు 28: దేశ రాజధాని ఢిల్లీలోని వసంత్‌కుంజ్‌లో ఘోరం జరిగింది. ఓ కుటుంబం సామూహిక ఆత్మహత్యకు పాల్పడింది. ఇంట్లో లోపలి నుంచి తలుపులు బిగించుకొని 48 ఏళ్ల ఇంటి పెద్ద, ఆయన నలుగురు కూతుళ్లు బలవన్మరణానికి పాల్పడ్డారు. నలుగురి కూతుళ్లు 15-25 ఏళ్ల మధ్య వయస్కులు. నలుగురూ మానసిక వికలాంగులే! ఈ అమ్మాయిల తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. శుక్రవారం వాళ్ల ఫ్లాట్‌లోంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారొచ్చి తలుపులు బద్దలుకొట్టి చూసేసరికి నలుగురి మృతదేహాలు కుళ్లిపోయిన స్థితిలో కనిపించాయి. 3-4 రోజుల క్రితమే ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. మృతదేహాల పక్కన పురుగుల మందు డబ్బా, జ్యూస్ ప్యాకెట్లు, వాటర్ బాటిల్ కనిపించాయి.

వందల మంది అమెరికన్లకు న్యాయం: బైడెన్

నస్రల్లా మరణంపై అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ స్పందించారు. నాలుగు దశాబ్దాల్లో వందల మంది అమెరికన్లను హిజ్బుల్లా పొట్టనబెట్టుకుందని, నస్రల్లా మరణంతో ఆ కుటుంబాలకు 'న్యాయం జరిగింది' అని వ్యాఖ్యానించారు. నస్రల్లాను హతమార్చడం సరైందేనని పేర్కొన్నారు. ఉగ్రవాద సంస్థల నుంచి తనను తాను రక్షించుకునే హక్కు ఇజ్రాయెల్‌కు ఉందని, అమెరికా పూర్తి మద్దతిస్తుందని అన్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను తగ్గించడానికి శుక్రవారమే తాను తన కార్యదర్శితో అమెరికా బలగాలను మోహరించాలని ఆదేశించిన విషయాన్ని గుర్తుచేశారు. చర్చల ద్వారానే గాజా, లెబనాన్‌లో ఉద్రిక్తతలను తగ్గించవచ్చని అభిప్రాయపడ్డారు. కాగా.. బీరుట్‌లోని తమ ఎంబసీ ఉద్యోగులు కుటుంబాలతో సహా లెబనాన్‌ను విడిచిపెట్టాలని అమెరికా హెచ్చరించింది. తమ పౌరులెవరూ లెబనాన్ వెళ్లకూడదంటూ 'ట్రావెల్ అలెర్ట్' జారీ చేసింది.

భారత్ వరం ఇరాన్ శాపం

» ఐరాస సమావేశంలో నెతన్యాహు



సెప్టెంబరు 28 : హమా‌స్‌తో యుద్ధం మొదలైన తర్వాత తొలిసారి ఐక్యరాజ్యసమితి వేదికగా ప్రసంగించిన ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం సర్వసభ్య సమావేశంలో ప్రసంగం సందర్భంగా... ఆయన రెండు చేతుల్లో రెండు మ్యాపులను ప్రదర్శించారు. కుడి చేతిలో 'శాపం' అని రాసి ఉన్న మ్యాప్‌లో ఇరాన్, ఇరాక్, సిరియా, యెమెన్ దేశాలుండగా అవి నలుపు రంగులో ఉన్నాయి. అలాగే ఎడమ చేతిలో 'వరం' అని రాసి ఉన్న మ్యాప్‌లో ఆకుపచ్చ రంగులో భారత్‌తో పాటు ఈజిప్టు, సుడాన్, సౌదీ అరేబియా దేశాలున్నాయి. ఇవి ఇజ్రాయెల్‌తో సన్నిహిత సంబంధాలున్న దేశాలు కావడం విశేషం. అయితే రెండు మ్యాపుల్లోనూ పాలస్తీనా ఆనవాళ్లు కూడా లేకపోవడం గమనార్హం. కాగా, ప్రస్తుత ఘర్షణలకు ఇరాన్, దాని మిత్రదేశాలే కారణమని నెతన్యాహు పేర్కొన్నారు. పశ్చిమాసియాను అస్థిరపరిచేందుకు హమాస్, హిజ్బొల్లా, హౌతీలకు టెహ్రాన్ ఆర్థికంగా సహకరిస్తోందని ఆరోపించారు. "మీరు దాడి చేస్తే తిరిగి మేము ప్రతిదాడి చేస్తామ"ని ఇరాన్‌ను హెచ్చరించారు. భారత్‌తో ఇజ్రాయెల్‌కు ఉన్న సత్సంబంధాలకు సూచికగానే నెతన్యాహు వరం అనే మ్యాపులో దాన్ని చూపినట్లు తెలుస్తోంది. ఇటీవలి కాలంలో ఇరు దేశాల మధ్య సాంకేతిక, రక్షణ రంగాల్లో వాణిజ్య సంబంధాలు బలపడ్డాయి.

పల్లెల పురోగతికి ప్రణాళికలు

» 2న దేశవ్యాప్తంగా ప్రత్యేక గ్రామ సభలు

» 2.55 లక్షల పంచాయతీల్లో నిర్వహణ

» అభివృద్ధి ప్రణాళికలపై మార్గనిర్దేశం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 28: పల్లెలను పురోగతి బాట పట్టించే దిశగా కేంద్రం ప్రణాళికలు రచిస్తోంది. దీనిలో భాగంగా రాబోయే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనపై దిశానిర్దేశం చేసేందుకు అక్టోబరు 2న ప్రత్యేక గ్రామసభలు నిర్వహించనుంది. ఈ సభల్లో దేశవ్యాప్తంగా 2.55 లక్షల గ్రామ పంచాయతీలు, 6,700 బ్లాక్ పంచాయతీలు, 665 జిల్లా పంచాయతీలు పాల్గొంటాయని కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ అధికారులు తెలిపారు. అన్ని పంచాయతీల్లో భాగస్వామ్య ప్రణాళికను పెంపొందించడం, పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు(పీడీపీ) సకాలంలో రూపొందించడం లక్ష్యంగా 'సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్' అభియాన్ కింద శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తారు. ఇందులో 20వేల మంది కళాశాల విద్యార్థులు పాల్గొంటారని, వారంతా వివిధ పంచాయతీల్లో పీడీపీల తయారీకి సహకరిస్తారని అధికారులు వెల్లడించారు. ఈ సభలను పర్యవేక్షించడానికి అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని ఎంపిక చేసిన పంచాయతీలకు అధికారులు, కన్సల్టెంట్లను నియమిస్తున్నారు. అక్టోబరు 2 కార్యక్రమానికి ముందు, ఈ నెల 30న మంత్రిత్వ శాఖ ఒక జాతీయ వర్క్‌షాప్‌ను నిర్వహించనుంది. దీనిలో వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖలు, పంచాయతీల ప్రతినిధులు పాల్గొని తన అనుభవాలను పంచుకుంటారు.

లైఫ్ సపోర్ట్ తీసేయొచ్చు

పరోక్ష కారుణ్య మరణానికి మార్గదర్శకాలు.. ముసాయిదా విడుదల చేసిన కేంద్ర ఆరోగ్యశాఖ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 28: చికిత్సతో ఎంతమాత్రమూ కోలుకోవటానికి అవకాశం లేకుండా, మరణశయ్యపై ఉన్న రోగులకు పరోక్ష కారుణ్య మరణాన్ని అందించే అంశానికి సంబంధించి కేంద్ర ఆరోగ్యశాఖ శనివారం ముసాయిదా మార్గదర్శకాలను వెలువరించింది. జీవనాధార వైద్య ప్రక్రియలపైనే (లైఫ్ సస్టెయినింగ్ ట్రీట్‌మెంట్స్ - ఎల్‌ఎస్టీపై) ఆధారపడిన రోగులను దృష్టిలో ఉంచుకొని వీటిలో రూపొందించారు. వీటి ప్రకారం.. వెంటిలేషన్, వాసోప్రెషర్స్, డయాలిసిస్, శస్త్రచికిత్సలు, ట్రాన్స్‌ఫ్యూజన్స్, పేరెంటల్ న్యూట్రిషన్స్ తదితర ప్రక్రియలను ఎల్‌ఎస్టీగా పేర్కొన్నారు. 'వీటిని కొనసాగించటం ద్వారా రోగికి ఎంతమాత్రమూ ఉపశమనం లేనప్పుడు అవి రోగికి మరింత భారంగా పరిణమిస్తాయి. అంతేగాక రోగి కుటుంబంపై అవి మానసికంగా, ఆర్థికంగా ఒత్తిడి కలుగజేస్తాయి. ఇటువంటి ఐసీయూ కేసుల్లో ఎల్‌ఎస్టీని తొలగించటం ప్రపంచవ్యాప్తంగా అనుసరిస్తున్న విధానం' అని వివరించారు.

నాలుగు షరతులు

ఎల్‌ఎస్టీని తొలగించటం ద్వారా రోగికి పరోక్ష కారుణ్య మరణాన్ని కల్పించటానికి పాటించాల్సిన నాలుగు షరతులను ఈ మార్గదర్శకాల్లో పొందుపరిచారు. అవి, 1. రోగిని బ్రెయిన్ డెడ్‌గా ప్రకటించారా? 2. రోగి పరిస్థితి పూర్తిగా విషమించిందని, ఎంత తీవ్రమైన చికిత్సను అందించినా మెరుగుపడే అవకాశం లేదని వైద్యులు భావిస్తున్నారా? 3. ఎల్‌ఎస్టీని కొనసాగించవద్దని రోగి లేదా రోగి తరఫు వ్యక్తులు రాతపూర్వకంగా తెలియజేశారా? 4. ఎల్‌ఎస్టీపై సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా ఉందా?. వీటి ద్వారా ఎల్‌ఎస్టీ తొలగింపుపై నిర్ణయం తీసుకోవాలని పేర్కొన్నారు. కాగా, ఆరోగ్యం పూర్తిగా విషమించిన రోగులకు ఎల్‌ఎస్టీ చికిత్సను ప్రారంభించే ముందు కూడా డాక్టర్లు ఈ షరతులను పరిగణనలోకి తీసుకోవాలని ముసాయిదా మార్గదర్శకాల్లో నిర్దేశించారు. చికిత్స జరిగే క్రమంలో తాను నిర్ణయాధికార సామర్థ్యాన్ని కోల్పోతే తన తరఫున వైద్యులు నిర్ణయం తీసుకోవటానికి వీలుగా రోగి అంగీకారం తెలియజేయవచ్చని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. దీని ప్రకారం, ముగ్గురు వైద్యులతో ఒక ప్రైమరీ మెడికల్ బోర్డును ఏర్పాటు చేయాలని, ఈ బోర్డు ఎల్‌ఎస్టీ తొలగింపుపై రోగికి సంబంధించిన వారికి అన్ని వివరాలు తెలిజేసి, ఏకాభిప్రాయంతో నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ నిర్ణయాన్ని, మరో ముగ్గురు వైద్యులతో కూడిన సెకండరీ మెడికల్ బోర్డు ఆమోదించాలని తెలిపారు. సెకండరీ బోర్డులో ఒక వైద్యుడిని జిల్లా వైద్యాధికారి నియమించాలన్నారు. కాగా, ఈ ముసాయిదా మార్గదర్శకాలపై వచ్చే నెల 20వ తేదీ వరకూ సూచనలు, సలహాలు తమకు తెలియజేయవచ్చని కేంద్రం తెలిపింది. పేషంట్ కోరిక మేరకు ప్రాణాలు తీయటాన్ని ప్రత్యక్ష కారుణ్య మరణం అని, ఎల్‌ఎస్టీ తొలగించడాన్ని పరోక్ష కారుణ్య మరణం అని పేర్కొంటారు.



డాక్టర్లపై ఒత్తిడి పెరుగుతుంది: ఐఎంఏ

కేంద్రం మార్గదర్శకాలను ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆర్వీ అశోకన్ వ్యతిరేకించారు. వీటి ద్వారా డాక్టర్లపై చట్టపరమైన చర్యలకు అవకాశం ఉంటుందని, వారి మీద ఒత్తిడి పెరుగుతుందని ఆయన తెలిపారు. యంత్రాల ద్వారా రోగిని బతికిస్తున్నారన్న ఆలోచనే తప్పు అని పేర్కొన్నారు. సైన్స్, పరిస్థితుల ఆధారంగా రోగి- కుటుంబసభ్యులు- డాక్టర్ కలిసి తీసుకునే నిర్ణయాలను వారికే వదిలేయాలని, మార్గదర్శకాల పేరుతో వాటిని పరిమితం చేయటం సరికాదన్నారు.

అమెరికాలో హెలెన్ బీభత్సం

విరుచుకుపడిన కేటగిరి 4 హరికేన్..52 మంది మృతి

పెర్రీ, సెప్టెంబరు 28: అమెరికా ఆగ్నేయ ప్రాంతంలో హెలెన్ తుపాను విధ్వంసం సృష్టిస్తోంది. తుపాను ధాటికి ఐదు రాష్ట్రాల్లో దాదాపు 52 మంది చనిపోగా అపారమైన ఆస్తి నష్టం సంభవించినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. గురువారం రాత్రి ఫ్లోరిడాలోని బిగ్‌బెండ్ ప్రాంతంలో మొదలైన కేటగిరి 4 హరికేన్ భీకర గాలులతో విరుచుకపడింది. గంటకు 225 కిలోమీటర్ల వేగంతో వీచిన పెనుగాలులు బీభత్సం సృష్టించాయి. జార్జియా, కరోలినా, టెన్నెస్సీ గుండా సాగిన హెలెన్ ధాటికి అనేక వృక్షాలు నేల కూలగా, జనావాసాలు చెల్లాచెదురయ్యాయి. కొండచరియలు విరిగిపడటం, తీవ్ర స్థాయిలో వరద ముంచెత్తడంతో కొన్ని ప్రాంతాలు పూర్తిగా జలదిగ్బంధమయ్యాయి. విద్యుత్ సరఫరా వ్యవస్థ తీవ్రంగా దెబ్బతినడంతో దాదాపు 30 లక్షల మంది అంధకారంలో ఉన్నారు. ఫ్లోరిడా, జార్జియా, ఉత్తర, దక్షిణ కరోలినా, వర్జీనియాలో ఎక్కువగా మరణాలు సంభవించాయి. అట్లాంటాలో రికార్డు స్థాయిలో 28 సెంమీల వర్షపాతం నమోదైంది.

అర్బన్ నక్సల్స్ గుప్పిట కాంగ్రెస్

» వారిని బుజ్జగించడానికి ఏమైనా చేస్తుంది

» జమ్మూ ఎన్నికల సభల్లో ప్రధాని మోదీ



జమ్మూ, సెప్టెంబరు 28 : అర్బన్ నక్సల్స్ గుప్పిట్లో కాంగ్రెస్ పార్టీ ఉన్నదని, వారిని బుజ్జగించడానికి ఆ పార్టీ ఏమైనా చేస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమర్శించారు. కశ్మీర్‌లో జవాన్ల త్యాగాల గురించి కాంగ్రెస్‌కు తెలియదని దుయ్యబట్టారు. "ఇది కొత్త భారతం. ఇంట్లోకి చొరబడి మరీ హతమారుస్తుంది" అంటూ 2016లో సరిగ్గా ఇదే రోజు (సెప్టెంబరు 28) పాకిస్థాన్‌పై జరిగిన మిలిటరీ సర్జికల్ స్ట్రైక్స్‌ను ఆయన గుర్తుచేశారు. జమ్మూకశ్మీరుకు రాష్ట్ర హోదా తొలగించి కేంద్రపాలిత ప్రాంతంగా మార్చడం అనేది కొద్ది కాలానికి మాత్రమే తీసుకున్న నిర్ణయమని మోదీ వివరించారు. జమ్మూకశ్మీర్‌లో మూడో విడత ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో శనివారం ప్రధాని మోదీ పర్యటించారు. జమ్మూ నడిబొడ్డున ఉన్న ఎమ్ఏఎమ్ స్టేడియంలో జరిగిన బీజేపీ ప్రచార సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కాంగ్రెస్-ఎన్సీ కూటమి, పీడీపీ పార్టీలపై విరుచుకుపడ్డారు. కశ్మీర్ ప్రజలకు ఆ మూడు పార్టీలు అన్యాయం చేశాయన్నారు. అవి తమ కుటుంబాలకు మేలు చేసుకున్నాయేగానీ, అంతులేని బాధల్లో ఉన్న కశ్మీరీలను ఏనాడూ పట్టించుకోలేదని విమర్శించారు. లోపాయికారీ కాంగ్రెస్ రాజకీయాలు, నిర్లక్ష్యమే కశ్మీరీలకు శాపాలుగా మారాయన్నారు. "పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా జరిగిన మిలిటరీ సర్జికల్ స్ట్రైక్స్ విశ్వసనీయతను ప్రశ్నించే కాంగ్రెస్ ద్రోహాన్ని మరవగలమా? ఓటుబ్యాంకు కోసం విదేశీ చొరబాటుదారులకు కాంగ్రెస్ స్వాగతం పలుకుతోంది. సొంత ప్రజలను మాత్రం అవమానిస్తోంది" అని దుయ్యబట్టారు. జమ్మూకశ్మీర్‌కు త్వరలోనే రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తామని మోదీ అన్నారు. బీజేపీకి మాత్రమే ఆ శక్తి ఉన్నదని స్పష్టం చేశారు. "తమను గెలిపిస్తే పాత వ్యవస్థను పునరుద్ధరిస్తామని కాంగ్రెస్-ఎన్సీ, పీడీపీ చెబుతున్నాయి. బీజేపీకి అధికారం కట్టబెడితే మహిళా సాధికారికత కోసం పాటుపడతామని వివరించారు. "స్వయం సహాయక గ్రూపులను ఏర్పాటుచేసి అక్కచెల్లెమ్మలను ధనవంతులను చేస్తాం. తగిన శిక్షణ ఇప్పించి డ్రోన్లను వారికి ఇప్పిస్తాం" అని తెలిపారు.

బాస్మతీయేతర బియ్యం ఎగుమతులపై నిషేధం ఎత్తివేత

న్యూఢిల్లీ, సెప్టెంబరు 28: బాస్మతీయేతర తెల్ల బియ్యం ఎగుమతులపై అమల్లో ఉన్న నిషేధాన్ని కేంద్ర ప్రభుత్వం ఎత్తివేసింది. అయితే టన్నుకు 490 డాలర్ల కనీస ఎగుమతి ధర (ఎంఈపీ)ను శనివారం విధించింది. అలాగే ఈ బియ్యంను ఎగుమతి సుంకం నుంచి మినహాయించింది. దేశీయంగా బియ్యం సరఫరాను పెంచడానికే కాకుండా ధరలను నియంత్రించే ఉద్దేశంతో గత ఏడాది జూలైలో బాస్మతీయేతర తెల్ల బియ్యంపై కేంద్రం నిషేధం విధించింది. తాజాగా బాస్మతీయేతర బియ్యం ఎగుమతులపై నిషేధాన్ని ఎత్తివేయడంతోపాటు కనీస ఎగుమతి ధరను విధిస్తూ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని పేర్కొంది. దేశంలోని గోదాముల్లో బియ్యం నిల్వలు పెరగడం, రిటైల్ ధరలు నియంత్రణలోనే ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం తాజా నిర్ణయం తీసుకుంది. మరోవైపు పారాబాయిల్డ్ బియ్యంపై ఎగుమతి సుంకాన్ని 20 శాతం నుంచి 10 శాతానికి కేంద్రం తగ్గించింది. బ్రౌన్ రౌస్‌పై ఎగుమతి సుంకాన్ని 10శాతానికి తగ్గిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని రెవెన్యూ విభాగం ఓ నోటిఫికేషన్‌లో పేర్కొంది. బాస్మతీయేతర తెల్లబియ్యంపైనా ఎగుమతి సుంకం 20శాతం ఉండగా ఈ బియ్యాన్ని ఎగుమతి సుంకం నుంచి మినహాయించారు.

మల్లవల్లి పారిశ్రామికవాడలో మౌలిక వసతులు



రికార్డులను పరిశీలిస్తున్న ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ బాబ్జి

హనుమాన్‌జంక్షన్ : మల్లవల్లి పారిశ్రామిక వాడలో పరిశ్రమలకు అవసరమైన మౌలిక వసతులు మరింత మెరుగుపరచడానికి కృషి చేస్తామని ఏపీఐఐసీ విజయవాడ జోనల్ మేనేజర్ కె.బాబ్జి తెలిపారు. ఏలూరు జోన్ నుంచి విజయవాడ జోన్‌కు బదిలీపై వచ్చారు. శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. శనివారం బాపులపాడు తహసీల్దార్ కార్యాలయంలో మల్లవల్లి ఏపీఐఐసీ పారిశ్రామిక వాడకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశ్రామిక వాడలో పరిశ్రమలు నెలకొల్పడానికి అవసరమైన ఏర్పాట్లు చేయడానికి కృతనిశ్చయంతో ఉన్నామన్నారు. ఇటీవలే పారిశ్రామిక వాడకు భూ రికార్డులు ప్రకారం బౌండరీ నిర్ణయించినట్లు తెలిపారు. పరిశ్రమలకు కేటాయించగా మిగిలిన భూమిని కొత్త వారికి కేటాయించడానికి ఏ మేరకు అవకాశం ఉందో పరిశీలన చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగభూషణం పాల్గొన్నారు.

రేబిస్ వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి: బొండా



కుక్కకు వ్యాక్సిన్ వేస్తున్న వైద్యులు, చిత్రంలో ఎమ్మెల్యే బొండా

సత్యనారాయణపురం, సెప్టెంబర్ 28: రేబిస్ వ్యాధిని 2030 నాటికి పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పిలుపు నిచ్చారు. ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా శనివారం బ్రేకింగ్ రేబిస్ బౌండరీస్ అనే నినాదంతో జిల్లా పశుసంవర్ధకశాఖ, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ముత్యాలంపాడులోని పెంపుడు జంతువులకు వ్యాక్సినేషన్ నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ మాచర్ల సుహాసిని, పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ హనుమంతరావు ప్రసంగించారు. తొలుత లూయిస్ పాశ్చర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం సుమారు 300 పెంపుడు జంతువులకు వ్యాక్సిన్ వేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఇందుమతి, డాక్టర్ మాధవి నాయుడు, పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రాజశేఖర్, వెటర్నరీ డాక్టర్లు హరీష్, డాక్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అపసవ్య జీవన విధానంతో గుండె సమస్యలు

వరల్డ్ హార్ట్ డే సందర్భంగా సెంటినీ వైద్యుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న సెంటినీ వైద్యులు

(అమరావతి, ఆంధ్రజ్యోతి): అపసవ్య జీవన విధానం గుండెపై తీవ్ర ప్రభావం చూపుతోందని సెంటినీ హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ పద్మ మొవ్వ అన్నారు. అంతర్జాతీయ గుండె దినోత్సవం సందర్భంగా శనివారం సెంటినీ హాస్పిటల్స్ యాజమాన్యం, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది విజయవాడ నగరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుండె సంబంధిత సమస్యలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాలకే ప్రమాదమని హెచ్చరించారు. కొన్నేళ్లుగా గుండె సంబంధింత సమస్యలతో మరణించే వారి సంఖ్య పెరుగుతోందని సెంటినీ హాస్పిటల్ గుండె వైద్య నిపుణులు డాక్టర్ కృష్ణచంద్ అన్నారు. వ్యాయామం గుండె సంబంధిత సమస్యలను దూరం చేస్తుందని కార్డియాలజిస్ట్ డాక్టర్ బొల్లినేని రఘురామ్ తెలిపారు. ప్రస్తుత బిజీ జీవితంలో కనీసం 45 నిముషాలైనా వ్యాయామానికి సమయం కేటాయించాలని సూచించారు. ఈ ర్యాలీలో సెంటినీ హాస్పిటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆనంద్ శ్రీనివాస్, సెంటినీ సిటీ హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ విష్ణు, సీఈవో సి.ఎల్.ఎన్.రెడ్డి, జనరల్ మేనేజర్ హనుమంతరావు పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సదుపాయాలు

మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర

వన్‌టౌన్, సెప్టెంబరు 28: దసరా మహోత్సవాల భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. శనివారం ఆయన దసరా ఏర్పాట్లను పరిశీలించారు. వన్‌టౌన్ కెనాల్ రోడ్డు, వినాయకుడి గుడి, రథం సెంటర్‌లో క్యూలు, పరిశుభ్రత, మౌలిక సదుపాయాలను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 26 ప్రదేశాలలో మొత్తం 32 లక్షల మంచినీటి ప్యాకెట్లను అందిస్తామన్నారు ఎనిమిది ప్రాంతాల్లో 150 తాత్కాలిక మరుగు దొడ్లను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఆరు ప్రాంతాల్లో ఆరు క్లోక్ రూమ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, ఎస్ఈ రామ్మోహన్, జోన్-1 కమిషనర్ రమ్యకీర్తన, ఈఈ ప్రసాద్, ఏఎంహెచ్‌వో డాక్టర్ సురేష్‌బాబు పాల్గొన్నారు.



దసరా మహోత్సవాల ఏర్పాట్లను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర

ఆరోగ్యంపై అప్రమత్తత అవసరం

రైల్వేస్టేషన్, సెప్టెంబరు 28 : ఆరోగ్యంపై అప్రమత్తత అవసరమని విజయవాడ రైల్వే ఆస్పత్రి చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ ఎం.శౌరిబాల అన్నారు. శనివారం ఆస్పత్రిలో వరల్డ్ రేబిస్ డే, వరల్డ్ హార్ట్ డే సందర్భంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శౌరిబాల మాట్లాడుతూ క్లిష్టమైన అనారోగ్య సమస్యలను వివరించి, వాటి నివారణకు పలు సూచనలు చేశారు. డాక్టర్ షైనీ బిల్లా, డాక్టర్ పూర్ణచంద్రరావు, డివిజన్ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ ఏసీఎంఎస్ జై దీప్ పాల్గొన్నారు.

ముగిసిన భారత స్కౌట్స్ తృతీయ సోపాన్

గవర్నర్‌పేట, సెప్టెంబరు 28: స్థానిక సీవీఆర్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో ఐదు రోజుల పాటు నిర్వహించిన భారత స్కౌట్స్ తృతీయ సోపాన్ క్యాంప్ శనివారం ముగిసింది. క్యాంపులో పయనీరింగ్, ప్రథమ చికిత్స, ఎస్టిమేషన్, మాపింగ్‌పై శిక్షణ ఇచ్చారు. ముఖ్య అతిథిగా డీఈవో యు.వి.సుబ్బారావు హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ ఏడీ జి.వి.కుమార్, దారం ప్రసాద్, పి. మురళీ, శిక్షకులు శర్మ, వరకుమార్, యోగేశ్వరరావు పాల్గొన్నారు.

'స్వర్ణాంధ్ర-2027'పై విద్యార్థులకు పోటీలు

లబ్బీపేట, సెప్టెంబరు28: స్వర్ణాంధ్ర-2027 విజన్ సాకారానికి సుస్థిరత, నాలెడ్జ్ ఎకానమీ, ఆర్థికాభివృద్ధి సాధించడానికి 'ప్రభుత్వం ఏం చేయాలి, ప్రజలు ఏం చేయాలని నీ అభిప్రాయంలో' అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, డిబేటింగ్ పోటీలు బిషప్ అజరయ్య పాఠశాలలో శనివారం నిర్వహించారు. ఈ పోటీలను జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జి.మహేశ్వరరావు, జిల్లా విద్యాశాఖాధికారి వి.సుబ్బారావు ప్రారంభించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎకడమిక్ మానిటరింగ్ అధికారి ఎస్.అశోక్‌బాబు, విజన్ కవిటీ కన్వీనర్ రత్న కమల్ గైడ్ పాల్గొన్నారు.

మానవత్వానికి మాయని మచ్చ జగన్:గన్నే

వన్‌టౌన్, సెప్టెంబరు 28: మానవత్వానికి మాయని మచ్చ జగన్ అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్ (అన్నా) శనివారం ఓ ప్రకటనలో విమర్శించారు. గత ఐదేళ్ల అరాచక పాలన చూసే జగన్‌ను ప్రజలు ఛీ కొట్టారన్నారు. అక్రమ సంపాదన కోసం శ్రీవారి లడ్డూను కల్తీ చేసిన సైకో జగన్ మానవత్వం గురించి మాట్లాడడం హేయమన్నారు.

కొనకళ్లకు అభినందనలు

భారతీనగర్, సెప్టెంబరు 28: ఆర్టీసీ చైర్మన్‌గా నియమితులైన మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణను గొల్లపూడి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నూతక్కి రాంప్రసాద్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు.

దుర్గమ్మ సేవలో హైకోర్టు న్యాయమూర్తి

వన్‌టౌన్, సెప్టెంబరు 28: ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మను రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి టి.మల్లికార్జునరావు కుటుంబసభ్యులతో కలిసి శనివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఈవో రామారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం న్యాయమూర్తికి శేష వస్త్రం, ప్రసాదం, ఆశీస్సులు, చిత్రపటం అందజేశారు.



జస్టిస్ మల్లిఖార్జునరావుకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో రామారావు

దుర్గమ్మకు వెండి వస్తువులు సమర్పించిన భక్తులు

కనకదుర్గమ్మకు విజయవాడ నవరంగ్ థియేటర్ ప్రాంతానికి చెందిన వాగిచర్ల శ్రీనివాస్, సునీత నాలుగు వెండి గిన్నెలు, నాలుగు ఉద్ధరిణిలను సమర్పించారు. వీటిని ఈవో రామారావు అందించారు. అలాగే రేపల్లెకు చెందిన ఎ.విజయకుమార్, ఆయన కుటుంబసభ్యులు వెండి నగిషీ ప్లేట్‌ను కానుకగా సమర్పించారు.

ద్విచక్రవాహనదారులకు చేయూతనివ్వండి: రామ్మోహన్

మొగల్రాజపురం, సెప్టెంబర్ 28: విజయవాడ నగరంలో వరద, భారీ వర్షాలకు పాడైన ద్విచక్రవాహన యజమానులకు కార్పొరేట్ సంస్థలు చేయూతనివ్వాలని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పిలుపునిచ్చారు. బందర్ రోడ్డులోని పీవీపీ మాల్‌లో శ్రీరామ్ ఫైనాన్స్ సంస్థ ద్విచక్రవాహనాల ఎక్చేంజ్, నూతన వాహనాల కొనుగోలు కోసం ఏర్పాటు చేసిన శిబిరాన్ని గద్దె శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరవాసుల ఇబ్బందులు గుర్తించి కొత్త వాహనాలను సమకూర్చు కోవడానికి వీలుగా నిబంధనలు సడలించడం అభినందనీయమన్నారు. శ్రీరాం ఫైనాన్స్ సంస్థ ప్రతినిధులు వెంకటేశ్వరరావు, ఎంఎస్ చౌదరి మాట్లాడుతూ ప్రత్యేక ప్రణాళిక ద్వారా వాహనాలను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉన్నతాధికారులు ప్రసాద్, ఆర్.చక్రధర్, నాగేంద్ర, ఫణికుమార్ పాల్గొన్నారు.



శిబిరం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గద్దె

రైల్వే కార్మికుల సమస్యలను పరిష్కరించాలి: మీరయ్య

రైల్వే స్టేషన్, సెప్టెంబరు 29: రైల్వే కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని రైల్వే మాజ్దూర్ యూనియన్ నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయవాడలోని యూనియన్ కార్యాలయంలో శనివారం యూనియన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. యూనియన్ అధ్యక్షుడు ఎస్.మీరయ్య సమావేశానికి అధ్యక్షత వహించారు. ప్రధాన కార్యదర్శి పులివర్తి రవీంద్ర నాయుడు గత ఏడాదికి సంబంధించిన కార్యకలాపాల నివేదికను సమర్పించారు. సమావేశంలో చర్చల అనంతరం పలు తీర్మానాలు చేశారు. కోవిడ్‌లో నిలిపివేసిన మూడు డీఏల బకాయిలు విడుదల చేయాలని, ఏడవ వేతన సంఘం బకాయిలు ఇవ్వాలని, ఓల్డ్ పెన్షన్ స్కీంను వెంటనే అమలు చేయాలని తీర్మానించారు. కేంద్ర కమిటీ సభ్యులు టి.మోహన్ కృష్ణ, బాషా తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న యూనియన్ నేతలు

టాలీలో ఉచిత శిక్షణకు దరఖాస్తులు

కృష్ణలంక, సెప్టెంబరు 28 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పనా శాఖ సంయుక్త అధ్వర్యంలో కానూరులోని ఫెడరల్ స్కిల్ అకాడమీ ట్రైనింగ్ సెంటర్‌లో అకౌంట్ టాలీ 30 రోజుల పాటు ఇచ్చే ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. శిక్షణ అనంతరం ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా ఉపాధి కల్పనాధికారి డి.విక్టర్‌బాబు మాట్లాడుతూ ఉచిత శిక్షణకు ఇంటర్, డిగ్రీ, బీటెక్ (పాస్ లేదా ఫెయిల్) చేసిన 18 నుంచి 35 ఏళ్ల అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు కానూరు తులసీనగర్‌లోని ఫెడరల్ స్కిల్ అకాడమీ ట్రైనింగ్ సెంటర్‌లో తమ విద్యార్హత ధృవపత్రాలతో పాటు ఆధార్ కాపీ, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు సమర్పించి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలకు చెందిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇతర వివరాలకు మేనేజర్ సుల్తాన్ (8714692749), కో ఆర్డినేటర్ ముని (8714692748)లను సంప్రదించాలని కోరారు.

డాక్టర్ థామస్‌కు ది హైరేంజ్ ఆఫ్ బుక్ ఆఫ్ రికార్డ్సు అవార్డు ప్రదానం



సీఎం చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న థామస్

పటమట, సెప్టెంబరు 28 : కోవిడ్ కష్టకాలంలో ప్రతి రోజు 200 మంది నిరుపేదలకు ఆహారం, విజయవాడ వరద బాధితులు రెండు వేల మందికి ఆహారం, దుస్తులు అందించిన ప్రజా సేవకుడు డాక్టర్ థామస్ సేవలకు ది హైరేంజ్ ఆఫ్ బుక్ ఆఫ్ రికార్డ్సులో గుర్తింపు లభించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ఈ అవార్డుతో పాటు ఆల్ ఆఫ్ ఫేమ్ -2024 సర్వీస్ ఆఫ్ ది ఇయర్ అవార్డును అందు కున్నా రు. ఈ సందర్భంగా డాక్టర్ థామస్ చేస్తున్న సేవలను ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఆల్‌మైటీ లయన్స్ క్లబ్ నిర్వాహకులు క్రిస్టోఫర్, ఫాదర్ బెల్లంకొండ ఎన్నయ్య పాల్గొన్నారు.

గుర్రం జాషువాకు ఘన నివాళి



జాషువా విగ్రహానికి పూలమాల వేస్తున్న విల్సన్

ధర్నాచౌక్, సెప్టెంబరు 28: దళిత హక్కుల పోరాట సమితి(డీహెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో ప్రముఖ కవి గుర్రం జాషువా 129వ జయంతి శనివారం నిర్వహించారు. స్థానిక తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుట్టి రాయప్ప, నగర అధ్యక్షుడు సంగుల పేరయ్య, అసరం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కాగితాల రాజశేఖర్ పాల్గొన్నారు.


ఫైరింజన్‌తో 72 అడుగుల గణేశ్ నిమజ్జనం

బైబై గణేశా!

▸▸ బెజవాడలో ఘనంగా 72 అడుగుల మహాగణపతి నిమజ్జనోత్సవం

విజయవాడలో 21 రోజులపాటు పూజలందుకున్న 72 అడుగుల విజయ మహాగణపతి మట్టి విగ్రహ నిమజ్జనోత్సవం శనివారం రాత్రి ఘనంగా జరిగింది. డూండీ గణేశ్ సేవా సమితి ఆధ్వర్యంలో విద్యాధరపురం లేబర్ కాలనీ గ్రౌండ్స్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. నాలుగు ఫైరింజన్లతో పాటు మున్సిపల్ వాటర్ ట్యాంకర్లతో విగ్రహాన్ని ఉన్నచోటనే నీటితో తడిపి నిమజ్జనం చేశారు.

-విజయవాడ (భవానీపురం)

తిరుమలలో అడుగుపెట్టాలంటే స్వామి అనుగ్రహం ఉండాలి: బుద్దా



విజయవాడ(వన్‌టౌన్), సెప్టెంబరు 28: 'వెంకటేశ్వర స్వామి అనుగ్రహిస్తేనే తిరుమలలో అడుగు పెట్టగలుగుతారు. పాపాలు చేసిన జగన్‌కు స్వామివారి అనుగ్రహం లేనందువల్లే తిరుమలకు వెళ్లలేదు' అని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న అన్నారు. విజయవాడ వన్‌టౌన్‌లోని తన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'తన స్వార్థ రాజకీయాల కోసం తిరుమలను జగన్ వాడుకోవడం నీచం. స్వామివారి అనుగ్రహం లేక తిరుమలకు వెళ్లలేక పోయిన జగన్ తనకు అనుమతి ఇవ్వలేదని కుంటిసాకులు చెబుతున్నాడు. ఇంట్లో బైబిల్ చదువుకునే జగన్ తనకు తిరుమలేశుడిపై విశ్వాసం ఉందని డిక్లరేషన్‌పై ఎందుకు సంతకం పెట్టడు? డిక్లరేషన్ అడిగితే రాద్ధాంతం చేస్తున్నారు. తిరుమలలో అవకతవకలపై సిట్ వేయడంతో జగన్‌లో భయం పట్టుకుంది. జగన్ ఇప్పటికైనా తన తీరును మార్చుకోవాలి. మా అందరిదీ మానవ కులమే. చంద్రబాబు ఏటా రూ.కోటి విరాళం తిరుమలలో ఇస్తారు. జగన్ ఇప్పటివరకు ఒక్క రూపాయి అయినా ఇచ్చాడా? నామినేటెడ్ పదవుల్లో నా పేరు మొదటి జాబితాలో లేదంటున్నారు. నాకు పదవులు, జాబితాలతో పనిలేదు. నా గుండెలో చంద్రబాబు ఉంటారు. పదవి ఉంటే ఇంకా పనిచేస్తా. పార్టీ కోసం చంద్రబాబు, లోకేశ్‌లకు భక్తుడిగా ఉంటా' అని వెంకన్న అన్నారు.

జగన్మోహన్‌రెడ్డి దేశం విడిచి వెళ్లిపో : సోమిరెడ్డి



నెల్లూరు (వైద్యం) సెప్టెంబరు 28: 'జగన్మోహన్ రెడ్డికి ఏమైంది!? మతి చలించిందా!? స్థిమితం కోల్పోయారా!? ఆయన వెంటనే దేశం విడిచి ఆయన వెళ్లిపోవాలి' అని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం నెల్లూరులో ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఇదేం దేశమనే స్థాయికి దిగజారిన జగన్మోహన్‌రెడ్డి సౌదీకో, దుబాయ్‌కో వెళ్లిపోవాలి. భారత దేశ పౌరుడిగా తనను తాను భావించుకోవటం కష్టంగా ఉన్న ఆయన పాకిస్తాన్‌కు అయినా వెళ్లొచ్చు. ఇదేం హిందూ మతమని అనడం దుర్మార్గం. హిందూ మతాన్నీ, బీజేపీనీ ప్రశ్నించదలచుకున్నారా? అసలు వైసీపీ పరిస్థితి ఏమిటో ఆయనకు అర్థమవుతోందా? మాజీ మంత్రి పెద్దిరెడ్డి పుంగనూరుకు, ఎంపీ మిథున్‌రెడ్డి రాజంపేటకు వెళ్లలేకపోతున్నారు. విజయసాయిరెడ్డి విశాఖలో అడుగుపెట్టే అవకాశం లేదు. సజ్జల, ధనుంజయరెడ్డి అజ్ఞాతంలో ఉన్నారు. వైసీపీ ప్రభుత్వంలో అంతా తామే అయ్యి దోపిడీ చేసిన వాసుదేవరెడ్డి, వెంకటరెడ్డి జైలులో ఊచలు లెక్కబెడుతున్నారు. ఇక జగన్ తాను పుట్టిన రాయలసీమలోని తిరుమలకు వెళ్లలేక పోతున్నారు. తిరుమలలో డిక్లరేషన్‌పై సంతకం పెడితే భారతమ్మ ఇంట్లోకి రానివ్వదేమో?' అని సోమిరెడ్డి ఎద్దేవా చేశారు.

ఏచూరి మరణం వెనుక కుట్ర : చింతా మోహన్

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 28 : సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం వెనుక కుట్ర ఉందని కేంద్ర మాజీమంత్రి చింతా మోహన్ అనుమానం వ్యక్తం చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఢిల్లీ ఎయిమ్స్‌లో సీతారాం ఏచూరి వైద్యం కోసం చేరకుండా ఉండాల్సిందన్నారు. అక్కడ సరైన వైద్యం లభించలేదని చెప్పారు. పక్క బెడ్‌లోనే ఒక స్వైన్‌ఫ్లూ రోగిని ఎలా పెట్టారని ప్రశ్నించారు. హర్యానా ఎన్నికల్లో బీజేపీ చిత్తుగా ఓడిపోతుందని వ్యాఖ్యానించారు. తిరుమలలో డిక్లరేషన్ ఇస్తే నీ అహం పోతుందా జగన్ అని ప్రశ్నించారు.

ఆడుదాం ఆంధ్ర పేరుతో రోజా దోచిందంతా కక్కిస్తా

▸▸ శాప్ చైర్మన్ రవినాయుడు

తిరుపతి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): క్రీడాశాఖ మంత్రిగా రోజా దోచేసిన మొత్తాన్ని కక్కిస్తానని శాప్ ఛైర్మన్ రవినాయుడు అన్నారు. రవి నాయుడికి పదవి వచ్చిన సందర్భంగా శనివారం తిరుపతిలో టీడీపీ, తెలుగు యువత శ్రేణులు తిరుపతిలో భారీర్యాలీ నిర్వహించాయి. ఆయన మాట్లాడుతూ.. ఆడుదాం ఆంధ్ర పేరుతో కోట్ల రూపాయల డబ్బును రోజాతో పాటు అప్పటి శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి దోచేశారని ఆరోపించారు. రోజాతో పాటు బైరెడ్డిని జైలుకు పంపిస్తామన్నారు.

రష్యా దగెస్థాన్‌లో భారీ పేలుడు.. 13మంది మృతి

కీవ్, మాస్కో, సెప్టెంబరు 28: పేలుళ్లు, దాడులతో అటు రష్యా, ఇటు ఉక్రెయిన్ దద్దరిల్లాయి. దక్షిణ రష్యాలోని దగెస్థాన్‌లో ఉన్న ఓ పెట్రోల్ బంక్‌లో పేలుడు సంభవించి 13 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. దగెస్థాన్‌లో పెట్రోల్ బంక్ లక్ష్యంగా ఆగస్టులోనూ అతి భారీ పేలుడు చోటుచేసుకుంది. 35 మంది చనిపోగా, 115 మంది పైగా గాయపడ్డారు. రెండు నెలల్లోపే మరోసారి దాడి జరిగింది. మరోవైపు ఉక్రెయిన్‌లోని సుమీ నగరంలో ఉన్న ఆస్పత్రిపై రష్యా వరుసగా రెండు డ్రోన్‌లను ప్రయోగించింది. మొదటి దాడిలో ఒకరు చనిపోయారు. దీంతో ఆస్పత్రిలోని వైద్య సిబ్బంది, రోగులు అక్కడినుంచి వెళ్లిపోయే ప్రయత్నం చేస్తుండగా.. మరో డ్రోన్ వచ్చి పడింది. ఏడుగురు మృతి చెందారు. 11మంది గాయపడ్డారు.

ఒవైసీ, కల్యాణ్ బెనర్జీలపై ముంబయిలో కేసు

▸▸ వక్ఫ్ బిల్లుకు మద్దతిచ్చిన వ్యక్తిని బెదిరించారని ఆరోపణ


ముంబయి, సెప్టెంబరు 28: వక్ఫ్ బిల్లుపై జరిగిన సమావేశంలో బెదిరించారనే ఆరోపణలతో ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ కల్యాణ్ బెనర్జీపై ముంబయి ఎయిర్‌పోర్టు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదయింది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్‌బిల్లు-2024పై అధ్యయనానికి ఏర్పాటయిన సంయుక్త పార్లమెంటరీ సంఘం ప్రజాభిప్రాయ సేకరణ నిమిత్తం ఇక్కడికి వచ్చింది. ఆ కమిటీలో ఒవైసీ, బెనర్జీలు సభ్యులుగా ఉన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశానికి పలు సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. ముస్లిం సంఘాల సభ్యులు ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ సందర్భంగా వారికి, జేపీసీ సభ్యుల మధ్య వాదోపవాదాలు జరిగాయి. ఆ దశలో గుల్షన్ ఫౌండేషన్ సహ్యాదు ఇర్ఫాన్ అలీ పరిజాదే మాత్రం మద్దతు తెలిపారు. దాంతో తనను బయటకు తోసేయాలని ఒవైసీ, కల్యాణ్ బెనర్జీ ఆదేశించారని పరిజాదే ఆరోపించారు. వారితో పాటు సెక్యూరిటీ గార్డు షహబాజ్/షాహిద్ తనను నెట్టివేశారని తెలిపారు. వారికి, తమ సంఘం సభ్యుల మధ్య తోపులాట జరిగిందని చెప్పారు. మతపర విద్వేషాలు రెచ్చగొట్టడానికి ప్రయత్నించారని ఆరోపించారు. 'మత ద్రోహులకు మద్దతిస్తున్నారు. చూస్తాం' అంటూ తనను హెచ్చరించారని తెలిపారు. దీనిపై ఎయిర్‌పోర్టు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. మతవిద్వేషాలను రెచ్చగొట్టడం, బెదిరించడం అన్న ఆరోపణలపై బీఎన్ఎస్‌లోని 196, 115(2), 351(2) కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

కళాశాలల్లో ఇదేం సంస్కృతి?!

- విద్యార్థినులపై అసభ్య కామెంట్లు
- గంజాయి, డ్రగ్స్‌పైనే ఎక్కువ చర్చ
- కాలేజీల్లో చేయిదాటుతున్న పరిస్థితి
- ప్రైవేటు వర్సిటీల్లోనూ పెడపోకడలు
- అడ్డుకట్ట వేయకపోతే ప్రమాదమే
- గ్రీవెన్స్ కమిటీలపై పర్యవేక్షణ నిల్
- ఫిర్యాదులు పట్టని యాజమాన్యాలు
- ఏఐసీటీఈ, యూజీసీ నిబంధనలు గాలికి

ర్యాగింగ్‌ను మించి వికృత చేష్టలు

అది విజయవాడ నగర శివారులోని ఓ ఇంజనీరింగ్ కాలేజీ. కన్వీనర్ కోటాలో అడ్మిషన్ పొంది అందులో చేరిన ఒక విద్యార్థినికి రెండు రోజులకే చేదు అనుభవం ఎదురైంది. కొందరు విద్యార్థులు ఆ అమ్మాయిని భౌతికంగా తాకే ప్రయత్నం చేశారు. ఆమెను తరగతి వాట్సాప్ గ్రూపులో చేర్చి అసభ్యకరమైన కామెంట్లు చేశారు. ఇవన్నీ చూసి భయాందోళన చెందిన ఆ విద్యార్థిని దీనిపై అధ్యాపకులకు ఫిర్యాదు చేసింది. అయితే "కాలేజీల్లో ఇవన్నీ రొటీన్... పట్టించుకోకూడదు..." అని యాజమాన్యం నుంచి సమాధానం రావడంతో ఆమె తల్లిదండ్రులు ఆ కాలేజీ నుంచి టీసీ తీసుకొని బయటపడ్డారు.



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

విద్యార్థినుల దుస్తులపై వెకిలి జోకులు... గంజాయి కోసం ఆరాలు... మరింత కిక్ ఇచ్చే డ్రగ్స్ ఏమిటంటూ చర్చలు... యువత భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన కాలేజీల్లో సాగుతున్న ఆందోళనకరమైన ట్రెండ్ ఇదీ... కళాశాలల్లో చక్కటి నైపుణ్యాలు సొంతం చేసుకొని భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాల్సిన విద్యార్థులు పెడదారి పడుతున్నారు. పుస్తకాలు, పరీక్షలు, మార్కుల గురించి కాకుండా గంజాయి, డ్రగ్స్‌పై చర్చిస్తున్నారు. కొందరు విద్యార్థులు వాటి మాయలో చిక్కి మత్తులో చిత్తవుతున్నారు. రాష్ట్రంలోని పలు ఇంజనీరింగ్ కాలేజీల్లో ఇదే వ్యవహారం నడుస్తోంది. పెద్దగా పేరు లేని కాలేజీల నుంచి ప్రముఖ విద్యాసంస్థల వరకూ, కొన్ని ప్రైవేటు యూనివర్సిటీల్లోనూ ఈ పోకడ నానాటికీ పెరుగుతోంది. ఒకప్పటి ర్యాగింగ్ సంస్కృతి ఇప్పుడు వికృత ధోరణిగా రూపుదాల్చింది. కాలేజీల్లోని యాంటీ ర్యాగింగ్ కమిటీ, మహిళా గ్రీవెన్స్ కమిటీలు నామమాత్రంగా మారాయి. కేవలం ఉన్నాయని చూపించుకోవడానికి వినహా అవి ఎందుకూ ఉపయోగపడటం లేదు. అసలు ఫిర్యాదులు కాలేజీని దాటి యూనివర్సిటీ స్థాయికి చేరకుండా కొన్ని యాజమాన్యాలు తొక్కిపెడుతున్నాయి. కళాశాల స్థాయిలోనే పరిష్కారమైనట్లు చూపిస్తున్నా, ఎక్కడా ఫిర్యాదులను పట్టించుకుంటున్న దాఖలాలు లేవు. తాజాగా గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీలో బయటపడిన రహస్య కెమెరాల వ్యవహారంతో కాలేజీల్లో ఆకృత్యాల వ్యవహారం చర్చనీయాంశమైంది.

కూటమి ప్రభుత్వంపై బాధ్యత

విద్యా రంగంలో ప్రమాణాలు పెంచడంతో పాటు కాలేజీల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉంది. గత ప్రభుత్వంలో అటు చదువులు, ఇటు ఫిర్యాదులు రెండింటినీ పట్టించుకోకపోవడం వల్ల విచ్చలవిడితనం పెరిగింది. అందువల్లే పేరున్న కాలేజీల్లో కూడా పిల్లలను చేర్పించాలంటే తల్లిదండ్రులు భయపడే పరిస్థితి వచ్చింది. రోజూ కాలేజీకి వెళ్లొచ్చే వారికంటే హాస్టళ్లలో ఉండేవారు తొందరగా తప్పుదారి పడుతున్నారు. జూనియర్ కాలేజీలతో పోలిస్తే ఎక్కువ స్వేచ్ఛ ఉండటం, తల్లిదండ్రులు దూరంగా ఉండటం, కాలేజీ యాజమాన్యాల నిర్లక్ష్యంతో ఉన్నత విద్యాసంస్థల్లో వికృత పోకడ పెరుగుతోంది. దీనిపై ఇప్పుడే కఠినంగా వ్యవహరించకపోతే విద్యార్థుల చదువులతో పాటు, రాష్ట్ర ఇమేజ్ కూడా దెబ్బతినే ప్రమాదం ఉంది.

ఇవీ నిబంధనలు

కాలేజీల్లో కమిటీల ఏర్పాటుకు సంబంధించి ఏఐసీటీఈ, యూజీసీ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాయి. ఇంజనీరింగ్ కాలేజీల్లో ఏఐసీటీఈ నిబంధనల ప్రకారం గ్రీవెన్స్ రిడ్రెసల్ కమిటీ, యాంటీ ర్యాగింగ్ కమిటీ, మహిళలపై వేధింపుల నిరోధక కమిటీ కచ్చితంగా ఉండాలి. భౌతికంగా విద్యార్థులను వేధించినా, ఇబ్బందికరమైన కామెంట్లు చేసినా, కాలేజీల్లో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని దెబ్బతీసేలా ప్రవర్తించినా, ఎవరిపై అయినా దుష్ప్రచారం చేసినా ఈ కమిటీలకు ఫిర్యాదు చేయొచ్చు. ప్రిన్సిపాల్, ప్రొఫెసర్లు, విద్యార్థులతో కూడిన ఈ కమిటీల్లో కనీసం ఐదుగురు సభ్యులు ఉంటారు. అందులో కనీసం ముగ్గురు మహిళలు ఉండాలి. తొలుత కాలేజీ స్థాయిలో ఫిర్యాదులపై విచారణ చేస్తారు. అక్కడ సమస్య పరిష్కారం కాకపోతే, సంబంధిత యూనివర్సిటీ కమిటీకి పంపుతారు. అక్కడ రిటైర్డ్ జడ్జి స్థాయిలో విచారణ జరిపి సమస్యను పరిష్కరిస్తారు.

కాలేజీల్లో జరుగుతున్నది ఇదీ..

ఏఐసీటీఈ నిబంధనలను కాలేజీ యాజమాన్యాలు నిర్వీర్యం చేస్తున్నాయి. విద్యార్థినులపై వేధింపులు, విద్యార్థులపై ర్యాగింగ్ చేసినా బాధితులు ఫిర్యాదు చేయడానికే భయపడుతున్నారు. కాలేజీల బ్రాండ్ ఇమేజ్ దెబ్బతింటుందనే భయంతో యాజమాన్యాలు ఈ కమిటీలను నామమాత్రం చేశాయి. తమ కాలేజీలో ఎలాంటి వేధింపులు, ఇబ్బందులు లేవని చూపించడానికి ప్రయత్నిస్తున్నాయి. అడ్మిషన్లు పెంచుకోవాలని, బ్రాండ్ ఇమేజ్‌ను మెరుగుపర్చుకోవాలని చూస్తున్నాయి. దీంతో ఫిర్యాదు చేసినా ఉపయోగం ఉండదనే భావనతో ఎవరూ ఆ దిశగా ప్రయత్నం కూడా చేయడం లేదు.

వైసీపీ సర్కారు పుణ్యమే

ఉన్నత విద్యాసంస్థల్లో వికృత చేష్టలు ఇప్పుడే కొత్త కాకపోయినా కొంతకాలంగా ఈ ధోరణి పెరగడానికి గంజాయి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వంలో గంజాయి గ్రామస్థాయికీ చేరిపోయింది. ఇంజనీరింగ్ విద్యార్థుల్లో దీని వినియోగం బాగా పెరిగింది. వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసుకుని మరీ గంజాయి ఎక్కడ దొరుకుతుందని విద్యార్థులు ఆరా తీస్తున్నారు. గంజాయి వినియోగించి తోటి విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు శృతిమించిన కామెంట్లు చేస్తున్నారు. కాలేజీలకు గంజాయి, డ్రగ్స్ చేరకుండా నియంత్రిస్తే, ఇతర వేధింపులు కూడా ఆగే అవకాశం ఉంది.

జామా మసీదుపై మన్మోహన్ సంతకం చేసిన ఫైలు ఏది?

- పురావస్తు శాఖకు ఢిల్లీ హైకోర్టు ప్రశ్న
- రక్షిత కట్టడంగా ప్రకటించబోమని నాడు హామీ
- ఆ రికార్డు సమర్పించాలని ధర్మాసనం ఆదేశం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 28: మొఘలుల హయాంలో ఢిల్లీలో నిర్మించిన జామా మసీదును 'రక్షిత కట్టడం'గా ప్రకటించబోమంటూ నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ తీసుకున్న నిర్ణయానికి సంబంధించిన ఫైలును సమర్పించకపోవడంపై ఢిల్లీ హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ఆ ఫైలును అందజేయాలంటూ గతంలో ఇచ్చిన ఆదేశాలను అమలు చేయకపోవడాన్ని ప్రశ్నించింది. మసీదుకు ప్రస్తుతం ఉన్న హోదా, అది ఎవరి ఆధీనంలో ఉందన్న వివరాలతో కూడిన రికార్డును కాకుండా కొన్ని విడి కాగితాలను సమర్పించడాన్ని న్యాయమూర్తి జస్టిస్ ప్రతిభ ఎం సింగ్, జస్టిస్ అమిత్ శర్మలతో కూడిన ధర్మాసనం తప్పుపట్టింది. దీనిపై భారత పురావస్తు సర్వే విభాగానికి చెందిన తగిన అధికారి ప్రమాణ పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుందని తెలిపింది. కేంద్ర ప్రభుత్వ న్యాయవాదులతో భేటీ అయి సమగ్రమైన ప్రమాణ పత్రం సమర్పించేలా పర్యవేక్షించాలని ఏఎస్ఐ డైరెక్టర్ జనరల్‌ను ఆదేశించింది. "మీకు ఫైలు ఇవ్వని వారు ఎవరు? ఆ శాఖ కార్యదర్శిని పిలిపిస్తాం" అంటూ విచారణకు హాజరైన ఏఎస్ఐ అధికారిని ఉద్దేశించి వ్యాఖ్యానించింది. "ఆదాయం ఎంత వస్తోంది? దాన్ని ఏ విధంగా ఉపయోగిస్తున్నారు? ఇతర వివరాలు ఎందుకు ఇవ్వలేదు"ని జస్టిస్ అమిత్ శర్మ ప్రశ్నించారు. అక్టోబరులో జరిగే తదుపరి విచారణ నాటికి ఒరిజినల్ ఫైలును సమర్పించాలని, ఇదే చివరి అవకాశమని ధర్మాసనం స్పష్టం చేసింది. జామా మసీదును పురావస్తు శాఖ పరిధిలోకి తీసుకొని రాకపోవడాన్ని, ఇక్కడి ఇమాంను 'షాహీ ఇమాం'గా వ్యవహరించడాన్ని ప్రశ్నిస్తూ 2014లో పిల్ దాఖలయింది. సుహాయిల్ అహ్మద్ ఖాన్, అజయ్ గౌతం అనే వ్యక్తులు దీన్ని దాఖలు చేశారు. దీనిపై పురావస్తు శాఖ సమాధానం ఇస్తూ దీన్ని తమ పరిధిలోకి తెచ్చే ప్రయత్నం చేయబోమంటూ మన్మోహన్ ప్రకటించారని తెలిపింది. ఆ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ జామా మసీదు క్రియాశీల కట్టడమని, ప్రార్థనలు జరుగుతుంటాయని చెప్పారు. అక్కడ చాలా ఆంక్షలు కూడా ఉన్నాయని తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం అందుకు సంబంధించిన ఫైళ్లను సమర్పించాలని ఆగస్టు 28న కేంద్ర సాంస్కృతిక వ్యవహారాల శాఖ, ఏఎస్ఐలను ఆదేశించింది. ఆ ఆదేశాలు అమలు కాకపోవడంపైనే ప్రస్తుతం అసంతృప్తి వ్యక్తం చేసింది.

ఫలించిన నాలుగు దశాబ్దాల పోరాటం

▸▸ హైకోర్టులో 81 ఏళ్ల వృద్ధుడికి విజయం
▸▸ 1977లో సేకరించిన భూమికి ఇప్పటికీ పరిహారం
▸▸ చెల్లించకపోవడంపై ధర్మాసనం ఆక్షేపణ
▸▸ 2013 చట్టం ప్రకారం మార్కెట్ విలువను
▸▸ లెక్కించి పరిహారం చెల్లించాలని ఆదేశం
▸▸ 4 నెలల్లో ప్రక్రియ పూర్తిచేయాలని స్పష్టీకరణ



అమరావతి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): న్యాయం కోసం ఓ వ్యక్తి నాలుగు దశాబ్దాల పాటు అధికారులతో చేసిన పోరాటం ఫలించింది. 81 ఏళ్ల వయసులో మంచంపై ఉండి ఓ వృద్ధుడు... రాష్ట్ర హైకోర్టులో చేసిన సుదీర్ఘ న్యాయపోరాటంలో విజయం సాధించారు. 1977లో ఆయన నుంచి సేకరించిన భూమికి 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని అధికారులను ఆదేశిస్తూ హైకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. తన తీర్పులో అధికారుల వైఖరిని ధర్మాసనం తీవ్రంగా తప్పుబట్టింది. భూమిని స్వాధీనం చేసుకొని 42ఏళ్ల గడుస్తున్నా పరిహారం చెల్లించకపోవడాన్ని ఆక్షేపించింది. కోల్పోయిన భూమికి పరిహారం కోరే హక్కును పౌరులకు రాజ్యాంగం కల్పించిందని గుర్తుచేసింది. 1982లో పిటిషనర్ వెంకట నారాయణ నుంచి భూమిని స్వాధీనం చేసుకొని ఇప్పటివరకు పరిహారం చెల్లించక పోవడాన్ని ఏవిధంగానూ క్షమించలేమని పేర్కొంది. పాత భూసేకరణ చట్టంలోని లోపాలను సరిచేసేందుకు ప్రభుత్వం 2013 భూసేకరణ చట్టాన్ని తీసుకొచ్చిందని తెలిపింది. పిటిషనర్ లాంటివారికి ప్రస్తుత మార్కెట్ విలువ ఆధారంగా పరిహారం చెల్లించి, పునరావాసం కల్పించేందుకు నూతన చట్టం వెసులుబాటు కల్పిస్తుందని పేర్కొంది. ఇటువంటి అసాధారణ కేసుల్లో అధికరణ 226 ప్రకారం న్యాయస్థానాలు తమకున్న విచక్షణాధికారం ఉపయోగించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో 1977లో పిటిషనర్ నుంచి సేకరించిన భూమికి 2013 భూసేకరణ చట్టం మేరకు ప్రస్తుత మార్కెట్ విలువను లెక్కించి నాలుగు నెలల్లో పరిహారం చెల్లించాలని అధికారులను ఆదేశించింది. ఈలోపు 1982 ఫిబ్రవరి 16న భూమి స్వాధీనం చేసుకున్న నాటినుంచి ఈ రోజు వరకు రూ.5,003కు 9శాతం వడ్డీ కలిపి మూడువారాల్లో చెల్లించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ ఆర్. రఘునందనరావు, జస్టిస్ ఎన్.హరినాథ్‌తో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పు ఇచ్చింది. ఉమ్మడి కృష్ణా జిల్లా కలిదిండి మండలం తాడినాడ గ్రామం(ప్రస్తుతం ఏలూరు జిల్లా)లోని సర్వే నం. 694/2ఏలో ఉన్న మొత్తం 44.43 ఎకరాల భూమిని అధికారులు 1977లో సేకరించారు. ఆ భూమిని 1982లో స్వాధీనం చేసుకున్నారు. ఇందులో ఓలేటి వెంకట నారాయణకు 0.87 సెంట్ల భూమి ఉంది. వెంకటనారాయణ మినహా మిగిలిన భూ యజమానులు అందరూ ఎకరాకు రూ.5,003.50 పరిహారం చెల్లించేలా న్యాయస్థానం నుంచి ఉత్తర్వులు తెచ్చుకున్నారు. తనకూ పరిహారం చెల్లించాలని వెంకట నారాయణ 1997లో అధికారులకు లిఖితపూర్వకంగా వినతిపత్రం సమర్పించారు. అధికారుల నుంచి స్పందన లేకపోవడంతో 2009లో హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం పెండింగ్‌లో ఉండగానే 2013లో కేంద్ర ప్రభుత్వం నూతన భూసేకరణ చట్టాన్ని తీసుకొచ్చింది. వెంకటనారాయణ పిటిషన్‌పై విచారణ జరిపిన సింగిల్ జడ్జి 2023లో తీర్పు వెలువరించారు. పిటిషనర్ నుంచి సేకరించిన భూమికి గాను ఎకరాకు రూ.5,003 చొప్పున 6శాతం వార్షిక వడ్డీతో పరిహారం చెల్లించాలని అధికారులను ఆదేశించారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ వెంకటనారాయణ 2024లో ద్విసభ్య ధర్మాసనం ముందు అప్పీల్ వేశారు. ఇరువైపుల వాదనలు విన్న ధర్మాసనం ఇటీవల తీర్పు వెల్లడించింది.

వినియోగదారుని మోసగించిన 'యాపిల్'కు జరిమానా

▸▸ నష్టపరిహారంతోపాటు ఏపీసీఎంఆర్ఎఫ్‌కు లక్ష చెల్లించాలి
▸▸ ఆదేశం కాకినాడ వినియోగదారుల ఫోరమ్

కాకినాడ క్రైం, సెప్టెంబరు 28: వినియోగదారుడిని మోసగించినందుకు కాకినాడ వినియోగదారుల ఫోరమ్ యాపిల్ సంస్థకు రూ.లక్ష జరిమానా విధించింది. ఫోరమ్ సభ్యురాలు చెక్కా సుశీ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 'రూ.85,800 పెట్టి యాపిల్ ఐ ఫోన్ కొనుగోలు చేస్తే రూ.14,900 విలువ చేసే చార్జింగ్ కేసుతో కూడిన ఎయిర్‌పాడ్స్‌ను ఉచితంగా పొందవచ్చంటూ యాపిల్ తన అధికారిక వెబ్‌సైట్‌లో ప్రకటించింది. ఆ ప్రకటనను చూసిన కాకినాడ సూర్యారావుపేటకు చెందిన చందలాడ పద్మరాజు 2021, అక్టోబరు 13న ఆ యాపిల్ ఫోన్‌ను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేశారు. రెండు రోజుల తర్వాత... అంటే 15న ఆయనకు ఆ ఫోన్ అందింది. పార్శిల్ తెరిచి చూస్తే ఎయిర్‌పాడ్స్ లేవు. దీంతో బాధితుడు యాపిల్ కంపెనీ ప్రతినిధిని సంప్రదించారు. ఆ ప్రతినిధి సరిగా స్పందించలేదు. ఆయన ఈమెయిల్ ద్వారా ప్రధాన కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. యాపిల్ స్పందించింది. కస్టమర్ కేర్ సెంటర్‌ను సంప్రదించాలని సూచించింది. అయితే కస్టమర్ కేర్‌ను సంప్రదించినా ఫలితం లేకపోవడంతో 2022, ఫిబ్రవరి 15న కాకినాడ వినియోగదారుల ఫోరమ్‌ను బాధితుడు ఆశ్రయించాడు. ఫిర్యాది వాదనలు విన్న కమిషన్... సాక్ష్యాధారాలను పరిశీలించింది. ఫిర్యాదికి వెబ్‌సైట్‌లో పెట్టిన వ్యాపార ప్రకటన ప్రకారం ఎయిర్‌పాడ్స్ లేదా రూ.14,900, ఆయన పడిన మానసిక క్షోభకు రూ.10,000, కోర్టు ఖర్చుల నిమిత్తం మరో రూ.5,000 చెల్లించాలని యాపిల్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్‌ను కమిషన్ ఆదేశించింది. మోసపూరిత ఉచిత బహుమతుల ద్వారా వినియోగదారులను ఆకర్షించి, నెరవేర్చకపోవడం తీవ్ర తప్పిదంగా గుర్తించి యాపిల్ సంస్థను ఆంధ్రప్రదేశ్ సీఎం సహాయ నిధికి రూ.1 లక్ష చెల్లించాలని జరిమానా విధిస్తూ కాకినాడ వినియోగదారుల ఫోరమ్ అధ్యక్షుడు చెరుకూరి రఘుపతి వసంత కుమార్, సభ్యులు చెక్కా సుశి, చాగంటి నాగేశ్వరరావు ఆదేశించారు.

ఉగ్ర దాడుల హెచ్చరిక

▸▸ ముంబయిలో రెడ్ అలర్ట్

ముంబయి, సెప్టెంబరు 28 : ఉగ్ర దాడుల హెచ్చరికతో ముంబయిలో భద్రతను పెంచారు. ముఖ్యంగా ప్రార్థనా స్థలాలు, జన సమ్మర్దం ఉండే ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేసినట్లు ముంబయి పోలీసులు తెలిపారు. నగరంలోని అన్ని ఆలయాల్లో అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద కదలికలు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రార్థనా స్థలాలు, జన సమ్మర్ద ప్రాంతాల్లో మాక్‌డ్రిల్స్ నిర్వహించాలని పోలీసులకు ఆదేశాలు అందినట్లు సమాచారం. అలాగే నగరంలోని అందరు డీసీపీలకు తమ తమ ప్రాంతాల్లో భద్రత పెంచాలని సూచించారు. ముంబయిలో ప్రముఖ సిద్ధి వినాయక ఆలయంలో భద్రతను పెంచాలని, అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచించారని ఆ ఆలయ ట్రస్ట్ ఛైర్మన్ సదా సర్వాంకర్ మీడియాకు తెలిపారు. రెండు ప్రముఖ ప్రార్థనా మందిరాలు ఉన్న క్రాఫోర్డ్ మార్కెట్ ఏరియాలో శుక్రవారం పోలీసులు మాక్‌డ్రిల్ నిర్వహించారు. పండుగల సీజన్‌లో ఇది సాధారణ భద్రతాపరమైన చర్యే అని అధికారులు చెప్పారు. ఇటీవలే ఈ నగరంలో 10 రోజుల గణేశ చతుర్థి వేడుకలు ఘనంగా ముగియగా రానున్న దుర్గాపూజ, దసరా, దీపావళి పండుగలకు ముంబయి సిద్ధం అవుతోంది.

కంగనా వ్యాఖ్యలను సమర్థిస్తారా?

▸▸ నడ్డాకు రాకేష్ టికాయిత్ లేఖ
▸▸ రైతులు, స్వాతంత్ర్య యోధులను అవమానపరిచారని విమర్శ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 28: రైతుల ఉద్యమంపై సినీ నటి, బీజేపీ ఎంపీ చేసిన వ్యాఖ్యలను భారతీయ కిసాన్ యూనియన్ జాతీయ అధికార ప్రతినిధి రాకేష్ టికాయత్ తప్పుపట్టారు. వీటిని సమర్థిస్తారా అని ప్రశ్నిస్తూ బీజేపీ జాతీయ అధ్యక్షుడు జె.పి.నడ్డాకు లేఖ రాశారు. వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతులు చేసిన ఉద్యమంపై ఆమె వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దేశానికి 2014లోనే స్వాతంత్ర్యం వచ్చిందంటూ అంతకుముందు వ్యాఖ్యానించారు. ఇది రైతులను, స్వాతంత్ర్య సమర యోధులను అవమాన పరచడమేనని తికాయత్ అభిప్రాయపడ్డారు. వాస్తవ పరిస్థితులపై అవగాహనలేని ఆమెకు 2024 లోక్‌సభ ఎన్నికల్లో హిమాచల్ ప్రదేశ్‌లోని మండీ నియోజకవర్గం నుంచి ఎలా నిలబెట్టారని ప్రశ్నించారు. ఉద్యమం చేసిన రైతులను ఖలిస్థానీలంటూ ఆమె విమర్శలు చేశారని తెలిపారు. రైతుల ఉద్యమాన్ని బంగ్లాదేశ్ తరహా ఆందోళన అని అన్నారని గుర్తు చేశారు. ఆమె అభిప్రాయాలతో బీజేపీ ఏకీభవిస్తుందా అని తికాయత్ ఆ లేఖలో ప్రశ్నించారు. దీనిపై సమాధానం ఇవ్వాలని కోరారు.

జైల్లో నేరస్థులతో జతకట్టి.. తుపాకీ చేతపట్టి..

▸▸ 23 ఏళ్లకే నేరాలబాట పట్టిన కాకినాడ యువకుడు
▸▸ ముంబై క్రిమినల్స్‌తో చేరి.. డాన్‌గా ఎదగాలని పథకం
▸▸ మహారాష్ట్ర నుంచి తుపాకులు తెచ్చి విక్రయించే యత్నం
▸▸ ఆటకట్టించిన హైదరాబాద్ పోలీసులు
▸▸ 3 తుపాకులు, 4 ఎయిర్ గన్స్ స్వాధీనం



స్వాధీనం చేసుకున్న తుపాకులు పరిశీలిస్తున్న సీపీ సుధీర్‌బాబు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): బీకాం కంప్యూటర్స్ చదువును మధ్యలోనే ఆపేసిన కాకినాడకు చెందిన ఓ యువకుడు క్రిమినల్‌గా మారి, భారీగా డబ్బు సంపాదించి.. డాన్‌గా ఎదగాలనుకున్నాడు. చివరికి పోలీసులకు చిక్కాడు. అంతర్రాష్ట్ర క్రిమినల్స్‌తో జతకట్టి నగరంలో తుపాకులు విక్రయించేస్థాయికి ఎదిగిన అతడిని హైదరాబాద్ రాచకొండ పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి ఒక తపంచా, ఒక రివాల్వర్, ఒక పిస్టల్, నాలుగు ఎయిర్ గన్స్, 11 లైవ్ రౌండ్ బుల్లెట్స్, ఒక మొబైల్ స్వాధీనం చేసుకున్నారు. ఎల్బీ నగర్ క్యాంపు కార్యాలయంలో రాచకొండ సీపీ సుధీర్ బాబు శనివారం మీడియా సమావేశంలో ఈ కేసు వివరాలు వెల్లడించారు. కాకినాడకు చెందిన బొల్లింకల సాయిరాంరెడ్డి బీకాం కంప్యూటర్స్ చదువు మధ్యలోనే ఆపేసి.. కాకినాడలోని ఓ క్లాత్‌షోరూమ్‌లో సేల్స్‌మన్‌గా చేరాడు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో దొంగతనాలు చేశాడు. దాంతో కాకినాడ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. తర్వాత మకాం హైదరాబాద్‌కు మార్చాడు. ఉప్పల్ పరిధిలోని ఓ ఇంట్లో చోరీకి పాల్పడి పోలీసులకు చిక్కాడు. పోలీసులు చర్లపల్లి జైలుకు తరలించారు. చర్లపల్లికి జైలుకు వెళ్లిన సాయిరాంరెడ్డికి అక్కడ అంతర్రాష్ట్ర ముఠాలకు చెందిన క్రిమినల్స్‌తో పరిచయం ఏర్పడింది. అలా ముంబైకి చెందిన కొంత మంది క్రిమినల్స్‌తో జతకట్టాడు. ఎలాగైనా తానుకూ పెద్ద డాన్‌గా ఎదగాలని నిర్ణయించుకున్నాడు. అనుకున్నదే తడవుగా ఇటీవల జైలు నుంచి బయటకు రాగానే ముంబై వెళ్లాడు. అక్కడి క్రిమినల్స్ సహకారంతో మహారాష్ట్ర నుంచి తుపాకులు తెచ్చి హైదరాబాద్ నగరంలో విక్రయించాలని నిర్ణయించుకున్నాడు. ఒక తపంచా, ఒక రివాల్వర్, ఒక పిస్టల్, నాలుగు ఎయిర్ గన్స్, 11 లైవ్ రౌండ్ బుల్లెట్స్‌తో నేరేడ్‌మెట్ పరిధిలో అమ్మకానికి యత్నించాడు. దీనిపై ఉప్పందుకున్న మల్కాజిగిరి పోలీసులు, నేరేడ్‌మెట్ పోలీసులతో కలిసి నిందితుడిని అరెస్టు చేశారు. పెద్ద డాన్‌గా ఎదగాలని ప్లాన్ చేసుకున్నట్లు విచారణలో చెప్పాడని సీపీ వెల్లడించారు. అతడి వెనుక ఉన్న అంతర్రాష్ట్ర క్రిమినల్స్ గ్యాంగ్‌ను కూడా పట్టుకుంటామని పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● ఆదివారం 29 సెప్టెంబరు 2024
diksuchi@andhrajyothy.com

గేట్- 2025

రూర్కీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీఆర్)- దేశవ్యాప్తంగా నిర్వహించే గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ (గేట్) 2025 దరఖాస్తు గడువు పొడిగిస్తూ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ పరీక్ష నిర్వహణలో ఐఐటీ (బాంబే, ఢిల్లీ, గువహటి, కాన్పూర్, ఖరగ్‌పూర్, మద్రాస్), బెంగళూరు ఐఐఎస్సీ సంస్థలు సహకారం అందిస్తున్నాయి. ఈ ఎగ్జామ్‌లో సాధించిన మెరిట్ ఆధారంగా ఐఐటీ, నిట్ సంస్థల్లో పోస్ట్ గ్రాడ్యుయేట్, డాక్టోరల్ కోర్సులు చేసేందుకు అవకాశం కల్పిస్తారు. అంతేకాకుండా కొన్ని ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగాల ఎంపికకు గేట్ స్కోర్ తప్పనిసరి. ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. ఇంజనీరింగ్, టెక్నాలజీ, ఆర్కిటెక్చర్, సైన్స్, కామర్స్, ఆర్ట్స్ విభాగాలకు సంబంధించి మొత్తం 30 టెస్ట్ పేపర్లు ఉన్నాయి. అభ్యర్థులు ఒకటి/రెండు పేపర్లు రాయవచ్చు. గేట్ 2025 వ్యాలిడిటీ మూడేళ్లు.



టెస్ట్ పేపర్స్

ఏరోస్పేస్ ఇంజనీరింగ్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్, ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్, బయోమెడికల్ ఇంజనీరింగ్, బయోటెక్నాలజీ, సివిల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కెమిస్ట్రీ, డేటా సైన్స్ అండ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎకాలజీ అండ్ ఎవల్యూషన్, జియోమాటిక్స్ ఇంజనీరింగ్, జియాలజీ అండ్ జియోఫిజిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, మేథమెటిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్, మైనింగ్ ఇంజనీరింగ్, మెటలర్జికల్ ఇంజనీరింగ్, నేవల్ ఆర్కిటెక్చర్ అండ్ మెరైన్ ఇంజనీరింగ్, పెట్రోలియం ఇంజనీరింగ్, ఫిజిక్స్, ప్రొడక్షన్ అండ్ ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్, స్టాటిస్టిక్స్, టెక్స్‌టైల్ ఇంజనీరింగ్ అండ్ ఫైబర్ సైన్స్, ఇంజనీరింగ్ సైన్సెస్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, లైఫ్ సైన్సెస్.

అర్హత: ఇంజనీరింగ్/టెక్నాలజీ/ఆర్కిటెక్చర్/సైన్స్/కామర్స్/ఆర్ట్స్ విభాగాల్లో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేవు.

ఎగ్జామ్ వివరాలు: ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. ఇందులో 15 మార్కులకు జనరల్ ఆప్టిట్యూడ్ నుంచి, 85 మార్కులకు అభ్యర్థి ఎంచుకొన్న సబ్జెక్ట్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు, మల్టిపుల్ సెలెక్ట్ ప్రశ్నలు, న్యూమరికల్ ఆన్సర్ టైప్ ప్రశ్నలు ఇస్తారు. కొన్ని ప్రశ్నలకు ఒక మార్కు, మరికొన్నింటికి రెండు మార్కులు కేటాయించారు. మల్టిపుల్ చాయిస్ ప్రశ్నల్లో మాత్రమే తప్పుగా గుర్తించిన సమాధానానికి మూడోవంతు మార్కులు కోత విధిస్తారు. మొత్తం మార్కులు 100. పరీక్ష సమయం మూడు గంటలు.

ఫైనాన్షియల్ అసిస్టెన్స్

- గేట్ స్కోర్ ద్వారా ఎంటెక్ ప్రోగ్రామ్‌లో చేరిన అభ్యర్థులకు నెలకు రూ.12,400లు చొప్పున 22 నెలలు ఆర్థిక సహకారం అందిస్తారు.
- బీఈ/బీటెక్/ఎమ్మెస్సీ పూర్తిచేసి నేరుగా పీహెచ్‌డీలో అడ్మిషన్ పొందినవారికి మొదటి రెండేళ్లు నెలకు రూ.37,000; చివరి మూడేళ్లు నెలకు రూ.42,000 ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1800; మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.900
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 3
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, మెదక్, నల్లగొండ, ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, కోదాడ, కొత్తగూడెం, నిజామాబాద్, సూర్యాపేట, వరంగల్, అనంతపురం, కర్నూలు, ఏలూరు, కాకినాడ, రాజమహేంద్రవరం, శ్రీకాకుళం, తాడేపల్లిగూడెం, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం, చీరాల, చిత్తూరు, గూడూరు, గుంటూరు, కడప, నెల్లూరు, ఒంగోలు, తిరుపతి
- **గేట్ 2025 తేదీలు:** 2025 ఫిబ్రవరి 1, 2, 15, 16
- **వెబ్‌సైట్:** gate2025.iitr.ac.in

మేనేజ్‌లో పీజీ డిప్లొమా

రాజేంద్రనగర్(హైదరాబాద్)లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్(మేనేజ్)- పీజీ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్(అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్) కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దీనికి ఏఐసీటీఈ గుర్తింపు ఉంది. క్యాట్ 2024 స్కోర్, అకడమిక్ మెరిట్, గ్రూప్ డిస్కసన్, పర్సనల్ ఇంటర్వ్యూ, అనుభవం ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.



ప్రోగ్రామ్ వివరాలు: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. మొత్తం ఏడు ట్రైమెస్టర్లు ఉంటాయి. వీటికి 112 క్రెడిట్స్ నిర్దేశించారు. మొదటి ట్రైమెస్టర్‌లో బిజినెస్ కమ్యూనికేషన్ అండ్ ప్రెజెంటేషన్ స్కిల్స్, ఐటీ ఫర్ మేనేజర్స్, ప్రిన్సిపల్స్ ఆఫ్ మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ప్రిన్సిపల్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్, ఆర్గనైజేషనల్ బిహేవియర్, మైక్రో ఎకనామిక్స్, బిజినెస్ స్టాటిస్టిక్స్, ఫైనాన్షియల్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటింగ్ అంశాలు ఉంటాయి. రెండో ట్రైమెస్టర్‌లో ఎన్విరాన్‌మెంట్ అండ్ సస్టయినబిలిటీ, మాక్రో ఎకనామిక్ థియరీ అండ్ పాలసీ, అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్, అగ్రి ఇన్‌పుట్ మార్కెటింగ్, ఆపరేషన్స్ రీసెర్చ్, కార్పొరేట్ ఫైనాన్స్-1, కాంపిటేటివ్ టెక్నిక్స్ ఫర్ అగ్రి బిజినెస్, అగ్రికల్చరల్ బిజినెస్ ఎన్విరాన్‌మెంట్ తదితరాలు ఉంటాయి. మూడో ట్రైమెస్టర్‌లో మార్కెటింగ్ స్ట్రాటజీ, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ రీసెర్చ్, ప్రొక్యూర్‌మెంట్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ అండ్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, కార్పొరేట్ ఫైనాన్స్-2, రూరల్ బ్యాంకింగ్, రూరల్ మార్కెటింగ్ అంశాలు బోధిస్తారు. నాలుగో ట్రైమెస్టర్‌లో భాగంగా సమ్మర్ ప్రాజెక్ట్ ఉంటుంది. ఐదో ట్రైమెస్టర్‌లో బిజినెస్ అనలిటిక్స్, సేల్స్ అండ్ డిస్ట్రిబ్యూషన్ మేనేజ్‌మెంట్, కమాడిటీ డెరివేటివ్స్ అండ్ రిస్క్ మేనేజ్‌మెంట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ అగ్రి వేర్‌హౌసింగ్ మేనేజ్‌మెంట్, స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్, అగ్రికల్చరల్ ఎక్స్‌పోర్ట్ మేనేజ్‌మెంట్ అండ్ ఇంటర్నేషనల్ ట్రేడ్, బ్రాండ్ అండ్ అగ్రి ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్ వంటి సబ్జెక్టులు ఉంటాయి. ఆరో ట్రైమెస్టర్‌లో లాజిస్టిక్స్ అండ్ సప్లయి మేనేజ్‌మెంట్, రిటెయిల్ మేనేజ్‌మెంట్, అగ్రి ఎంట్రప్రెన్యూర్‌షిప్ అండ్ అగ్రి బిజినెస్ లీడర్‌షిప్, ఈ-కామర్స్ అండ్ డిజిటల్ మార్కెటింగ్, కన్స్యూమర్ బిహేవియర్ గురించి నేర్పిస్తారు. ఏడో ట్రైమెస్టర్‌లో పోస్ట్ హార్వెస్ట్ మేనేజ్‌మెంట్, మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, లీగల్ యాస్పెక్ట్స్ ఆఫ్ బిజినెస్, ఫుడ్ ప్రాసెసింగ్ సెక్టార్ మేనేజ్‌మెంట్, బిజినెస్ ఎథిక్స్, విలేజ్ ఇమ్మర్షన్ ప్రోగ్రామ్ అంశాలు ఉంటాయి. ఎలక్టివ్ సబ్జెక్ట్ కింద అడ్వాన్స్‌డ్ అనలిటిక్స్ ఫర్ అగ్రి బిజినెస్, అడ్వర్టైజింగ్ అండ్ సేల్స్ ప్రమోషన్, సీఎస్ఆర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్, ఇంటర్నేషనల్ మార్కెటింగ్, మైక్రో ఫైనాన్స్‌ల నుంచి ఒకదాన్ని ఎంపిక చేసుకోవాలి.

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో అగ్రికల్చర్ అండ్ అలైడ్ సైన్సెస్(అగ్రికల్చర్/అగ్రీ బిజినెస్ మేనేజ్‌మెంట్/అగ్రికల్చరల్ మార్కెటింగ్ అండ్ కో ఆపరేషన్/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్/అగ్రికల్చరల్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/కమర్షియల్ అగ్రికల్చర్/డెయిరీ టెక్నాలజీ/ఫిషరీస్/ఫుడ్ టెక్నాలజీ/ఫుడ్ ప్రాసెసింగ్ ఇంజనీరింగ్/ఫారెస్ట్రీ/హార్టికల్చర్/సెరికల్చర్/వెటర్నరీ సైన్స్ అండ్ యానిమల్ హజ్‌బెండ్రీ) విభాగంలో నాలుగేళ్ల బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ అభ్యర్థులకు కనీసం 45 శాతం మార్కులు వచ్చి ఉండాలి. చివరి సంవత్సరం చదువుతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరు 2025 ఆగస్టు 31 నాటికి డిగ్రీ సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలి. క్యాట్-2024 స్కోర్ తప్పనిసరి.

ఎంపిక ప్రక్రియ: క్యాట్ 2024 స్కోర్‌కు 55 శాతం, ఎస్సే రైటింగ్‌కు 5 శాతం, గ్రూప్ డిస్కషన్ స్కోర్‌కు 12 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూ స్కోర్‌కు 17 శాతం, అనుభవానికి 5 శాతం, అకడమిక్ మెరిట్‌కు 6 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.600; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.200
- **ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 2025 ఫిబ్రవరి 10
- **చిరునామా:** ప్రిన్సిపాల్ కో ఆర్డినేటర్-పీజీడీఎం(ఏబీఎం), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్(మేనేజ్), రాజేంద్రనగర్, హైదరాబాద్-500030
- **వెబ్‌సైట్:** www.manage.gov.in

జాబ్ కార్నర్

బెల్‌లో ఇంజనీర్లు

ఖాళీలు 13

బెంగళూరులోని ప్రభుత్వ రంగ సంస్థ భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్)... ఫిక్స్‌డ్ టర్మ్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. సీనియర్ అసిస్టెంట్ ఇంజనీర్: **12 పోస్టులు**
2. సీనియర్ అసిస్టెంట్ ఫెసిలిటీ ఆఫీసర్: **1 పోస్టు**

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా(ఎలక్ట్రానిక్స్/మెకానికల్/ఎలక్ట్రికల్), డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
వయోపరిమితి: 2024 సెప్టెంబరు 1 నాటికి 50 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
జీతం: నెలకు రూ.40,000 - రూ.1,20,000
ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 15
వెబ్‌సైట్: https://bel-india.in/

నాబార్డ్‌లో ఆఫీస్ అటెండెంట్ ఉద్యోగాలు

ఖాళీలు 108

ముంబయిలోని నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్(నాబార్డ్) కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.
జీతం: నెలకు రూ.35,000
వయోపరిమితి: 18-30 ఏళ్లు మించరాదు
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 21
వెబ్‌సైట్: https://www.nabard.org/

ఎన్ఆర్‌సీబీలో అప్రెంటిస్‌లు

ఖాళీలు 11

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్(ఐకార్)కు చెందిన తమిళనాడు, తిరుచిరాపల్లిలోని నేషనల్ రీసెర్చ్ సెంటర్ ఫర్ బనానా(ఎన్ఆర్‌సీబీ)... కింద పేర్కొన్న అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
విభాగాలు: కెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, అగ్రికల్చర్, హార్టికల్చర్.
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ(బీఎస్సీ/బీసీఏ) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
శిక్షణ కాలం: ఒక సంవత్సరం
స్టయిపెండ్: నెలకు గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లకు రూ.9000; టెక్నీషియన్ అప్రెంటిస్‌లకు రూ.8000
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 7
వెబ్‌సైట్: https://nrcb.icar.gov.in/



ఐటీబీపీలో కానిస్టేబుల్ పోస్టులు

ఖాళీలు 819

కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖకు చెందిన ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్(ఐటీబీపీ).... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.
పోస్టు: కానిస్టేబుల్(కిచెన్ సర్వీసెస్)
ఖాళీలు: 819(యూఆర్-458, ఎస్సీ-48, ఎస్టీ-70, ఓబీసీ-162, ఈడబ్ల్యూఎస్-81). పురుషులకు 697, మహిళలకు 122 ఖాళీలు ఉన్నాయి.
శారీరక ప్రమాణాలు: పురుషులకు ఎత్తు 165 సెం.మీ., మహిళల ఎత్తు 155 సెం.మీ. పురుషుల ఛాతీ 75 సెం.మీ. నుంచి 80 సెం.మీ. మధ్య ఉండాలి.
వయోపరిమితి: 2024 అక్టోబరు 1 నాటికి 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
పే స్కేల్: నెలకు రూ.21,700- రూ.69,100
ఎంపిక ప్రక్రియ: ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, రాత పరీక్ష, డిటెయిల్డ్ మెడికల్ ఎగ్జామినేషన్, రివ్యూ మెడికల్ ఎగ్జామినేషన్, ధ్రువపత్రాల పరిశీలన ఆదారంగా ఎంపిక చేస్తారు.
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 1
వెబ్‌సైట్: https://itbpolice.nic.in/

ఎగ్జిమ్ బ్యాంకులో మేనేజ్‌మెంట్ ట్రెయినీలు

ఖాళీలు 50

ముంబయిలోని ఎక్స్‌పోర్ట్- ఇంపోర్ట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎగ్జిమ్ బ్యాంకు)...కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.
పోస్టు: మేనేజ్‌మెంట్ ట్రెయినీ(బ్యాంకింగ్ ఆపరేషన్స్)
అర్హత: కనీసం 60 శాతం మార్కులతో ఫైనాన్స్/ఇంటర్నేషనల్ బిజినెస్/ఫారిన్ ట్రేడ్ లేదా చార్టర్డ్ అకౌంటెంట్‌లో స్పెషలైజేషన్‌తో పీజీ(ఎంబీఏ/పీజీడీబీఏ/పీజీడీబీఎం/ఎంఎంఎస్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
వయోపరిమితి: 2024 ఆగస్టు 1 నాటికి 21 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
జీతభత్యాలు: నెలకు రూ.48,480 నుంచి రూ.85,920
ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ, ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షల ఆధారంగా
దరఖాస్తు రుసుము: జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.600; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు/ఈడబ్ల్యూఎస్/మహిళా అభ్యర్థులకు రూ.100.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 7
వెబ్‌సైట్: www.eximbankindia.in/

బీఐఎస్‌లో వివిధ ఖాళీలు

ఖాళీలు 345

న్యూఢిల్లీలోని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్), డైరెక్ట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

గ్రూప్-ఎ పోస్టులు
- అసిస్టెంట్ డైరెక్టర్: **3 పోస్టులు**

గ్రూప్-బి పోస్టులు
- పర్సనల్ అసిస్టెంట్: **27**
- అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్: **43పోస్టులు**
- అసిస్టెంట్: **1 పోస్టు**
- టెక్నికల్ అసిస్టెంట్: **27 పోస్టులు**

గ్రూప్-సి పోస్టులు
- స్టెనోగ్రాఫర్: **19 పోస్టులు**
- సీనియర్ సెక్రటేరియల్ అసిస్టెంట్: **128 పోస్టులు**
- జూనియర్ సెక్రటేరియల్ అసిస్టెంట్: **78 పోస్టులు**
- సీనియర్ టెక్నీషియన్: **18**
- టెక్నీషియన్: **1 పోస్టు**

విభాగాలు: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, ఐటీఐ, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
ఎంపిక: ప్రాక్టికల్ అసెస్‌మెంట్, రాత పరీక్ష, టెక్నికల్ నాలెడ్జ్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 30
వెబ్‌సైట్: www.bis.gov.in/

చిట్టెక్స్

మొదటికే మోసం

ఒక ఊరిలో రంగయ్యఅనే హోటల్ యజమాని దగ్గర రాము, రాజు అనే ఇద్దరు కుర్రాళ్లు పని చేస్తూ ఉండేవారు. రంగయ్య వద్ద ఒక కోడి పుంజు ఉండేది.అది అలవాటుగా రోజూ తెల్లవారు ఝామునే లేచి, కూసి, రంగయ్యను నిద్ర లేపుతూ ఉండేది. దాని కూతతో మేలుకున్న

రంగయ్య ఆ వెంటనే ఇద్దరు పనివారిని నిద్రలేపి, హోటల్లో పని చేయడానికి పంపించే వాడు, రాము రాజు ఇద్దరూ మంచి పనివారే కానీ వారిద్దరికీ అంత ఉదయాన్నే చీకటితో నిద్రలేవడం అసలు నచ్చేది కాదు. తమను త్వరగా లేపడానికి కారణమైన కోడి పుంజును బాగా తిట్టుకునే వారు. రోజూ ఇలాగే జరుగుతుండటంతో చిరాకుపడిన ఆ ఇద్దరూ ఒక రోజు తమ యజమానికి తెలియకుండా ఆ కోడిపుంజును తీసుకెళ్లి, పక్క ఊరిలో అమ్మేసారు. యజమానిఅడిగితే అది కనిపించకుండా పోయిందని చెప్పారు. ఆ మర్నాడు కోడిపుంజు లేకపోవడంతో రంగయ్య బారెడు పొద్దెక్కాక, ఆలస్యంగా నిద్ర లేచాడు. అతనే ఆలస్యంగా మేలుకోవడంతో,



పనివారిని కూడా పంపడం కుదరలేదు. ఇద్దరు పనివారికి ఆ రోజు హాయిగా బోలెడు విశ్రాంతి దొరికింది అని చాలా ఆనందించారు కానీ రంగయ్య మాత్రం ఆ రోజు వ్యాపారం దెబ్బ తిన్నదని చాలా బాధ పడ్డాడు. ఆ రోజుఅలా జరగడంతో, సరిగా నిద్రపట్టని రంగయ్య అర్ధరాత్రి ఏదో సమయానికి మెలకువ వచ్చి, ఇద్దరు పనివారిని కూడా అదే సమయంలో నిద్రలేపి, పనికిపంపించాడు ఇలా రెండు రోజులు గడిచాక ఇద్దరు పనివారు రంగయ్యతోఇలా అన్నారు.అయ్యా.మనకు వేళకు నిద్ర లేవడం కష్టంగా ఉంది కాబట్టి,ఒక కొత్త కోడిపుంజును కొనుక్కుందాం' అన్నారు. దానికి రంగయ్య 'ఎందుకు ఇపుడు అనవసరపు ఖర్చు? నాకు బాగానే మెలకువ వస్తోందిగా.రోజూ నేనే నిద్ర లేచి, అదే సమయానికి మీ ఇద్దరినీ నిద్రలేపుతాను' అన్నాడు. ఆ మాటలు విన్న ఇద్దరికీ పైప్రాణాలు పైనే పోయాయి. ఇంతకు ముందు దొరికిన ఆ మాత్రం విశ్రాంతి కూడా దొరక్కపోవడం చూసి, అనవసరంగా కోడిపుంజును మాయం చేసినందుకు బాధ పడ్డారు రాము, రాజు.


6 తేడాలను కనిపెట్టండి



సరైన నీడ ఏది?



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 422

7			1					2
1								
	2			3		7		6
5	3				9	6		
	6		7		1		9	
		4	2				5	8
6		5		7			3	
								4
2					4			5

సుడోకు - 421 సమాధానం

6	3	8	1	2	5	4	9	7
1	4	2	6	7	9	3	5	8
7	9	5	4	3	8	6	2	1
4	5	7	9	6	1	8	3	2
9	8	3	7	4	2	1	6	5
2	6	1	8	5	3	7	4	9
3	1	9	5	8	4	2	7	6
8	7	4	2	9	6	5	1	3
5	2	6	3	1	7	9	8	4

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.